Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 204 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్ సోమవారం18-08-2025 పేజీలు :12 వెల :2/-

## విలేకరులు కావలెను

సత్య మేవ జయతే తెలుగు దినపత్రికలో పనిచేయుటకువిలేకరులు కావలెను..వికారాబాద్.జిల్లా వ్యాప్తంగా వికారాబాద్ మండలం దారుర్, పరిగి, నియోజకవర్గం. పూడూర్. నవాబ్ పేట్. మర్పల్లి. కొడంగల్. కోట్ పల్లి. బంటారం.తాండూర్. నియోజకవర్గం. ప్రతి మండలంలో పనిచేయుటకు యువతి యువకులు కావలెను. కొత్త వారికీ మరియు. అనుభవం ఉన్న వారికీ అవకాశం ఇవ్వబడును. టైమ్ పాస్ కోసం ఫోన్ చేయవద్దు.. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్.

1.జె. భాస్కర్. సత్యమేవ జయతే తెలుగు దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్.

2.వికారాబాద్ జిల్లా. స్టాఫ్ రిపోర్టర్ కిందొడ్డి. అంజయ్య ఫోన్ నెంబర్ 9573042872...

- జీఎస్టీలో తర్వాతి తరం సంస్కరణలకు కేంద్రం కసరత్తు
- ఈ దీపావళికి ప్రజలకు డబుల్ బోనస్ అందిస్తామన్న ప్రధాని
- వస్తు, సేవల ధరలు తగ్గించి సామాన్యులకు మేలు చేయడమే లక్ష్యం
- ప్రస్తుతం ఉన్న నాలుగు శ్లాబుల స్థానంలో రెండు శ్లాబుల విధానం
- నిత్యావసరాలపై 5 శాతం, ఇతర వస్తువులపై 18 శాతం పన్ను ప్రతిపాదన
- సెప్టెంబరులో జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందే అవకాశం
- ఢిల్లీ ట్రాఫిక్ కష్టాలు.. ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేను జాతికి అంకితం చేసిన ప్రధాని.

ఈ ఏడాది దీపావళికి దేశ ప్రజలకు డబుల్ బోనస్ అందుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. వస్తు, సేవల ధరలను తగ్గించి పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు చేకూర్చేందుకు జీఎస్టీలో తర్వాతి తరం సంస్కరణలు తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో రెండు ప్రధాన రహదారి ప్రాజెక్టులను ప్రారంభిస్తూ ఆదివారం ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.సుపరిపాలన విస్తరణే తమకు సంస్కరణ అని పేర్కొన్న ప్రధాని, ప్రజల జీవితాలను, వ్యాపారాలను సులభతరం చేసేందుకు రానున్న రోజుల్లో మరిన్ని సంస్కరణలు రానున్నాయని తెలిపారు. "ఈ ప్రయత్నంలో భాగంగా జీఎస్టీలో తర్వాతి తరం సంస్కరణలు రాబోతున్నాయి.

# ఈ దీపావళికి
# డబుల్ బోనస్



ఈ ఏడాది దీపావళికి దేశ ప్రజలకు డబుల్ బోనస్ అందుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. వస్తు, సేవల ధరలను తగ్గించి పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు చేకూర్చేందుకు జీఎస్టీలో తర్వాతి తరం సంస్కరణలు తీసుకురాను న్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో రెండు ప్రధాన రహదారి ప్రాజెక్టులను ప్రారంభిస్తూ ఆదివారం ఆయన ఈ కీలక ప్రకటన చేశారు.సుపరిపాలన విస్తరణే తమకు సంస్కరణ అని పేర్కొన్న ప్రధాని, ప్రజల జీవితాలను, వ్యాపారాలను సులభతరం చేసేందుకు రానున్న రోజుల్లో మరిన్ని సంస్కరణలు రానున్నాయని తెలిపారు. "ఈ ప్రయత్నంలో భాగంగా జీఎస్టీలో తర్వాతి తరం సంస్కరణలు రాబోతున్నాయి. ఈ దీపావళికి జీఎస్టీ సంస్కరణల రూపంలో పౌరులకు డబుల్ బోనస్ లభిస్తుంది" అని మోదీ అన్నారు. ఈ సంస్కరణలకు సంబంధించిన పూర్తి ఫ్రేమ్‌వర్క్‌ను అన్ని రాష్ట్రాలకు పంపించామని, ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయడానికి అన్ని రాష్ట్రాలు సహకరించాలని ప్రధాని కోరారు. మరోవైపు, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇప్పటికే జీఎస్టీ కౌన్సిల్‌కు కీలక ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుతం ఉన్న 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం అనే నాలుగు శ్లాబుల స్థానంలో...

మిగతా 2లో



# ఇసికి ప్రేమతో మోడీ కొత్త చట్టం


ఔరంగాబాద్: కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ ఆదివారం రాత్రి బీహార్‌లో ఎన్నికల సంఘం ప్ర ధానాధికారి జ్ఞానేశ్ కుమార్‌పై ఘా టుగా స్పందించారు. ప్రతిపక్షాల పట్ల వివక్ష లేదని ఆయన చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బిజెపి సాగించే ఓట్ల చోరీకి ఎన్నికల సంఘం సహకరిస్తూ ఉన్నందున అందుకు ప్రత్యుపకారంగా మోడీ ప్రభుత్వం ఏకంగా ఓ చట్టం తీసుకువచ్చిందని చెప్పారు. ఇది పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణి తంతు అయిందన్నారు. ఎన్నికల సంఘం చర్యలపై ఎవరూ ఎటువంటి చర్యలకు పాల్పడకుండా పూర్తి స్థాయి రక్షణ కల్పించే చట్టాన్ని కేంద్రం మోడీ సారధ్యంలో తీసుకువచ్చింది. ఇది ఇసిని కాపాడే లోపాయికారి ఒప్పందం ఫలితం అని విమర్శించారు. తమ ఓటరు అధికార్ యాత్ర మొదటి రోజు ముగింపు సందర్భంగా ఆయన ఔరంగాబాద్‌లో మాట్లాడారు. సిఇసి వ్యాఖ్యలపై, అఫడవిట్ సమర్పించాలనే సవాలుపై స్పందించారు. తనను అఫిడవిట్ అడుగుతున్నారు . మరి బిజెపి నేతలు ఓట్ల అక్రమాల ఆరోపణలకు దిగితే వాటిపై ఎన్నికల సంఘం ఎందుకు స్పందించలేదని రాహుల్ ప్రశ్నించారు. బిజెపి అధికారం కోసం ఓట్ల చోరీ జరిగిందనేది నిజం. ఇసిని రక్షించేందుకు బిజెపి సర్కారు చట్టం తీసుకువచ్చిందనేది మరీ పచ్చి నిజం అని తేల్చిచెప్పారు. బిజెపికి ఓ న్యాయం, ఇతర పార్టీలకు మరో న్యాయం చేస్తూ అన్ని పార్టీలూ తమకు ఒక్కటే అని సిఇసి చెప్పడం ప్రజాస్వామ్యం పట్ల పరిహాసమే అన్నారు. తన చర్యలను సమర్థించుకునేందుకు

మిగతా 2లో

# వరల్డ్ రికార్డ్... 4 కి.మీ దూరంలో ఉన్న రష్యా సైనికులను కాల్చి చంపిన ఉక్రెయిన్ స్నైపర్

- 13,000 అడుగుల దూరం నుంచి ఇద్దరు రష్యా సైనికులను కాల్చి చంపిన వైనం
- స్థానికంగా తయారైన 'ఎలిగేటర్' రైఫిల్ వినియోగం
- ఏఐ, డ్రోన్ టెక్నాలజీ సాయంతో లక్ష్య ఛేదన
- గత రికార్డును అధిగమించిన ఉక్రెయిన్ సైనికుడు

2లో





# ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టే యోచనలో ఇండియా కూటమి

భారత ఉపరాష్ట్రపతి ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థిని ఎన్డీఏ కూటమి ఖరారు చేసింది. మహారాష్ట్ర గవర్నర్‌గా పనిచేస్తున్న సీనియర్ నేత సీపీ రాధాకృష్ణన్‌ను తమ అభ్యర్థిగా ప్రకటించింది. ప్రస్తుత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అనారోగ్య కారణాలతో తన పదవికి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది.

రాధాకృష్ణన్ ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గవర్నర్‌గా, 1998 నుంచి 2004 వరకు లోక్‌సభ సభ్యుడిగా కూడా పనిచేశారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీలో ఎన్డీఏకు సంఖ్యాబలం స్పష్టంగా ఉంది. సుమారు 422 మంది సభ్యుల మద్దతు ఉండటంతో రాధాకృష్ణన్ విజయం లాంఛనమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఈ ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం ఆగస్టు 7న విడుదల చేసింది. దీని ప్రకారం, సెప్టెంబర్ 9న పోలింగ్ జరగనుంది. నామినేషన్ల దాఖలుకు ఆగస్టు 21 చివరి తేదీ కాగా, ఆగస్టు 22న నామినేషన్ల పరిశీలన, ఆగస్టు 25న నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా నిర్ణయించారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఈ ఎన్నిక జరగనుంది.మరోవైపు, ప్రతిపక్ష 'ఇండియా' కూటమి కూడా తమ తరఫున ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అయితే,

మిగతా 2లో

# వరంగల్ వివాదాలపై సీనియర్లతో కమిటీ




వరంగల్ వివాదాల పరిష్కారానికి సీనియర్ కాంగ్రెస్ నేతలతో కమిటీ నియమించాల్సిందిగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు పార్టీ క్రమశిక్షణా కమిటీ సిఫార్సు చేసింది. పిసి సి క్రమశిక్షణా కమిటీ చైర్మన్, ఎంపి డాక్ట ర్ మల్లు రవి అధ్యక్షతన ఆదివారం కమిటీ సమావేశం జరిగింది. సమావేశానం తరం మల్లు రవి మీడియాతో మాట్లా డుతూ వ రంగల్ జిల్లాలో నెలకొన్న పంచాయితీ ప రిష్కారానికి సీనియర్ నాయకులతో

మిగతా 2లో

# టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌పై చంద్రబాబు ఫైర్!



2లో

- జూనియర్ ఎన్టీఆర్ సినిమాపై అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వివాదాస్పద వ్యాఖ్యలు
- తెలుగు యువత నేతతో మాట్లాడిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్
- ఎమ్మెల్యే తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం

గ్రూపు రాజకీయాలు, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే సహించేది లేదని స్పష్టీకరణ

# బనకచర్ల ప్రాజెక్టుపై తేల్చాల్సింది కేంద్రమే!

- బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభ్యంతరం
- మిగులు జలాల వాటాలు తేలాకే కొత్త ప్రాజెక్టులు కట్టాలని స్పష్టీకరణ



2



# కాళేశ్వరంపై కుట్రలు

కాళేశ్వరం మో టార్లు ఆన్ చేస్తారా.. లేకుంటే లక్షలాది రైతులతో కలి సి వెళ్లి మమ్మల్ని ఆన్ చేసుకోమంటారా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కాంగ్రె స్ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. సీఎం రేవం త్ రెడ్డి నేరపూరిత నిర్ణయాలతో నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతుందన్నారు. బిఆర్ఎస్‌పై బురద చల్లడానికే కాళేశ్వరం మోటార్లను ఆన్ చేయడం లేదని మండిపడ్డారు. రాజకీయాలు మాని

మిగతా 2లో

# రుజువులు చూపాలి లేదా క్షమాపణ చెప్పాలి



న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఓటుచోరీపై దేశవ్యాప్తంగా చేపట్టిన ఆందోళన ప ట్ల ఎన్నికల కమిషన్ తీవ్రంగా స్పం దించింది. ఓటు చోరీపై ఎన్నికల కమిషన్ కు అన్నిరుజువులతో ఏడురోజుల్లోగా అఫిడవిట్ సమర్పించాలని లేదా బహిరంగ క్షమాపణ చెప్పాలని ప్రధాన ఎ న్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ గడువు విధించారు. రుజువులతో అఫిడవిట్ సమర్పించలేని పక్షంలో ఆ ఆరోపణలు అ న్నీ అవాస్తవాలని భావించవలసి వస్తుందని ఈసీఐ పేర్కొన్నా రు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఆదివారంనాడు మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ ఆరోపణలపై ప్రత్యేకంగా మాట్లాడారు. ఓట్ల చోరీపై రుజువులతో కూడిన అఫిడవిట్ సమర్పించాలి

మిగతా 2లో

# ఈ దీపావళికి డబుల్ బోనస్

అనే రెండు శ్లాబులను మాత్రమే అమలు చేయాలని ప్రతిపాదించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ కొత్త విధానంలో సామాన్యులు వినియోగించే నిత్యావసరాలు, ఆరోగ్య సంబంధిత వస్తువులు, హస్తకళలు, ఇన్సూరెన్స్ వంటి వాటిపై 5 శాతం పన్ను ఉంటుంది. ఫ్రిజ్, టీవీ వంటి ఇతర తయారీ వస్తువులపై 18 శాతం పన్ను విధిస్తారు. అయితే, సిగరెట్లు, పొగాకు, చక్కెర పానీయాలు, పాన్ మసాలా వంటి లగ్జరీ, హానికర వస్తువులపై 40 శాతం ప్రత్యేక పన్ను విధానం యథాతథంగా కొనసాగుతుంది. ఈ ప్రతిపాదనపై చర్చించి ఆమోదం తెలిపేందుకు జీఎస్టీ కౌన్సిల్ సెప్టెంబరులో సమావేశమయ్యే అవకాశం ఉంది. ఈ పన్నుల హేతుబద్ధీకరణ ద్వారా దేశంలో వినియోగం పెరిగి, ఆర్థిక వృద్ధికి ఊతం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పులు ప్రతి ఇంటికీ, ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు మేలు చేస్తాయని, అలాగే వ్యాపారులు, పారిశ్రామికవేత్తలకు కూడా ప్రయోజనం చేకూరుస్తాయని ప్రధాని వివరించారు. ఇకపై 20 నిమిషాల్లోనే నోయిడా నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు వెళ్లొచ్చు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ఢిల్లీ సెక్షన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. 11 వేల కోట్ల హైవే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు ప్రధాని. అంతేకాకుండా %చీజ=%లో అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-2 ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశారు. ఢిల్లీ శివారు ప్రాంతాలను కలుపుతూ 76 కిలోమీటర్లు అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ కారిడార్ ప్రాజెక్ట్‌తో అనుసంధానం చేశారు. ఇకపై 20 నిమిషాల్లోనే నోయిడా నుంచి ఢిల్లీ ఎయిర్‌పోర్టుకు వెళ్లొచ్చు. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే ఢిల్లీ సెక్షన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. 11 వేల కోట్ల హైవే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు ప్రధాని. అంతేకాకుండా %చీజ=%లో అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-2 ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేశారు. ఢిల్లీ శివారు ప్రాంతాలను కలుపుతూ 76 కిలోమీటర్లు అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ కారిడార్ ప్రాజెక్ట్‌తో అనుసంధానం చేశారు. ఎయిర్‌పోర్టు సమీపంలోని అలీపూర్ నుంచి మహిపాల్‌పూర్ వరకు రోడ్ కారిడార్ నిర్మించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధాని మోదీతో పాటు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా, హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ, పలువురు సీనియర్ బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, ఈ రోడ్లు ప్రయాణాన్ని సులభతరం చేయడమే కాకుండా, ఢిల్లీ-ఎన్‌సిఆర్ అభివృద్ధికి కొత్త ఊపునిస్తాయని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం (ఆగస్టు 17) ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లోని రెండు ప్రధాన రోడ్డు ప్రాజెక్టులను ప్రారంభించారు. 'అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేలోని ఢిల్లీ విభాగం. ఈ కొత్త రోడ్ల ప్రారంభంతో, ఇప్పుడు గురుగ్రామ్ నుండి ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు ప్రయాణాన్ని కేవలం 20 నిమిషాల్లో పూర్తి చేయవచ్చు. ఇది లక్షలాది మంది ప్రయాణీకులకు గొప్ప ఉపశమనం కలిగిస్తుంది. ఢిల్లీ-ఎన్‌సిఆర్ ట్రాఫిక్ సమస్యను కూడా చాలా వరకు తగ్గిస్తుంది. దీని ఖర్చు దాదాపు రూ. 11000 కోట్లు. ఢిల్లీ రింగ్ రోడ్‌లో రద్దీని తగ్గించేందుకు ద్వారకా ఎక్స్‌ప్రెస్ వేను దాదాపు 7 వేల 716 కోట్లతో చేపట్టారు. ముండ్కా, బక్కర్ వాలా, నజాఫ్ గడ్, ద్వారకను కలుపుతూ 6 లేన్ల హైవేను నిర్మించారు. ఢిల్లీ-చండీగఢ్, ఢిల్లీ-రోహతక్ వంటి ప్రధాన మార్గాలను అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్ కారిడార్ కలుపుతోంది. ఈ రహదారి ద్వారా ఢిల్లీ-ఎన్‌సిఆర్ పశ్చిమ ప్రాంతాల నుండి వచ్చి వెళ్ళే ప్రజల ప్రయాణం గతంలో కంటే సులభం అవుతుంది. ఇప్పటివరకు, ఈ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఢిల్లీలోని రద్దీగా ఉండే రింగ్ రోడ్డు గుండా వెళ్ళాల్సి వచ్చింది. అక్కడ ట్రాఫిక్ జామ్‌ల కారణంగా గంటల తరబడి ప్రయాణించాల్సి వచ్చింది. కానీ ఇప్పుడు , ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే తెరవడంతో, రింగ్ రోడ్డుపై వాహనాల భారం తగ్గుతుంది. దీని ప్రయోజనం రింగ్ రోడ్డుపైనే కాకుండా, , బారాపుల్లా వంటి ప్రధాన రహదారులపై కూడా కలుస్తుంది.

# ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

ఎన్డీఏకు ఉన్న బలమైన సంఖ్యాబలం ముందు ప్రతిపక్ష అభ్యర్థి గెలుపు కష్టమేనని అర్థమవుతోంది. ఉప రాష్ట్రపతి అభ్యర్థిపై కసరత్తు ముమ్మరం చేసిన భారతీయ జనతా పార్టీ.. ఆదివారం కీలక నిర్ణయం తీసుకుంది.. ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ను బీజేపీ అధిష్టానం ప్రకటించింది. గతంలో కోయంబత్తురు ఎంపీగా పనిచేసిన రాధాకృష్ణన్.. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిపై కసరత్తు ముమ్మరం చేసిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ).. ఆదివారం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ను బీజేపీ అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రకటన విడుదల చేశారు. సీపీ రాధాకృష్ణన్ స్వస్థలం తమిళనాడు.. గతంలో కోయంబత్తురు ఎంపీగా పనిచేసిన రాధాకృష్ణన్.. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నారు. ఆయన గతంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఢిల్లీలో జరిగిన బీజేపీ పార్లమెంటరీ బోర్డ్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ భేటీలో ప్రధాని మోదీతో పాటు పార్టీ అగ్రనేతలు నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు.. ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై చర్చించిన నేతలు సీపీ రాధాకృష్ణన్ ను ఫైనల్ చేశారు. చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ అక్టోబర్ 20, 1957న తమిళనాడులోని తిరుప్పూర్‌లో జన్మించారు. ఆయన 2003 నుంచి 2006 వరకు తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. రాధాకృష్ణన్ తన రాజకీయ ప్రయాణంలో అనేక కీలక పదవులను నిర్వహించారు. ఆయన జూలై 31, 2024న మహారాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు, ఆయన ఫిబ్రవరి 18, 2023 నుండి జూలై 30, 2024 వరకు జార్ండ్ గవర్నర్‌గా పనిచేశారు. మార్చి నుండి జూలై 2024 వరకు తెలంగాణ గవర్నర్‌గా, మార్చి నుండి ఆగస్టు 2024 వరకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు కూడా నిర్వహించారు. 1998, 1999లో కోయంబత్తూరు నుంచి లోక్‌సభకు రెండు సార్లు ప్రాతినిధ్యం వహించారు. బిజెపికి అనుబంధమైన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్), భారతీయ జనసంఘ్‌లతో ఆయన తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. బిజెపి తమిళనాడు అధ్యక్షుడిగా, రాధాకృష్ణన్ నదుల అనుసంధానం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, అంటరానితనాన్ని నిర్మూలించడం వంటి అంశాలపై దృష్టి సారించి 93 రోజుల రథయాత్రను ప్రారంభించారు. పార్లమెంటులో, ఆయన వస్త్రాలపై స్టాండింగ్ కమిటీకి అధ్యక్షత వహించారు.. ఆర్థిక, ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన అనేక కమిటీలకు ప్రాతినిధ్యం వహించారు. కాగా.. ఈనెల 19న ఎన్డీఏ పార్లమెంటరీ బోర్డు సమావేశం జరగనుంది. ఆ భేటీలో ఉపరాష్ట్రపతి అభ్యర్థిని ప్రకటించనున్నారు. ఈ నెల 21న ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది.

# ఇసికి ప్రేమతో మోడీ కొత్త చట్టం

ఎన్నికల సంఘం విలేకరులసమావేశం పెట్టింది. మంచిదే అయితే ఇందులోనూ అసత్యాలకు దిగారు కదా అని రాహుల్ విమర్శించారు. ఎన్నికల ప్రక్రియల సిసిటీవీ ఫుటేజ్‌ల నిబంధనల చట్టంలో ప్రభుత్వం ఎందుకు మార్పులు తలపెట్టిందని తాను ఈ విషయాన్ని సిఇసిని ప్రశ్నిస్తున్నానని చెప్పారు. సిసిటీవీ ఫుటేజ్‌లు చూపెట్టడకుండా ఇసికి రక్షణ కల్పించారు. ఎందుకంటే అవి వెలుగులోకి వస్తే బిజెపి అక్రమాలు బయటపడుతాయని, అధికారానికి గండి పడుతుందనే భయం అని విమర్శించారు. ఓట్ల చోరీ క్రమంలోనే ఇప్పుడు అప్పటి చట్టం గురించి కూడా జాతికి తెలియాల్సి ఉందన్నారు. దేశంలోని ఏ కోర్టులో కూడా ఎన్నికల సంఘం చర్యలపై వ్యాజ్యాలు దాఖలు కాకుండా చట్టం తీసుకురావడం అసాధారణమా కాదా? ఇది ఏ స్థాయి వివక్షత అని రాహుల్ నిలదీశారు. అమిత్ షా, మోడీలు సాగిస్తోన్న దేశ వ్యాప్త ఓట్ల చోరీకి ఎన్నికల సంఘం బాసటగా ఉన్నందునే , అందుకు స్పందనగా 2023 చట్టం వచ్చిందని రాహుల్ చెప్పారు. దీనితో పలు ఇంతకు ముందటి నిబంధనలు లేకుండా పొయ్యాయి. ఓట్ల కోసం బిజెపి ఆగడాలకు వత్తాసు పలికే ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు వీలు లేకుండా పోయిందన్నారు. తమది అంబేద్కర్ రాజ్యాంగ రక్షణ పోరు, వారిది అధికార భద్రతా వెంపర్లాట అని విమర్శించారు. ఇందుకు ఎన్నికల సంఘం రక్షణ కవచం కావడం దారుణం అన్నారు. ఒక వ్యక్తి ఒక ఓటు కోసం కాంగ్రెస్ ఉద్యమం ఆగబోదన్నారు. సాసారం: కేంద్ర ఎన్నికల సంఘం అధికార బిజెపితో కుమ్మక్కు అయ్యి ఎన్నికలచౌర్యానికి పాల్పడుతోంది. ఈ విషయం మొత్తం దేశానికి తెలిసిపోయిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలను హైజాక్ చేసేందుకు జరుగుతున్న కుట్రను అడ్డుకుని తీరుతామని ఆయన తెలిపారు. సర్ ప్రక్రియపై తీవ్ర స్థాయిలో దాడికి దిగిన రాహుల్ , నిజమైన ఓటర్ల హక్కును కాపాడేందుకు ఉద్యమించామని వివరించారు. బీహార్‌లో ఓటర్ అధికార్ యాత్ర పేరిట రాహుల్ 1300 కిలోమీటర్ల యాత్ర ఆరంభం అయింది. సాసారంలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓట్ల చౌర్యం ద్వారా ఎన్నికల సంఘం ప్రజా తీర్పును దారి మళ్లించిందని ఆరోపించారు. ఇప్పుడు బీహార్‌పై కూడా ఇదే విధంగా కన్నేశారు. ఈ కుట్రను తమ పార్టీ సాగనివ్వదని, ఓటు భద్రం నినాదంతో ప్రజల వద్దకు వెళ్లుతున్నానని లోక్‌సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ తెలిపారు. ఓట్లచోరీకి ఆధారాలు చూపాలని, ఆరోపణలతో అఫిడవిట్ ఇవ్వాలని ఎన్నికల సంఘం తనను ఆదేశించిందని గుర్తు చేశారు. ఓడినప్పుడు బిజెపి నేతలు ఓట్ల అక్రమాలు జరిగాయని చెపితేవారి పట్ల ఎన్నికల సంఘం మౌనంగా ఉందని విమర్శించారు. బీహార్ ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాల్సి ఉంది. ఇందుకు ప్రజల మద్దతు కూడగట్టుకుని ముందుకు వెళ్లుతామని, ఇప్పటి యాత్ర ఇందుకోసమే అని రాహుల్ చెప్పారు. దేశ ప్రజలు అనేకం కోల్పోయి ఇప్పుడు ఓటు అధికారంతో ఉన్నారు. చివరికి పేదల ఈ పవర్‌ను కూడా లాక్కునేందుకు కుట్ర జరుగుతోందని విమర్శించారు. ఓట్ల అక్రమాల విషయం ప్రజలందరికీ తెలుసు. ఇకపై బీహార్, బెంగాల్ , మహారాష్ట్ర , అసోం ఎక్కడైనా ఎటువంటి స్థాయిలో ఓట్ల చౌర్యం జరిగినా తాము పట్టుకుని , ప్రజల ముందుకు ఈ చర్య గురించి తెలియచేస్తామని చెప్పారు. ప్రధాని మోడీ సామాన్యుడి ఓటును లాక్కుంటున్నాడు. వారి డబ్బును తాను ఎంచుకున్న 56 మంది అత్యంత సంపన్నులకు కట్టబెట్టాడని, , ఈ ప్రభుత్వం బిలియనీర్లతోనే నడుస్తోందని దాడికి దిగారు. రాజ్యాంగ పరిరక్షణకు సాగేదే తమ ఉద్యమం అన్నారు. ఈ యాత్ర ప్రారంభ దశలోనే కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ప్రసంగించారు. బిజెపి అధికారం సాగినంత కాలం ప్రజల హక్కులకు రక్షణ లేదన్నారు. రాజ్యాంగానికి అన్ని విధాలుగా ముప్పు పొంచి ఉందని విమర్శించారు. యాత్రలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ ప్రధాన కార్యదర్శి ఇతరులు పాల్గొన్నారు.

# రుజువులు చూపాలి లేదా క్షమాపణ చెప్పాలి

మరో అవకాశం లేదు. 7 రోజులలోగా అఫిడవిట్ అందని పక్షంలో ఆ ఆరోపణలు అన్నీ నిరాధారమైనవిగా అర్థం చేసుకోవల్సివస్తుందని ఈసీఐ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు రాజ్యాంగాన్ని అవమానించడమే అని జ్ఞానేష్ కుమార్ పేర్కొన్నారు. ఓటు చోరీ వంటి పదాలు ప్రజాస్వామ సంస్థలను బలహీన పరుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయ పార్టీలు, రాజకీయ లబ్ధి కోసం ఓటర్లను లక్ష్యంగా చేసుకునేందుకు ప్రతిపక్షనేత ఎన్నికల కమిషన్ ను వేదికగా ఉపయోగించుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఎన్నికల కమిషన్ నే లక్ష్యంగా పెట్టుకుని భారతీయ ఓటర్లను ఆకట్టుకునేందుకు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపిస్తూ, ఈ విషయాన్ని దేశ ప్రజలకు స్పష్టం చేయాలని ఎన్నికల కమిషన్ భావిస్తోందని ఆయన అన్నారు. ఎన్నికల కమిషన్ పేదలు, ధనికులు, వృద్ధులు, యువకులు, మహిళలు అన్న తేడా లేకుండా ఎటువంటి వివక్ష లేకుండా కృషి చేస్తున్నదని, ఇక ముందు కూడా అదే లక్ష్యంతో సాగుతుందని జ్ఞానేష్ కుమార్ స్పష్టంచేశారు. ఒకరే రెండు, మూడు ఓట్లు వేస్తున్నారన్న ఆరోపణలపై స్పందిస్తూ, కొంతమంది ఓటర్లు ఆందోళన వ్యక్తం చేసినప్పటికీ ఎటువంటి రుజువులు లభించలేదని ఆయన అన్నారు. ఎన్నికల సంఘం కానీ, భారతీయ ఓటర్లు కానీ ఇలాంటి తప్పుడు ఆరోపణలకు భయపడబోరని ఈసిఐ స్పష్టం చేశారు. దుష్ప్రచారానికి దిగుతున్నాయని ఎన్నికల ప్రధానాధికారి (సిఇసి) జానేశ్ కుమార్ విమర్శించారు. బీహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (సర్)ను ఆయన పూర్తి స్థాయిలో సమర్థించారు. ఏదో ఒక ప్రయోజనాన్ని ఆశించి ఇసి భుజాలపై తుపాకీ పెట్టి కాల్చడం దారుణం అని ఆయన స్పందించారు. సర్, ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని పేర్కొంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విపక్షాల తరపున పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ దశలో ఎన్నికల సంఘం అసాధారణ రీతిలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించింది. అసెంబ్లీ ఎన్నికలు జరిగే బీహార్‌ను కేంద్రీకృతం చేసుకుని ప్రతిపక్షాలు సాగిస్తున్న ఓట్లచోరీ వాదన నిరాధారం అని జ్ఞానేశ్ కుమార్ ఎదురుదాడికి దిగారు. ఓట్లు రెండింతలు అయ్యాయని, బోగస్ ఓట్లు వచ్చిచేరాయని చెప్పడం తప్పని అన్నారు. సర్ ప్రక్రియను పూర్తి స్థాయిలో విజయవంతం చేసేందుకు సంబంధిత భాగస్వామ్య పక్షాలు పారదర్శకతతో పనిచేస్తున్నాయని వివరించారు. ఇండియా కూటమి తరపున రాహుల్ సారధ్యలో బీహార్‌లో ఓటర్ అధికార్ యాత్ర ఆరంభించిన దశలోనే ఎన్నికల సంఘం దీనిపై స్పందించింది. బీహార్‌లోనే కాకుండా ఎక్కడైనా ఎన్నికల సంఘం ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితాల సవరణ చేపట్టడం, సంబంధిత పక్షాలకు అభ్యంతరాలు సమ్మతి గురించి తెలియచేయడం ఆనవాయితీ అని సిఇసి తెలిపారు. డబుల్ ఓటింగ్, ఓట్ల చోరీ కోసమే హడావిడిగా సర్ ప్రక్రియకు దిగారనే వాదన బూటకమన్నారు. హడావిడి ప్రక్రియ అనడం మిథ్య అని స్పందించారు. కొన్ని పార్టీల తీరు పరమ దారుణంగా ఉందని అన్నారు. అభ్యంతరాలను తెలియచేయడానికి ఇప్పటికీ 15 రోజుల గడువు ఉంది. దీనిని గుర్తించాల్సి ఉందన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగే దిశలో కమిషన్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు జరిగాయి. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు కలిసి అంతా సవ్యంగా సాగేలా చేస్తున్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. తమకు అన్ని రాజకీయ పార్టీలు ఒక్కటే. ఇందులో వివక్షత లేదని, ప్రతిపక్షం, అధికార పక్షం అనే తేడా తమకు ఉండదని స్పష్టం చేశారు. పైగా అభ్యంతరాలు ఉంటే తెలియచేస్తూ 45 రోజుల గడువులోగా పార్టీలు ముందుకు రాకపోవడం, మరో వైపు ఓట్లచోరీ జరిగిందని ఆరోపించడం దేశ రాజ్యాంగాన్ని అవమానించినట్లే అవుతుందని చెప్పారు. నిరాధార ఆరోపణలకు , ఏదో జరిగిందనే దుష్ప్రచారానికి ఎన్నికల సంఘం భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాము ఓటర్లనే పట్టించుకుంటామని, అనుచిత రాజకీయ దుష్ప్రచారం గురించి ఆందోళన చెందేది లేదని సిఇసి తెలిపారు.

# బనకచర్ల ప్రాజెక్టుపై తేల్చాల్సింది కేంద్రమే!

గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. మిగులు జలాల్లో తెలుగు రాష్ట్రాల వాటాలు తేలిన తర్వాతే గోదావరిపై ఎలాంటి కొత్త ప్రాజెక్టులు నిర్మించినా అది చట్టబద్ధంగా, న్యాయంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నీటి వాటాలను నిర్ధారించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు.
'ఓట్ల చోరీ' నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖపట్నంలో వచ్చిన భట్టి విక్రమార్క, మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. నదీ జలాల కోసమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. ప్రస్తుతం తమ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయి, నీటి కేటాయింపులు జరిగిన తర్వాతే మిగులు జలాల అంశంపై ఒక స్పష్టత వస్తుందని ఆయన వివరించారు. అయితే, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును గట్టిగా సమర్థించారు. పోలవరం నుంచి వృథాగా సముద్రంలోకి పోయే గోదావరి వరద నీటిని బనకచర్లకు తరలించి రాయలసీమను అభివృద్ధి చేయాలనేది తమ లక్ష్యమని చెప్పారు. దిగువ రాష్ట్రంగా వరదల వల్ల తాము నష్టపోతున్నామని, అలాంటి వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుతో ఏ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరగదని భరోసా ఇచ్చారు. ఇదే పర్యటనలో, భట్టి విక్రమార్క ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఓట్ల చోరీ' నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం పౌర హక్కులను కాలరాయడమేనని ఆయన అన్నారు. అర్హులైన ఓటర్లను తొలగించి, బోగస్ ఓట్లను చేర్చడం ద్వారా బీజేపీ లబ్ధి పొందిందని ఆరోపించారు. ఈ విషయంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా మోదీ ప్రభుత్వాన్ని నిలదీశారని గుర్తుచేశారు. అయినప్పటికీ, ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన విమర్శించారు. ఈ ప్రాజెక్టులు కట్టిన టీఎంసీ కంటే కెపాసిటీ కంటే చాలా తక్కువ టీఎంసీల నీళ్లు నిలువగా ఉన్నాయన్నారు. వెంటనే సరిపోయే టీఎంసీల నీళ్లను నింపాలన్నారు. ఈ రిజర్వాయర్‌లన్ని నింపితే యాసంగిలో లక్షల ఎకరాల్లో పంట పండుతుందన్నారు. ఈ వాన కాలంలో సగం సాగు కూడా కాలేదన్నారు. నీటిని ఒడిసిపడితే యాసంగిలోనైనా పూర్తి పంట పండే అవకాశం ఉంటుందన్నారు. తాను రాజకీయాల కోసం ఇవన్నీ చెప్పడం లేదని రాష్ట్ర మాజీ నీటిపారుదల శాఖ మంత్రి గా పనిచేసిన అవగాహనతో చెబుతున్నానన్నారు. రోజు కృష్ణా, గోదావరి నీళ్లు సముద్రం పాలయితుంటే గుడ్లప్పగించి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి చూడడం తప్ప ఏం చేయడం లేదన్నారు.

## టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పై చంద్రబాబు ఫైర్!

తెలుగుదేశం పార్టీలో గ్రూపు రాజకీయాలు, అంతర్గత విభేదాలపై ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి, వర్గ పోరును ప్రోత్సహించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఆయన గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యంగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పనితీరుపై చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీకి నష్టం కలిగించే చర్యలు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.
వివరాల్లోకి వెళితే, 'వార్ 2' సినిమా విడుదల సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, తెలుగు యువత నాయకుడు గుత్తా ధనుంజయ నాయుడుతో ఫోన్‌లో మాట్లాడిన ఆడియో సంభాషణ ఒకటి బయటకు వచ్చింది. లోకేశ్ గురించి మాట్లాడితే ఎవరినీ వదిలిపెట్టేది లేదని, అనంతపురంలో సినిమా ప్రదర్శనకు వీల్లేదంటూ ఎమ్మెల్యే తీవ్రమైన భాషలో హెచ్చరించినట్లు ఆ ఆడియోలో ఉంది. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ అంశం చంద్రబాబు దృష్టికి వెళ్లినట్టు తాజా పరిణామాల ద్వారా అర్థమవుతోంది. అనంతపురంతో పాటు ఆముదాలవలస, గుంటూరు ఈస్ట్ నియోజకవర్గాల ఎమ్మెల్యేల తీరుపై కూడా ఆయన అసహనంగా ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నేతల వ్యక్తిగత చర్యల వల్ల పార్టీకి నష్టం వాటిల్లితే, ఆ భారాన్ని పార్టీ ఎందుకు మోయాలని ఆయన సూటిగా ప్రశ్నించినట్లు సమాచారం. ఇలాంటివి పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

## కాళేశ్వరంపై కుట్రలు

రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయాల ని సూచించారు. ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి ప్రాజెక్టులను నింపాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యంగా మారాయన్నారు. కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యిలాగా కాళేశ్వరం ప్రాజెక్టు ఉంటే ఈ ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి వదిలి పడావుపెడుతుందన్నారు. నంది మేడారంలో బటన్ నొక్కితే రోజుకి రెండు టీఎంసీల నీళ్లు వస్తాయన్నారు. నీళ్ల విలువ రైతులకు తెలుస్తుంది కానీ రేవంత్ రె డ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు తెలియదన్నారు. కెసిఆర్ రైతుబిడ్డ కాబట్టే నీటి విలువ తెలిసి ప్రతి నీటి బొట్టును వృధా చేయకుండా ప్రాజెక్టులు కట్టి ఒడిసిపట్టారని గుర్తు చేశారు. కృష్ణా,గోదావరి నీళ్లు సముద్రం పాలైతుంటే రేవంత్ రెడ్డి కళ్లప్పగించి చూస్తున్నాడని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిందని చెప్పిన అబద్ధాన్ని నిజం చేసేందుకే కాంగ్రెస్ సర్కార్ మోటార్లను ఆన్ చేయకుండా కుట్రలు చేస్తుందన్నారు. వరద నీటిని ఒడిసిపట్టి రిజర్వాయర్లు, చెరువులు నింపితే యాసంగిలో లక్షల ఎకరాల పంట పండుతుందన్నారు. అసలు ఈ రాష్ట్రంలో ఇరిగేషన్ శాఖకు మంత్రి ఉన్నాడా అని ప్రశ్నించారు. వెంటనే మోటార్లను ఆన్ చేసి రోజుకి రెండు టీఎంసీలు నీళ్లు మిడ్ మానేరుకు, అక్కడి నుండి మిగతా రిజర్వాయర్లకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం మోటార్లను కక్షపూరితంగా పనికిరాకుండా చేయాలని రోజుకు రెండుసార్లు ఆన్ ఆఫ్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా చేస్తే మోటార్లు కాలిపోతాయని బీహెచ్ఈఎల్ చెప్పిన వినకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇవి ఇంట్లో ఉండే మోటార్లు కావని పదేపదే ఆన్ ఆఫ్ చేస్తే బెరింగ్లు చెడిపోయి మోటార్లు కాలిపోయే అవకాశం ఉంటుందన్నారు. దీంతో వేల కోట్ల నష్టం వాటిల్లుతుందన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో 62 వేల క్యూసెక్కుల వరద వస్తుందన్నారు. కడెం ప్రాజెక్టుకు లక్ష యాభై వేల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ పూర్తి వరద కడెం ప్రాజెక్టు నుండి శ్రీపాద ఎల్లంపల్లి కి వస్తుందన్నారు. నంది మేడారంలో కటక ఒత్తితే రోజుకి రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మిడ్ మానేరులో పడతాయన్నారు. వారం రోజుల కిందనే ఈ విషయాన్ని ఉత్తంమ్ కుమార్ రెడ్డికి తెలుపుతూ రాసిన ఉత్తరాన్ని పట్టించుకోవడం లేదన్నారు. అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు ఖాళీగా ఉండడంతో పాటు చెరువులన్నీ ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టులు కట్టిన టీఎంసీ కంటే కెపాసిటీ కంటే చాలా తక్కువ టీఎంసీల నీళ్లు నిలువగా ఉన్నాయన్నారు. వెంటనే సరిపోయే టీఎంసీల నీళ్లను నింపాలన్నారు. ఈ రిజర్వాయర్‌లన్ని నింపితే యాసంగిలో లక్షల ఎకరాల్లో పంట పండుతుందన్నారు. ఈ వాన కాలంలో సగం సాగు కూడా కాలేదన్నారు. నీటిని ఒడిసిపడితే యాసంగిలోనైనా పూర్తి పంట పండే అవకాశం ఉంటుందన్నారు. తాను రాజకీయాల కోసం ఇవన్నీ చెప్పడం లేదని రాష్ట్ర మాజీ నీటిపారుదల శాఖ మంత్రి గా పనిచేసిన అవగాహనతో చెబుతున్నానన్నారు. రోజు కృష్ణా, గోదావరి నీళ్లు సముద్రం పాలయితుంటే గుడ్లప్పగించి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి చూడడం తప్ప ఏం చేయడం లేదన్నారు. కేసీఆర్, హరీష్ రావు, మా పార్టీ నాయకులపై మీకు కోపం ఉంటే మాకు శిక్షించాలి తప్ప రైతులకు ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఎస్సారెస్పీలో 61 టిఎంసిలు వచ్చాయన్నారు. అలాగే లక్ష 51 క్యూసెక్కుల వరద ఎస్సారెస్పీకి వస్తుందన్నారు. నీటిని విడుదల చేయకుండా ఈ ప్రభుత్వం రైతులను గోస పెడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మళ్లీ కరువు మొదలైందన్నారు. ఒకవైపు ఎరువుల కోసం గంటల తరబడి లైన్లో నిలబడి చెప్పులు వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పంట పెట్టుబడి, రైతు బీమా,పంట బీమా, కరెంటు, సాగునీటి కోసం రైతులు ఎంతో ఎదురు చూస్తున్నారన్నారు. అదే కేసీఆర్ పాలనలో రైతులు ఏ రోజు ఇబ్బందులకు గురి కాలేదని గుర్తు చేశారు. కృష్ణా నదిలో హైడెల్ పవర్ ఉచితంగా ఉత్పత్తి అవుతుందన్నారు..జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ లో రోజుకు 42 మిలియన్ యూనిట్లు కరెంటు ఉత్పత్తి అవుతదన్నారు. ఎమ్మార్పీ ప్రాజెక్టు మోటర్లు ఆన్ చేయక పోవడంతో నల్గొండ జిల్లాకి నష్టం జరుగుతుందన్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ లో గేట్లు ఎత్తి నీళ్లను సముద్రంలోకి వదులుతున్నారు కానీ మోటర్లు ఆన్ చేసి నీళ్లను ఒడిసిపట్టడం లేదన్నారు. కల్వకుర్తిలో మూడు మోటర్లు నడపవలసి ఉంటే కేవలం ఒక్క మోటార్ మాత్రమే నడుపుతున్నారన్నారు. దేవాదులలో ఐదుగురు మంత్రులు వెళ్లి ఫేస్ 3 ప్రారంభించారని ఇప్పటికీ దేవాదుల మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించాడు. వరంగల్ జిల్లా రైతులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అలాగే కల్వకుర్తి మోటార్ ఆన్ చేయక మహబూబ్‌నగర్ జిల్లాకి నష్టం చేకూరుతుందన్నారు. కాళేశ్వరం మోటార్ ఆన్ చేయకుంటే ఉమ్మడి కరీంనగర్, మెదక్, వరంగల్ జిల్లాలకు నష్టం జరుగుతుందన్నారు. కాంగ్రెసోళ్లు కమిషన్ల కోసం పనిచేయడం మాని రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేయాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో నాయకులు రాజనర్సు, రాధాకృష్ణ శర్మ, సంపత్ రెడ్డి, సోమిరెడ్డి, మాణిక్య రెడ్డి, భూపేష్, శ్రీకాంత్ రెడ్డి, శ్రీహరి యాదవ్, రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## వరల్డ్ రికార్డ్... 4 కి.మీ దూరంలో ఉన్న రష్యా సైనికులను కాల్చి చంపిన ఉక్రెయిన్ స్నైపర్

రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు చెందిన ఓ స్నైపర్ అసాధారణ ప్రతిభతో ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఏకంగా 13,000 అడుగుల (దాదాపు 4 కిలోమీటర్లు) దూరం నుంచి రష్యా సైనికుడిని గురితప్పకుండా కాల్చి చంపి చరిత్ర సృష్టించాడు. ఈ విషయాన్ని కీవ్‌పోస్ట్ పత్రిక అధికారికంగా ప్రకటించింది. పొక్రొవొస్క్ ప్రాంతంలో ఆగస్టు 14న ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సైనిక వర్గాలు తెలిపాయి. స్థానికంగా తయారు చేసిన శక్తివంతమైన 'ఎలిగేటర్ 14.5 ఎంఎం' రైఫిల్‌తో ఈ స్నైపర్ ఇద్దరు రష్యా సైనికులను మట్టుబెట్టినట్లు సమాచారం. ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతం చేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకున్నట్లు మిలిటరీ జర్నలిస్ట్ యూరి బుట్సోవ్ ధ్రువీకరించారు. గతంలో అత్యంత దూరం నుంచి లక్ష్యాన్ని ఛేదించిన రికార్డు కూడా ఉక్రెయిన్ సైనికుడి పేరిటే ఉంది. అప్పట్లో 12,400 అడుగుల దూరం నుంచి ఓ రష్యా సైనికుడిని హతమార్చగా, తాజా ఘటనతో ఆ రికార్డు బద్దలైంది. రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా నేత ట్రంప్ మధ్య భేటీకి ఒక్క రోజు ముందు ఈ రికార్డు నమోదు కావడం గమనార్హం. ఇటీవల కాలంలో రష్యా దాడులను తీవ్రంగా ఎదుర్కొంటున్న పొక్రొవొస్క్ ప్రాంతంలో ఈ ఘనత సాధించడం ఉక్రెయిన్ సైన్యం యొక్క సాంకేతిక నైపుణ్యానికి, పోరాట పటిమకు నిదర్శనంగా నిలుస్తోంది.

## వరంగల్ వివాదాలపై సీనియర్లతో కమిటీ

నియమించాల్సిందిగా పిసిసి అధ్యక్షునికి సిఫార్సు చేస్తూ లేఖ రాయాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు తాను లేఖ రాశానని ఆయన తెలిపారు. గజ్వేల్ డిసిసి నర్సారెడ్డి దాడి ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఘటనపై పూర్తి వివరాలు సేకరించామని ఆయన చెప్పారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జి. వివేక్ సమక్షంలో ఈ ఘటన జరిగిందని, దీంతో మంత్రి వివేక్ నుంచి కూడా సమాచారం సేకరించామని అన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తరచూ చేస్తున్న వివాదస్పద వ్యాఖ్యలపై పరిశీలన చేయాల్సిందిగా పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ క్రమశిక్షణా కమిటీకి సూచన చేశారని ఆయన తెలిపారు. దీంతో తాము వివరాలు సేకరిస్తున్నామన్నారు. రాజగోపాల్ రెడ్డి ఎవరిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు ?, ఎందుకు అలా మాట్లాడాల్సి వచ్చిందన్న సమాచారాన్నీ సేకరిస్తామని ఆయన తెలిపారు. ఈ విషయపై తాము వచ్చే మంగళవారం మరోసారి సమావేశం కానున్నామని ఆయన చెప్పారు. తాను మంటలు ఆర్పేవాన్నే తప్ప మంటలు పెట్టే వ్యక్తిని కాదని మల్లు రవి అన్నారు. రాజగోపాల్ రెడ్డి కంటిలో నలుసు చందంలా మారారని పిసిసి నాయకులు ఆందోళన చెందుతున్నారు. ఈ వ్యవహారాన్ని సాధ్యమైనంత త్వరగా ముగించకపోతే భవిష్యత్తులో ఇంకా ఎవరైనా ఇలాగే మాట్లాడుతారన్న అనుమానాలను వారు వ్యక్తం చేస్తున్నారు.

## లక్నాపూర్ ప్రాజెక్ట్ వాగుల కింద నీటమునిగినా రైతుల పంటలకు ఎకరాకు లక్ష రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలి.- సిపిఎం. మహిపాల్..



ధరూర్ మండలం పరిధిలో అనేక గ్రామాల్లో అధిక వర్షాలకు పాడైన పత్తి ముక్కలు వరీ కంది సోయా పసుపు కూరగాయల పంటలు వందలాది ఎకరాలు నీటమునిగాయి. ప్రభుత్వం వెంటనే నీటమునిగినా ఎకరాకు లక్ష చొప్పున పరిహారం చెల్లించాలి. సిపిఎం నాయకుల పర్యటన బృందం.. సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.. ఆదివారం ధరూర్ మండల పరిధిలోని రాజపూర్ మోమిన్ కాలాన్ మోమినుకుర్దు అంతరం నాగారం మైలారం కుమ్మరిపల్లి తదితర గ్రామాలలో సిపిఎం బృందం పంట పాలలో పర్యటన చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, మాట్లాడుతూ ధరూర్ మండల పరిధిలోని అనేక గ్రామాలలో అధిక వర్షాలు కురుస్తున్నందున్న పత్తి, ముక్కలు, పసుపు సోయా వరీ, కూరగాయలు ఇతర పంటలు 1000ఎకరాల వరకు పంటలు నీట మునిగి నష్టం జరిగింది. జిల్లా కలెక్టర్, వ్యవసాయ అధికారులు తక్షణమే గ్రామాలలో పర్యటనలు చేసి, రైతుల నుంచి పాడైన ప%శీ%టలకు అర్జీలు తీసుకొని తక్షణమే రైతులకు పంట నష్టపరిహారం ఎకరాకు లక్ష చొప్పున చెల్లించాలని అధిక వర్షాలకు తెగిపోయిన రోడ్లు వాగులు వంకలు కాలువలు మరమ్మతులు చేయాలని భారత కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీ సిపిఎం పార్టీగా ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నవీన్ సుదర్శన్, నాయకులు రైతులు లక్ష్మయ్య మోనయ్య గౌస్ అంజిలయ్య చంద్రయ్య అంజమ్మ బాబయ్య మల్లేష్ సుదర్శన్ వెంకటయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సర్ధార్ సర్వాయి పాపన్న జయంతిలో మాజీ ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్ ఆగస్టు 17 ( సత్యమేవ జయతే ):-కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్,దేవేందర్ నగర్ నూతన గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలలో మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యతిథిగా పాల్గొని పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం దేవేందర్ నగర్ నూతన గౌడ సంఘం సభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ను శాలువాతో సత్కరించారు.

ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ..ెలంగాణ తొలిరాజు, బహుజన రాజ్యాధికార పోరాట యోదుడు అరాచకాలను, మొగులాయి దౌర్జన్యాయలను ఎదురించి తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడికి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.రాజకీయ, సామాజిక సమానత్వం, కుల, మతాల వివక్ష లేకుండా సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తి తో ఆనాటి కాలంలోనే పోరాడిన యోధుడు పాపన్న గౌడ్ అని కొనియాడారు.తెలంగాణ బహుజన ఆత్మగౌరవనికి, ధీరత్వానికి ప్రతీక పాపన్న గౌడ్ మహారాజ్ అని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో ముద్దాపురం మాధన్ గౌడ్, దేవేందర్ నగర్ నూతన గౌడ సంఘం అధ్యక్షులు పటేల్గారి గోపాల్ గౌడ్, ఉపాధ్యక్షులు వెండి రవి, ప్రధాన కార్యదర్శి దొమ్మాట ప్రభాకర్ గౌడ్, కోశాధికారి రవి కుమార్ గౌడ్, సంయుక్త కార్యదర్శి సత్య ప్రకాశ్ గౌడ్, కార్యనిర్వాహణ అధికారి మైసగోని బాలరాజ్ గౌడ్, ఆల్వాల్ ఉపేందర్ గౌడ్, సభ్యులు రమేష్ బాబు గౌడ్, శివరాజ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గోదంగూడ నుండి సర్పన్ పల్లి పోయే దారిలో రైల్వే బ్రిడ్జి కింద నుండి పోయేందుకు ప్రయాణికులు రైతులు స్కూల్ విద్యార్థులు అనేక అష్ట కష్టాలు

### రాష్ట్ర ముఖ్యమంత్రి, స్పీకర్ గారు తక్షణమే సమస్య పరిష్కరించాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్...



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.. వికారాబాద్ మండల పరిధిలోని గోదాం గూడ నుండి సరపన్ పల్లి రైల్వే బ్రిడ్జి కింద నుండి పోయేందుకు ప్రయాణికులు రైతులు స్కూల్ పిల్లల్లు పోయేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు వర్షానికి మట్టి వర్షం పెరుగుతుంది ప్రయాణికులు పొలాలకు పోయే వారు కింద పడుతున్నారు. రైల్వే బ్రిడ్జి కింద నుండి పోకుండా ఇనుప రాడ్లతో అడ్డం వేశారు. ఈ దరివెంట 12 గ్రామాల ప్రజలు రైతులు తీవ్రం ఇబ్బందులు పడుతున్నారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి , స్పీకర్ తక్షణమే రైల్వే బ్రిడ్జి దారి బాగు చేసేందుకు చర్యలు చేపట్టాలని సిపిఎం రైతు సంఘం నాయకులు ప్రభుత్వానికి డిమాండ్‌లి చేస్తున్నరూ. అవసరమైతే స్పీకర్ మంత్రుల ఇండ్లు ముందు ఆందోళనలు చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిస్తున్నాము.ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ లు రైతులు పాల్గొన్నారు.

# 19న వికారాబాద్ కు బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు రాక

### రామ్ చందర్ రావుకు ఘన స్వాగతం పలకాలి బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు



సత్యమేవ జయతే, వికారాబాద్ ప్రతినిధి ఈ నెల 19న వికారాబాద్ జిల్లాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు వస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్,బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు అన్నారు.ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఈ నెల 19న రాష్ట్ర నూతన అధ్యక్షులు రాంచందర్ రావు వికారాబాద్ కు వస్తున్నారని,బీజేపీ నాయకులు,ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున్న ఘన స్వాగతం పలుకుదామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం 6గ్యారంటీలు అమలు చేయడం లేదని,ప్రశ్నించాల్సిన ప్రతి పక్షం ఫామ్ హౌస్ లో పండుకుందన్నారు.వృద్దులకు,వికలాంగులకు పింఛన్లు పెంచకుండా కాలయాపన చేస్తున్నారని,420 హామీలు ఇచ్చి మరిచిపోయారని మండిపడ్డారువికారాబాద్ కు వస్తున్న రాంచందర్ రావుకు రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సాదర స్వాగతం పలుకుతామని చెప్పారు.వికారాబాద్ జిల్లాలోకి ఎంట్రీ అయ్యే రాంచందర్ రావు కు మనెగుడా వద్ద పరిగి బీజేపీ నాయకులు స్వాగతము పలుకుతారని,అక్కడి నుంచి వికారాబాద్ కు ర్యాలీగా రావడం జరుగుతుందన్నారు.శివారెడ్డి పెట్ లోని అమ్మవారి గుడి వద్ద మహిళలతో రాం చందర్ రావుకు హారతి ఉంటుందన్నారు.అనతరం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బిజేఆర్ చౌరస్తా వద్ద గజమాలతో సన్మానం ఉంటుందని,అనంతరం బీజేపీ నాయకులకు దిశ నిర్దేశం చేస్తారని అన్నారు.ఈ బీజేపీ కార్యక్రమనికి పెద్ద ఎత్తున్న బీజేపీ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ మీడియా సమావేశాన్ని సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, సీనియర్ నాయకులు పాండు గౌడ్,కె.పి రాజు, బిజెపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కుక్క కాటుకు అవసరమైన చికిత్సలను అందుబాటులో ఉంచాలి అధికారులను ఆదేశించిన పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్ రెడ్డి.





### పరిగి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే టీ ఆర్ ఆర్

పరిగి పట్టణంలో ఇటీవలే కుక్క కాటుకు గురి అయిన వారిని పరామర్శించి వైద్యానికి సంబంధించి ఎమ్మెల్యే డా టి రామ్మోహన్ రెడ్డి పరిగి మరియు జిల్లా ఆరోగ్య అధికారులతో మాట్లాడి తక్షణమే అవసరమైన మందులు మరియు చికిత్స అందుబాటులో తేవాలని తెలిపారు... లోతుగా కుక్క కాటుకు బలి అయిన వారికి కావలసిన ఇంజెక్షన్లు వికారాబాద్ ఆసుపత్రిలో అందుబాటులో ఉండడంతో తక్షణమే తెప్పించి వైద్యం అందించాలని తెలిపారు..అదేవిధంగా లోతుగా కాటుకు బలి అయినప్పుడు వచ్చే రేబీస్ వైరస్ కు సంబంధించిన ఇంజెక్షన్ గురించి జిల్లా డి సి చ్ స్ అధికారి ఆనంద్ తో ఫోన్లో మాట్లాడి రేబీస్ ఇమినో గ్లోబులిన్స్ ఇంజెక్షన్ రేపటి నుండి పరిగి ప్రభుత్వ ఆసుపత్రి లో అందుబాటులో ఉంచి అవసరమైన వారికి ఇంజెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు..డి సి చ్ స్ ఆదేశాల మేరకు ఆనంద్ హైదరాబాద్ నుండి ఈ ఇంజెక్షన్ ను తెప్పించి రేపటి నుండి పరిగి ఆసుపత్రిలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు...కుక్క కాటుకు సంబంధించిన అన్ని రకాల వైద్య సదుపాయాలు పరిగి ఆసుపత్రి లో అందుబాటులో ఉండేట్టు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే టీ ఆర్ ఆర్ మీడియా తో తెలిపారు.అదేవిధంగా మున్సిపల్ అధికారులతో మాట్లాడి కుక్క ల బెడద తగ్గేటట్టు వెంటనే చర్యలు చేపట్టాలని కమిషనర్ కు ఆదేశించారు..ఎవరు అధైర్య పడవలసిన అవసరం లేదని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా చికిత్స ఉంటుందని %జఎంవ% ప్రత్యేకంగా దీనిపై చర్యలు తీసుకుంటానాని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి. తెలిపారు.

# కలెక్టరేట్లో కామాంధుడు...?

### మద్యం సేవించే విధులకు హాజరు...??. కామాంధునికి దేహ శుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన కాలనీవాసులు...

సత్యమేవ జయతే వికారాబాద్ జిల్లా..వికారాబాద్ జిల్లా కలెక్టరేట్లో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి కన్ను మిన్ను ఎరుగక, అభము శుభము తెలియని ఓ చిన్నారి పై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా కోఆపరేటివ్ డిపార్ట్మెంట్ లో విధులు నిర్వహిస్తున్న పరిగి నియోజకవర్గానికి చెందిన నరేందర్ (45) అనే కామాంధుడు అప్పటికే మద్యం సేవించి ఫుట్ పాత్ పై నిల్చున్నాడు .శనివారం గోకులా అష్టమి పండగను పురస్కరించుకుని పాఠశాలలకు ప్రభుత్వ సెలవు ఉండడంతో సాయంత్రం కలెక్టరేట్ కార్యాలయం ముందున్న కాలనీ చిన్నారులు ఆ కార్యాలయం ఆవరణలో ఆడుకోవడానికి వెళ్లారు. ఆడుకుంటున్న చిన్నారులను కాసేపు పరిశీలించి వారిలో ఒక చిన్నారితో మాయ మాటలు చెప్పి దగ్గరకు తీసుకుని అసభ్యంగా ప్రవర్తించాడు. కామాంధులు చేష్టలకు వణికిపోయిన ఆ చిన్నారులు అక్కడి నుంచి వెక్కి వెక్కి ఏడుస్తూ తల్లిదండ్రులకు వద్దకు వచ్చి జరిగిన సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ విషయమై వెంటనే స్పందించిన తల్లిదండ్రులు కామాంధుని పట్టుకోవడానికి కలెక్టర్ కార్యాలయంలోకి పరిగెత్తడంతో నిందితుడు పొదల చాటున దాక్కున్నాడు. అప్పటికే కాలనీవాసులు పలువురు అక్కడికి చేరుకోవడం ఆ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించడంతో పొదల మాటున దాక్కున్న నిందితుడు నరేందర్ ని పట్టుకొని కలెక్టరేట్ కార్యాలయం గేటు బయట దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు ఆ చిన్నారుల తల్లిదండ్రులు వికారాబాద్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేశారు.ఈ మేరకు స్పందించిన సిఐ భీమ్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం పట్ల సర్వత్ర జిల్లా కేంద్రంలో చర్చనీ అంశంగా మారింది.ఇటీవల ఏసీబీకి పట్టుబడ్డ ఉద్యోగి అంశము మరవకముందే ఇలాంటి సంఘటన చోటు చేసుకోవడం పట్ల అటు ప్రభుత్వ యంత్రాంగంలో ఇటు ప్రజలలో కలెక్టరేట్ కార్యాలయం పనితీరు ఈ విధంగా తయారయిందని సర్వత్రా చర్చగా మారింది. ఇదిలా ఉంటే కొంతమంది ఉద్యోగులు సైతం మద్యం సేవించి విధులకు హాజరవుతున్నట్లు, సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు సైతం కలెక్టరేట్ కార్యాలయం పై సర్వత్ర వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకొని కలెక్టరేట్ కార్యాలయం పనితీరు మస్కబారకముందే చక్క దిద్దితే బాగుంటుందని ప్రజల నుంచి వ్యక్తం అవుతుంది...



# జ్ఞాన సమాజం కోసం పాటు పడే స్వేరో సైన్యం

### - స్వేరో కోర్ రాష్ట్ర చీఫ్ బాబు నాయక్

సత్యమేవ జయతే - సంగారెడ్డి సంగారెడ్డి : రాష్ట్రవ్యాప్తంగా సుశిక్షితులైన వారియర్స్ స్వేరో కోర్ సైనికులను తయారు చేస్తామని రాష్ట్ర స్వేరో కోర్ చీఫ్ కమాండర్ బాబు నాయక్ గారు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా పట్టణ కేంద్రంలో స్వేరో నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర స్వేరో కోర్ చీఫ్ బాబు నాయక్ హాజరై రాష్ట్రంలో స్వేరో సైన్యాన్ని తయారు చేయుటకు స్వేరో కోర్ నిర్మాణం కోసం 33 జిల్లాలు పర్యటించి సమసమాజం కోసం పాటుపడే స్వేరో వారియర్స్ ని తయారు చేసే క్రమంలో సంగారెడ్డి జిల్లాకు రావడం సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు.



ఈ సమావేశంలో మెదక్ కో కన్వీనర్ లలిత రాణి, గౌరవ అధ్యక్షుడు నటరాజ్,జిల్లా అధ్యక్షులు బీబీపేట్ రాజు స్వేరో, జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ స్వేరో ఉపాధ్యక్షులు పల్లవి, కిరణ్, జిల్లా నాయకులు మల్లేష్ గౌడ్,రాము, సునంద,అనిత, శేఖర్ ,అసెంబ్లీ నాయకులు తుకారాం,సంగ్రా%శీ%, ప్రశాంత్ , మొగలప్ప, నర్సింలు, నగేష్ జనార్ధన్,ప్రకాష్, మొగులయ్య,మహేందర్ సంపత్, రాములు, స్వేరోస్ నాయకులు పాల్గొన్నారు.

## గడిసింగాపూర్%-%రంగారెడ్డి పల్లి డబుల్ రోడ్ పనులను పరిశీలించిన పరిగి ఎమ్మెల్యే టీ ఆర్ ఆర్...



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..ఇటీవల శంకుస్థాపన చేసిన గడిసింగాపూర్ నుండి రంగారెడ్డి పల్లి వరకు డబుల్ రోడ్ పనుల పురోగతిని పరిగి ఎమ్మెల్యే %డ% డి.సి.సి.అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు పరిశీలించారు.ఈ సందర్భంగా పనుల నాణ్యత,వేగం గురించి అధికారులను నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని,నాణ్యతకు ఎలాంటి లోటు రానీయకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఫోన్ లైన్ ద్వారా సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామాల అభివృద్ధి,రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే టీ ఆర్ ఆర్ తెలిపారు.

## పరిగి లో కుక్కల స్వైర విహారం..




సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..పరిగి పట్టణంలో ఒకే రోజు 17 మందిని కరిచిన కుక్క ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్ళగా కుక్క కాటుకు సంబంధించిన మెడిసిన్ లేకపోవడంతో వైద్యులు తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడం జరిగింది. తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా మెడిసిన్ లేకపోవడంతో అయోమయంలో బాధితులు.గత 45 రోజులుగా విపరీతమైన కుక్క కాటు కేసులు పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చినా కూడా తగిన మెడిసిన్ లేకపోవడం అనేది ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందిమాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ గారు మాజీ ఎంపీపీ కరణం అరవింద్ రావు గారు సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి గారు భాస్కర్ గారు తాహిర్ అలీ గారు జాక్ రవికుమార్ గారు పరిగి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్యులను అడుగగా తమ దగ్గర కుక్కకాటుకు తగిన మందు లేదని తెలియజేశారు పై అధికారులకు ఫోన్లో సంప్రదించగా వారు నిర్లక్ష్యంగా స్పందించడం జరిగింది.మున్సిపల్ అధికారులు ఇప్పటికీ కూడా తగు చర్యలు తీసుకోకపోవడం విమర్శలు వినిపిస్తునాయి..


### ఊరుకు మంచి చేయాలనే సంకల్పంతో...

### చిట్టిగిద్ద గ్రామంలో వెలుగులు నింపాలని ఎల్ ఈ డి లైట్ ల అందజేసిన మాజీ ఉప సర్పంచ్ ఎర్వ శ్రీహరి..



సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా ప్రతినిధి : సొంత గ్రామానికి మంచి చేయాలన్న సంకల్పంతో ఎల్ఈడి బల్బులను అందజేసిన శ్రీహరి. వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల పరిధి చిట్టిగిద్ద పంచాయతీ సెక్రటరీ కి ఎల్ . ఇ .డి లైట్స్ అందచేసిన మాజీ ఉప సర్పంచ్ ఎర్వ శ్రీహరి. ఆయన మాట్లాడుతూ గ్రామానికి ఇక మీద ఎలాంటి అవసరాలు ఉన్నా తన వంతు కృషి చేస్తానని , త్వరలో గ్రామానికి కావలసిన కనీస వసతుల పైన దృష్టి పెట్టి నా తరపున చిట్టిగిద్ద గ్రామ పంచాయతీ కి ప్రణాళిక ప్రకారం అన్ని సహాయసహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు . ఈ కార్యక్రమంలో జి.ఆనందం జి.శ్రీనివాస్. డి సుధాకర్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు..

## పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్టు



సత్యమేవ జయతే - నిజామాబాద్ నిజామాబాద్ : కామారెడ్డి -మెదక్ జిల్లా సరిహద్దులో గల పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. నాగిరెడ్డిపేట మండలంలో గల పోచారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తున్నది. వచ్చిన వరద వచ్చినట్లే దిగువకు ఉప్పొంగి ప్రవహిస్తోంది. పోచారం నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు నేరుగా నిజాంసాగర్ ప్రాజెక్టుకు చేరుకోనుంది. కాగా, తెలంగాణలో గతవారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాలకు వరదలు పోటెత్తాయి. ఇప్పటికే వర్షాలకు పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఈ క్రమంలో వాతావరణశాఖ కీలక హెచ్చరికలు చేసింది. రాగల మూడురోజులు భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కొన్ని జిల్లాలకు రెడ్ అలెర్ట్, మరికొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం కొత్తగూడెం, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# మాల మహానాడు గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా సంఘం సురేష్ బాబు

### నియామక పత్రాన్ని అందజేసిన జాతీయ అధ్యక్షులు డాక్టర్ శ్రీకృష్ణ

సత్యమేవ జయతే - సికింద్రాబాద్

సికింద్రాబాద్ : మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన సంఘం సురేష్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షులు పబ్బాతి శ్రీకృష్ణ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నాగల వార్ గిరిజ శంకర్ తో కలిసి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి 80 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సరియైన రీతిలో అమలుపరచకపోవడంతో ఎస్సీలు సామాజిక అభివృద్ధికి నోసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నానాటికి ఎస్సీలపై దాడులు జరుగుతూనే ఉన్నాయని ఈ దాడులపై ఎస్సీలలో ఉన్న మేధావులు పెదవి విప్పకపోవడం బాధాకరమని ఎస్సీలు సామాజిక అభివృద్ధి చెందే అంతవరకు తన సంఘం ప్రభుత్వాలపై పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాలు ద్వంద వైఖరిని అవలంబిస్తూ ఎస్సీలను విభజించి పాలిస్తూ సామాజిక అభివృద్ధికి దూరం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ఎస్సీలలోని అన్ని వర్గాలు సమిష్టిగా అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు నడుం బిగించాలని ఆయన పిలుపునిచ్చారు.






# సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో ఫీవర్ సర్వే : వైద్యాధికారి



సత్యమేవ జయతే - ఆదిలాబాద్ ఆదిలాబాద్ : సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు సామాజిక ఆరోగ్య ఆసుపత్రి వైద్య అధికారి జితేందర్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని నాగల్ కొండ, ముస్లిం వాడ, మల్కు గూడా, తాడిహత్నూర్, బీసీ వాడ, గుంజాల తో పాటు పలు గ్రామాల్లో ఆదివారం రాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు.

స్థానికులకు వైద్య పరీక్షలు చేస్తూ అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రామాల్లో అపరిశుభ్రత లోపించకుండా చూడాలని స్థానికులకు సూచించారు.

చిన్నపాటి జ్వరం దగ్గు జలుబు ఉన్న ఆసుపత్రికి వచ్చి వైద్య చికిత్సలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి తులసీదాస్, ఆరోగ్య పర్యవేక్షకులు చౌహాన్ చరణ్ దాస్, సత్యావ్వ, వైద్య సిబ్బంది ప్రియాంక, సింధు, విమల, మానుకు బాయ్, ఈశ్వర్, జవహర్ లాల్, ఆడే దినేష్, గోకుల్, ఆశా కార్యకర్తలు సరిత, బజ్జు బాయి, రుక్మాబాయి, సుగుణ, లక్ష్మి, శ్రీలత ఉన్నారు.

# యుద్ధంలో వీరమరణం పొందిన వీరుల కోసమే కలశయాత్ర



### - యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఎటీ యాదవ్

### - తంగళ్లపల్లిలో ఘనస్వాగతం పలికిన యాదవ సంఘ నేతలు

సత్యమేవ జయతే - రాజన్న సిరిసిల్ల రాజన్న సిరిసిల్ల : రేజాంగ్ల ప్రాంతంలో 1962లో జరిగిన ఇండియా-చైనా యుద్ధంలో వీర మరణం పొందిన వీరుల కోసమే 'రేజాంగ్ల రజ్ కలశ యాత్ర'ను నిర్వహిస్తున్నామని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఏటీ యాదవ్ పేర్కొన్నారు. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం చేపట్టిన 'రేజాంగ్ల రజ్ 'కలశయాత్ర' రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చేరుకుంది. తంగళ్లపల్లిలో యాత్రకు ఘనస్వాగతం పలికారు. యాత్ర కలశాన్ని యాదవ అఖిల భారత యాదవ మహాసభ నాయకులు స్వీకరించారు.

అనతరం బైక్ ర్యాలీతో సిరిసిల్ల మీదుగా వేములవాడకు పయనమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చైనా-ఇండియా యుద్ధంలో 1300 మందిని హతమార్చి, 120 మంది యాదవ యుద్ధ వీరులు వీర మరణం పొందారన్నారు. వీరులకు గుర్తింపుగా 'యాదవ రేజిమెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. యాదవ రేజిమెంట్ కోసం రాజాంగ్ల రజ్ కలశ యాత్ర చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏటీ యాదవ్, నవీన్ యాదవ్, ఆసరి బాలరాజు, మీరాల శ్రీనివాసయాదవ్, గోగు మల్లేశం యాదవ్, జంగం శ్రీనివాస్, నూనే హరిష్, వెల్పుల సాయి, ప్రసాద్ యాదవ్, కావటి మల్లేశం, జంగం సత్తయ్య, బోగి శ్రీనివాస్, నక్క సతీష్, సురేష్ బండ అంజయ్య, నాయకులు పాల్గొన్నారు

## పార్టీలకు అతీతంగా భారతీయ కిసాన్ సంఘ్ ను బలోపేతం చేయాలి..

### - భారతీయ కిసాన్ సంఘ్ సంఘటన్ మంత్రి దోనూరి రాము



సత్యమేవ జయతే - కరీంనగర్ కరీంనగర్ : గ్రామాల్లో పార్టీలకు అతీతంగా భారతీయ కిసాన్ సంఘ్ ను బలోపేతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ సంఘటన్ మంత్రి దోనూరి రాము అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక రైతువేదిక కార్యాలయంలో భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులతో శిక్షణ తరగతులను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు కలిసికట్టుగా ఐక్యంగా ఉంటే రైతుల ప్రతీ సమస్య వెంటనే పరిష్కారమవుతాయని, గ్రామాల్లోని రైతులు సమస్యలను నిత్యం ఎదుర్కొంటున్నారన్నారు.ప్రతీ గ్రామంలో పార్టీలకు అతీతంగా భారతీయ కిసాన్ సంఘాన్ని బలోపేతం చేసేలా రైతులు కృషి చేయాలని కోరారు. రైతులు బాగుంటునే దేశం బాగుంటుందని, రైతులు ఐక్యంగా పోరాటాలు చేస్తే ఏ ప్రభుత్వాలైన దిగివస్తాయాని తెలిపారు. అనంతరం బలరాముడి విగ్రహం వద్ద ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చేపూరి విజయభాస్కర్, జిల్లా అధ్యక్షుడు కాసారపు భూమారెడ్డి, జిల్లా కార్యదర్శి ఇప్ప రాజేందర్, మండలాధ్యక్షుడు కల్లెం మహిపాల్ రెడ్డి, నాయకులు ముద్దం గంగారెడ్డి, చిట్యాల లక్ష్మణ్, ఇట్టెడి భాస్కర్, మిట్టపల్లి జలపతిరెడ్డి, మొరపు గంగరాజం, పోచంపల్లి రమేష్, ముత్యాల గంగరాజం, ఇస్లావత్ రాజేందర్, కాటిపల్లి రాజేంధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. ఎస్సై మోహన్ రెడ్డి

సత్యమేవ జయతే - నిజామాబాద్ నిజామాబాద్ : మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మోహన్ రెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత మూడు రోజుల నుండి భారీ వర్షాలు కురుస్తుండటంతో కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ పరివాహక ప్రాంతం నుండి వరద నీరు భారీగా ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుందని, సోమవారం ఏ సమయంలోనైనా ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి మాజీరా నదిలోకి వదిలే అవకాశం ఉందని పేర్కొన్నారు.



ఈ మేరకు ప్రాజెక్టు అధికారులు హెచ్చరికలు జారీ చేశారని, నది పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు మంజీరా పరివాహక ప్రాంతంలోకి గొర్రె కాపరులు, పశువుల కాపర్లు, చేపలు పట్టేవాళ్లు, రైతులు మంజీరా పరివాహంలోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రెవెన్యూ పోలీసు శాఖల వారికి సమాచారం అందించాలని, లేదా 100 డైల్ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## నాగులవంచ రైల్వేస్టేషన్ పునఃప్రారంభం



సత్యమేవ జయతే - మధిర మధిర : ఖమ్మం జిల్లా చింతకాని మండలంలోని ఖమ్మం-విజయవాడ ప్రధాన రైలు మార్గంలో చరిత్ర కలిగిన నాగులవంచ రైల్వేస్టేషన్ ను ఇటీవల మూసివేశారు. రైల్వేస్టేషన్ మూసివేత వలన ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఈ ప్రాంత ప్రజలు రైల్వే ఉన్నత అధికారుల దృష్టికి, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకుకెళ్లారు.

ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు శనివారం రైల్వే ఉన్నత అధికారులు రైల్వే స్టేషన్ ఎత్తివేతను నిలిపివేస్తూ జీవో జారీచేశారు. వారి ఆదేశాల మేరకు ఖమ్మం రైల్వే కమర్షియల్ డిపార్టుమెంట్ అధికారి శ్రీనివాసులు ఆదివారం రైల్వేస్టేషన్‌ను పునఃప్రారంభిచారు. ప్రయాణికుల కోసం టికెట్ బుకింగ్ ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్ టికెట్ బుకింగ్ క్లర్క్‌గా శేష్ కుమారిని నియమించారు.

విజయవాడ-భద్రాచలం రోడ్డు, డోర్నకల్-విజయవాడ వెళ్లు ప్రయాణికులకు టికెట్‌లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తేలుకుంట్ల శ్రీనివాస్, పరిటాల యలమంద, కోపూరి నవీన్, ఆలస్యం బసవయ్య, బొర్రా ప్రసాద్, కొల్లి బాబు, అంబటి శాం

## యూరియా కొరత.. రైతులకు వ్యథ



సత్యమేవ జయతే - జోగులాంబ గద్వాల్ జోగులాంబ గద్వాల్ : రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. వర్షాలు ఫుల్‌గా కురుస్తుండడంతో యూ రియా అవసరం ఉన్నా సరైన సమయంలో అందుబాటులో లేదు. శనివారం బిజినేపల్లి పీఏసీసీఎస్, మనగ్రోమోర్ వద్ద యూరియా కోసం రైతులు బారులుదీరారు. గంటల తరబడి.. తిండితిప్పలు, నిద్రాహారాలు మానుకొ ని.. పడిగాపులు కాస్తున్నారు.


పట్టాబుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్‌తోపాటు థంబ్ ఇంప్రెషన్ చేయాల్సి ఉండడంతో ఒక్కో రైతుకు యూరియా అందించేందుకు సుమారు ఐదు నుంచి 10 నిమిషాల సమయం పడుతున్నది. దీనికి తోడు ఎకరా పొలానికి ఒక యూరియా బస్తా.. రెండు, అంతకుపైబడి ఉంటే రెండు బస్తాలకుమించి ఇవ్వడం లేదు. మరిన్ని బస్తాలు కావాలంటే మరో నాలుగు రోజులు ఆగాల్సిందే.. యూరియాతోపాటు నానో లిక్విడ్‌ను బలవంతంగా అంటగడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

పంటలు కళకళలాడుతూ.. ఏపుగా పెరుగుతున్న సమయంలో అవసరమైన యూరియా అందుబాటులో లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆన్‌లైన్‌లో యూరియా ఉన్నట్లు చూపిస్తున్నా.. కొందరు కృత్రిమ కొరత సృష్టించడం వల్లే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం సీజన్‌కు సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచడంతో రైతులు సంబురంగా సాగు పనులు చేసుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యూరియాను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

- ఫర్టిలైజర్ దుకాణాల్లోనూ కొరతే..

మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణం వద్ద యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున గుమిగూడారు. యూరియా బస్తాలు విక్రయించాలని డీలర్‌ను కర్షకులు వేడుకున్నారు. అయినా అందుబాటులో లేవని చెప్పడంతో చేసేది లేక పలువురు నిరాశతో వెనుదిరిగారు. ప్రైవేటు ఎరువుల దుకాణాల నిర్వాహకులు కృత్రిమ కొరత సృష్టించి బయట మార్కెట్‌లో విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనిఅన్నదాతలు ఆగ్రహం చెందుతున్నారు.

## కోట్‌పల్లి ప్రాజెక్టుకు పోటెత్తిన పర్యాటకులు



సత్యమేవ జయతే - వికారాబాద్ వికారాబాద్ : కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకుల తాకిడి భారీగా పెరిగింది. ఆదివారం సెలవు దినం కావడంతో వికారాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని కోట్ పల్లి ప్రాజెక్టుకు భారీగా తరలివచ్చారు. పర్యాటకులు కుటుంబ సమేతంగా బోటింగ్ చేస్తూ ఎంజాయ్ చేశారు.అనంతరం ఫొటోలు, సెల్ఫీలు దిగి చెట్ల కింద కూర్చొని వనభోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం దాకా సరదాగా గడిపి సాయంకాలానికి తిరిగి తమ తమ గమ్యాలకు చేరుకున్నారు. పర్యాటకులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బోటింగ్ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

### వైద్యుల నిర్లక్ష్యానికి.. గర్భిణి మృతి

### - శ్రీ బాలాజీ హాస్పిటల్ నిర్లక్ష్యమేనంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ



సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : జవహర్‌నగర్ కార్పొరేషన్, బాలాజీనగర్‌లో దారుణం చోటుచేసుకున్నది. తీవ్ర రక్తస్రావం అవుతుందని ఓ గర్భిణి.. శ్రీ బాలాజీ ప్రైవేట్ హాస్పిటల్ కు రాగా..అక్కడ సరైన వైద్యం అందక మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే యువతి మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం%ౌ% కారా నకు చెందిన శ్యామలపల్లి నిఖిత(22) గర్భం దాల్చడంతో తీవ్ర రక్తస్రావం చోటుచేసుకున్నది. నిఖిత ఈ నెల 15న శ్రీబాలాజీ హాస్పిటల్‌కు రాగా వైద్యులు రక్తం ఎక్కించి ఇంటికి పంపించారు. ఆరోగ్యం క్షీణించి తీవ్ర రక్తస్రావం కావడంతో శనివారం ఉదయం హాస్పిటల్‌కు వచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తుండగా అపస్మారకస్థితిలోకి వెళ్ళింది.వెంటనే సీపీఆర్ చేసినా నిఖితలో ఏమాత్రం చలనం కనిపించలేదని, చనిపోయిందని మధ్యాహ్నం వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు పోలీసులు సమాచారం అందించగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. ఈ మేరకు నిఖిత కుటుంబసభ్యులు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందిందని జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా..కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# యూరియా.. గోస తీరేదెప్పుడయా?

**- క్యూలో చెప్పులు.. చేతిలో గొడుగులు.. రైతుల బారులు**

**- యూరియా.. గోస తీరేదెప్పుడయా?**

**- మహబూబాబాద్‌లో రైతుల ఆందోళన**

**- యూరియా సరిపడా లేదని సొసైటీ కేంద్రానికి తాళం**

**- పోలీసులను పెట్టి రైతులను వెళ్లగొట్టిన అధికారులు**

**- మహబూబాబాద్, గూడూరులో రైతుల ఆందోళన**

**- కుటుంబసభ్యులతో కలిసి తెల్లవారుజాము నుంచి పడిగాపులు**

**- వర్షంలోనూ అన్నదాతకు తప్పని కష్టాలు**

**- గంటలకొద్దీ వేచి ఉన్నా దొరకని బస్తాలు**

**- కాంగ్రెస్ తీరుపై ఆగ్రహం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**



సత్యమేవ జయతే - మహబూబాబాద్మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సొసైటీ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు శనివారం తెల్లవారుజాము నుంచి పడిగాపులు కాశారు. నాలుగు రోజుల నుంచి సొసైటీకి సరిపడా యూరియా రావడం లేదు. ఈ క్రమంలో లారీ లోడ్ వచ్చి సొసైటీలో దించుతున్నారని సమాచారం తెలుసుకున్న రైతులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా తోపులాట జరిగింది. యూరి యా ఇవ్వాలని సొసైటీ అధికారులను రైతులు నిలదీశారు. ఈ క్రమంలో అధికారులు పట్టణ పోలీసులకు స మాచారం అందించడంతో ఇద్దరు ఎస్సైలు, ఐదుగురు కానిస్టేబుల్స్ వచ్చి సొసైటీ సెంటర్ వ ద్ద రెండు గంటల పాటు పహారా చేశారు. సొసై టీ నిర్వాహకులు రైతులకు టోకెన్ల ప్రకారం కాకుండా ఇష్టానుసారం ఇస్తున్నారని ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో యూరియా గోదామును మూసివేశారు. దీంతో సొసైటీ సీఈవో ప్రమోద్‌తో రైతులు వాగ్వాదానికి దిగారు. గోదాములో 400 బస్తాల యూరియా ఉంద ని, రైతులు వెయ్యి మంది వరకు ఉన్నారని మళ్లీ లోడ్ వచ్చాకే యూరియా ఇస్తామని అధికారులు సిబ్బందితో గేటుకు తాళం వేయించి రైతులను పోలీసులతో వెళ్లగొట్టారు.

పొద్దున ఐదింటికి వచ్చినం..

వారం రోజులుగా యూరియా కోసం సొసైటీకి వస్తూ అరిగోస పడుతున్నం. పొద్దుగాలే ఐదు గంటలకు వచ్చినం. అప్పటినుంచి లైన్‌లోనే నిలబడి ఉన్నాం. ఇదివరకు యూరియా కోసం ఇంత గోస పడలే. ఈ సంవత్సరం చాలా ఇబ్బందులు పడుతున్నం. కొంతమందికి మాత్రమే యూరియాను అందించి బ్లాక్ చేస్తున్నరు. ప్రభుత్వం స్పందించి రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలి.

- రాయపాటి లక్ష్మి, నడివాడ

జోరువానలోనూ రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. ఎరువుల కొరత అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నది. స్టాక్ ఎప్పుడొస్తుందో తెలియక దొంగరాత్రి లేచి సొసైటీల వద్దకు పరుగులు తీయాల్సి వస్తున్నది. శనివారం మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో తెల్లవారుజాము 3గంటల నుంచే కొన్నిచోట్ల చెప్పులు క్యూలో పెడితే.. మరికొన్ని సెంటర్ల వద్ద చేతిలో గొడుగులు పట్టుకొని బారులు తీరిన దృశ్యాలే కనిపించాయి. వర్షాన్ని కూడా లెక్కచేయక గంటల తరబడి ఎదురుచూసినా చాలామందికి యూరియా అందకపోవడంతో భగ్గుమన్న రైతులు.. సొసైటీ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. యూరియా కోసం గతంలో ఎప్పుడూ ఇంత గోస పడలేదని కాంగ్రెస్ సర్కారు వచ్చాకే రైతులకు కష్టాలు మొదలయ్యాయని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రేవంత్ సర్కారు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేశారు.

- బుధరావుపేటలో..

ఖానాపురం మండలం బుధరావుపేటలోని సొసైటీ కార్యాలయం వద్ద శనివారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. గోదాముకు 888 బస్తాలు రావడంతో అధికారులు రైతువేదిక వద్ద రైతులకు టోకెన్లు ఇచ్చారు. వర్షం కురుస్తున్నా యూరియా కోసం గోదాము వద్ద నిలబెట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్నడూ క్యూలైన్లలో నిలబడి యూరియా కొనుగోలు చేసింది లేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మాత్రం నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు.

- వర్షంలోనూ తప్పని తిప్పలు

బయ్యారంలోని గ్రోమోర్ సెంటర్ వద్ద శనివారం యూరియా కోసం వందలాది మంది రైతులు చెప్పులు వరుసలో పెట్టారు. కేవలం 220 బస్తాలు యూరియా రాగా తహసీల్దార్ నాగరాజు, ఎస్సై తిరుపతి యూరియా సక్రమంగా పంపిణీ చేయాలని గ్రోమోర్ సెంటర్ వారికి అదేశించి పోలీస్ పహారాలో యూరియా పంపిణీ చేశారు. కొన్ని సెంటర్ల నుంచి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నార ని రైతులు ఆరోపించారు. కేసముద్రంలోనూ రైతులు యూరియా కో సం నానా పాట్లు పడ్డారు. ధన్నసరి, కేసముద్రం సహకార సంఘాలకు యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు ఉదయాన్నే బారులు తీ రారు. నిల్చోలేక ధన్నసరి సొసైటీ వద్ద చెప్పులను క్యూ పెట్టారు. మధ్యా హ్నం వరకూ యూరియా రాలేదు. ఏవో వెంకన్న ధన్నసరి, కేసము ద్రం సహకార సంఘాలకు చేరుకొని రైతులతో మాట్లాడారు. వర్షం కారణంగా యూరియా రాదని తెలుపడంతో నిరాశతో వెళ్లిపోయారు.


- గూడూరులో రైతుల గరంగరం..

- ఐదు గంటలు వేచ్చి ఉన్నా ఇవ్వకపోవడంపై ఆగ్రహం

- 3గంటల నుంచే బారులు తీరిన వందలాది మంది రైతులు

మహబూబాబాద్ జిల్లా గూడూరు పీఏసీఎస్‌లో శనివారం యూరియా బస్తాలు ఇస్తున్నారని తెలుసుకున్న రైతన్నలు తెల్లవారు జామున 3గంటలకే కుటుంబసభ్యులతో కలిసి సొసైటీ వద్ద వందలాదిగా చేరుకున్నారు. అదే సమయంలో వర్షం పడినా లెక్కచేయకుండా 6 గంటలు వరుసలోనే గొడుగులు పట్టుకొని పడిగాపులు కాశారు. రెండు లారీల్లో వచ్చిన 888 బస్తాల యూరియాను ఉదయం నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పంపిణీ చేశారు. మధ్యాహ్నం వరకు నిల్వలు అయిపోవడంతో యూరియా కావాలంటూ క్యూలో ఉన్న రైతులు, మహిళలు, వృద్ధులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఒక దశలో ఆందోళనకు సిద్ధం కాగా ఎస్సై గిరిధర్‌రెడ్డి అదుపు చేసి మిగితా వారికి తెల్లకాగితంపై పీఏసీఎస్ సిబ్బంది సంతకం చేసి ఇచ్చిన టోకెన్లను స్వయంగా ఇచ్చారు. అయితే యూరియా కోసం తెల్లవారుజామున నుంచి నీళ్లు తాగకుండా, ఏమీ తినకుండా వచ్చి లైన్లలో నిల్చొంటే ఒక్కబస్తా సరిపోదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం రెండు బస్తాలైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంత అధ్వాన పరిస్థితి ఎన్నడూ చూడలేదని కనీసం వ్యవసాయం చేద్దామంటే యూరియా బస్తాలు దొరకని పరిస్థితి దాపురించిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక క్యూలైన్లలో వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు సైతం అనేక ఇబ్బందులు పడ్డారు. కాగా యూరియా బస్తాలు ఇచ్చే ప్రక్రియను ఏవో అబ్దుల్ మాలిక్ ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు పర్యవేక్షించారు. లైన్లనో నిలబడి శనివారం రోజు యూరియా బస్తాలు దొరకని వారికి మళ్లీ యూరియా లోడ్ వచ్చిన తర్వాత ప్రాధాన్యత ప్రకారం ఇస్తామని ఎస్సై, ఏవోలు రైతులకు తెలిపారు.

## ఊట్కూర్‌లో గంజాయి స్వాధీనం.. ఇద్దరు యువకుల అరెస్టు





సత్యమేవ జయతే - నారాయణపేట నారాయణపేట : నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో గంజాయి విక్రయాలు చాప కింద నీరుల కొనసాగుతున్నాయి. ఈ నెల 15న ఊట్కూర్ మండల కేంద్రంలోని మక్తల్ ప్రధాన రహదారి అయ్యప్ప స్వామి టెంపుల్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు యువకులను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. యువకుల వద్ద నుంచి 125 గ్రాముల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఊట్కూర్ ఎస్సై రమేష్ కు సమాచారం అందించారు.

నిందితులలో ఒకరు ఊట్కూర్ మండలం చెట్టు కింది అరవింద్ ( 22 ) , కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ తాలూకా కేంద్రానికి చెందిన కోరేబాన్ సంజీవ్ ( 23) గుర్తించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు జిల్లా జైలుకు తరలించారు. నిషేధిత గంజాయి విక్రయాలు చేపడితే చట్టపరమైన శిక్షలు తప్పవని ఎస్సై రమేష్ హెచ్చరించారు. గ్రామాల్లో గంజాయి విక్రయాలు చేపడితే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.

- సరిహద్దు శివారులో..

తెలంగాణ సరిహద్దు శివారులోని గుడిమిట్కల్, యాద్గీర్ పట్టణాల నుంచి శివారు గ్రామాల మీదుగా ఊట్కూర్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలైన పులిమామిడి, చిన్నపొర్ల, పెద్దపొర్ల, మల్లేపల్లి, ఎడవెల్లి, నిడుగుర్తి, పెద్ద జట్రం తదితర గ్రామాలకు గంజాయి సరఫరా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు పట్టణాలకు మాత్రమే పరిమితమైన గంజాయి విక్రయాలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించడంతో గంజాయి మత్తులో యువత తూలుతున్నారు.దినసరి కూలీలు, కళాశాల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గుట్టు చప్పుడు కాకుండా గంజాయి అమ్మకాలను చేపడుతున్నారు. విద్యార్థులు, యువత గంజాయి మత్తుకు బానిస అవుతుండడంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంజాయి సరఫరాను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## అనారోగ్యంతో పోలీసు జాగిలం మరణం.. అధికారిక లాంఛనాలతో అంతిమ వీడ్కోలు





సత్యమేవ జయతే - నల్లగొండ నల్లగొండ : అనారోగ్యంతో మరణించిన పోలీసు జాగిలానికి అధికారిక లాంఛనాలతో పోలీసులు అంతిమ వీడ్కోలు పలికారు. నల్లగొండ జిల్లా పోలీసు శాఖకు జాగిలం పింకి అందించిన సేవలు మరువలేనివి అని పోలీసు ఉన్నతాధికారులు కొనియాడారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. నేర పరిశోధనలో సాటి లేని జాగిలం, వాసన పసిగట్టిందంటే వదిలి పెట్టని నైజం అనేక కీలక కేసులలో నేరస్థులను డిటెక్ట్ చేసి పోలీస్ శాఖకు వెన్ను దన్నుగా నిలిచి దాదాపు 12 సంవత్సరాల కాలం పాటు విధి నిర్వహణలో విశేష సేవలు అందించి అనారోగ్య కారణంగా ఈ రోజు మరణించడం చాలా బాధాకరమని ఆయన పేర్కొన్నారు. 2014 సంవత్సరంలో ఐఐటీ మొయినాబాద్‌లో 9 నెలల పాటు డాగ్ హ్యాండ్లర్ నాగరాజుతో పాటు శిక్షణ పొంది శిక్షణా కాలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది.

- పింకీ సాధించిన ఘనతలు:

మ్మడి నల్లగొండ జిల్లాలో విధినిర్వహణలో భాగంగా నల్లగొండ 1 టౌన్ పరిధిలో బొట్టుగూడలో ఒక వ్యక్తిని ముక్కలు ముక్కలుగా చేసి పలు చౌరస్తాలలో తల మొండెం వేరు చేసిన సంచలన హత్య కేసులో కీలక పాత్ర పోషించింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో జూలకంటి ఇంద్రా రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన రూ. ఒక కోటి 40 లక్షల చోరీ కేసులో గంటల వ్యవధిలో నిందితుల జాడలను కనిపెట్టింది. గుండాల మండలంలోని వంగాల గ్రామంలో ఒక వ్యక్తిని చంపి బావిలో పడవేసిన వారం రోజుల తరువాత విషయం తెలుసుకున్న తరువాత ఈ డాగ్‌తో అన్వేషణ చేస్తే నిందితుల ఇండ్లలోకి వెళ్లి పసిగట్టింది. ఇలా పింకీ విధినిర్వహణలో చేసిన సేవలు మరువలేనివి.

విధి నిర్వహణలో అనేక సేవలు అందించిన పింకీ జాగిలం పార్థివదేహానికి జిల్లా ఎస్పీ సూచనల మేరకు అడిషనల్ ఎస్పీ రమేష్ పూలమాల వేసి నివాళులు అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి శ్రీనివాసులు, ఆర్ఐ సంతోష్, ఆర్ఎస్ఐ రాజీవ్, డాగ్ హ్యాండ్లర్ నాగరాజు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది కరుణాకర్, సంపత్, సతీష్, గోపాల్, మహేంద్ర, నరేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయ్ బ్యాచ్ వర్సెస్ పోలీసులు..

# ఇన్‌ఫార్మర్ నెపంతో దాడి జరిగిందా..?

సత్యమేవ జయతే – కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్‌లో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. గంజాయి బ్యాచ్‌ను పట్టుకునేందుకు వచ్చిన హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసుల సమక్షంలో ఓ యువకుడిపై సర్జికల్ బ్లేడ్‌తో జరిగిన దాడి సంచలనంగా మారింది. కాగా ఇదే సంఘటనపై గాయాలపాలైన బాధితుడి కుటుంబ సభ్యులు, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జీడిమెట్ల పోలీస్టేషన్‌లో ఫిర్యాదులు చేసిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది.

ఇరువురు స్థానిక పోలీస్టేషన్‌లో చేసిన ఫిర్యాదుల ఆధారంగా వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 16న రాత్రి సమయంలో కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్‌లో హాష్ అయిల్ గంజాయిని విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ కోటమ్మ నేతృత్వంలో దాడులు చేపట్టారు. ఈ దాడిలో హేమంత్, నితిష్, రవితేజా, చరణ్‌ను విచారిస్తున్న క్రమంలో కుత్బుల్లాపూర్ వెంకటేశ్వరనగర్ కాలనీకి చెందిన బి చంటియాదవ్(28) తన పనులు ముగించుకొని అటువైపు నుండి వస్తుండగా పోలీసులకు గంజాయి విక్రయదారులకు మధ్య జరుగుతున్న పెనుగులాటలో జోక్యం చేసుకోవడంతో అకస్మాత్తుగా చంటియాదవ్ తలభాగంలో చెవిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడి జరిగింది. తీవ్ర రక్తస్రావం కావడంతో చంటిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా 15 కుట్లు పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

– జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో పరస్పర ఫిర్యాదులు%ా?

%ఇదే సంఘటనపై జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో బాధిత కుటుంబంతోపాటు హైదరాబాద్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ కోటమ్మలు ఇచ్చిన ఫిర్యాదులు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎక్సైజ్ అధికారులు గంజాయి బ్యాచ్ వత్తాసు పలుకుతూ తమ సోదరుడి చంటిపై దాడి చేశారని గాయాలపాలైన బాధితుడి అన్న ప్రవీన్ కుమార్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కాగా విధి నిర్వహణలో తమ విధులకు పూర్తిగా ఆటంకం కలిగించారని హేమంత్, నితిష్, రవితేజా, చరణ్‌తోపాటు ఇతరులపై ఇన్‌స్పెక్టర్ సిహెచ్ కోటమ్మ ఫిర్యాదు చేసింది.

– ఇన్‌ఫార్మర్ అనే నెపంతో దాడి జరిగిందా..!

కాగా బాధితుడు పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడని, తమ గుట్టును పోలీసులకు చేరవేయడంతోనే గంజాయి బ్యాచ్ ఈ దాడికి పాల్పడ్డారా..? అనే ప్రశ్నలు స్థానికంగా వెల్లువెత్తుతున్నాయి. అయితే సర్జికల్ బ్లేడ్లు గంజాయి బ్యాచ్ వద్దనే ఉంటాయే తప్పా పోలీసుల వద్ద ఎందుకు ఉంటాయని, పోలీసుల సమక్షంలోనే ఈ దాడి జరిగినప్పుడు గంజాయి బ్యాచ్‌ను ఎందుకు








పట్టుకోలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ సంఘటనపై ఇటు పోలీసుల అత్యుత్సాహంతోపాటు అటు గంజాయి బ్యాచ్ ఆగడాలే ఈ సంఘటనకు దారి తీశాయంటూ పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కాగా ఇదిలా ఉండగా జీడిమెట్ల పోలీసులు తమకేమి తెలియదన్న చందనంగా ఇరువురు ఎఫ్ఎఆర్ కాఫీలు మీడియా గ్రూప్‌లో పోస్ట్ చేయడం గమనార్హం. ఇతర సంఘటనలు జరిగిన సమయంలో ఎఫ్ఎఆర్ కాఫీలను బహిర్గతం చేయకుండా ఉండే పోలీసులు ఈ సంఘటనతో నేరుగా ఇరువురికి సంబంధించిన ఎఫ్ఐఆర్‌లు బహిర్గతం చేయడం గమనార్హం.

## రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబిత ధ్వజం



సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో బీహార్‌లో కోట్ల రూపాయలతో కాంగ్రెస్ ప్రకటనలు ఇస్తుంది. తెలంగాణ రైతులకు, ప్రజలకు, ఉద్యోగులకు, విద్యార్థులకు సంక్షేమ పథకాలు అందించేందుకు మాతరం డబ్బులు లేవు. కానీ వేరే రాష్టాల్లో కోట్ల రూపాయలతో ప్రకటనలకు సర్కార్ సొమ్ము ఖర్చు చేస్తున్నారని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. నాడు పాఠశాలలు మొదలైన నాడే పాఠ్యపుస్తకాలు ఇచ్చిన ఘనత నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ది. కాంగ్రెస్ పాలనలో పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పాఠ్యపుస్తకాల జాడలేదన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల భోజనానికి పైసలు లేవు. కేజీబీవీలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలకు నిధులు లేవు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీసం ఎక్స్–రే మిషిన్లు రిపేర్ చేయించడానికి డబ్బులు లేవు. ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడానికి రూపాయలు లేవు. తెలంగాణ రాష్ట్రంలోని పత్రికలకు, జర్నలిస్టుల సంక్షేమానికి నిధులు లేవు. కానీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా కోట్ల రూపాయల తెలంగాణ ప్రజల సొమ్మును బీహార్ ఎన్నికల ప్రకటనల కోసం రేవంత్ సర్కార్ ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే సబిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గోపీ భావమే కృష్ణ భక్తి పరమార్థం



సత్యమేవ జయతే జహీరాబాద్, ఆగస్టు 17:గోపీ భావమే కృష్ణ భక్తి పరమార్థమని సంగారెడ్డి జిల్లా కంది హరేకృష్ణ టెంపుల్ ప్రతినిధి విభిషణ్ ప్రభుజీ సెలవిచ్చారు. జహీరాబాద్ హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు 168 వ నగర సంకీర్తన అట్టహాసంగా జరిగింది. పట్టణంలోనిశ్రీరామ మందిరం నుండి ప్రారంభమైన శోభాయాత్ర స్థానిక హనుమాన్ మందిరం వరకు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన నందోత్సవంలో పాల్గొని ఆయన ప్రవచించారు. కృష్ణుడికి గోపికలు అత్యంత ప్రీతీపాత్రమైన భక్తులని, నిష్కల్మషమైన ప్రేమను కురిపించడం ద్వారా వారు భగవంతుడి సాన్నిహిత్యాన్ని పొందారన్నారు. భగవంతుడు ప్రేమ గా కొలిచే వారిని తప్పక అనుగ్రహిస్తారని, అయితే అట్టి భక్తిని సాధించాలంటే అనునిత్యం హరేకృష్ణ మంత్ర జపం చేయాల్సిన అవశ్యకతను నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడికి ఉయ్యాల లో వేసి జోల పాటలు పాడారు. 56 రకాల పిండి వంటలతో భోగ నైవేద్యాన్ని సమర్పించిన అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అర్ధరాత్రి నుండి తెల్లవారే వరకు ఉత్సవాలు జరగడం తో ఆలయ ప్రాంగణం అసాంతం దేదీప్య మానంగా శోభిల్లింది. అనంతరం జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామంలోని పల్లె సంకీర్తన లో జహీరాబాద్ హరేకృష్ణ మూమెంట్ సభ్యులు పాల్గొన్నారు. అక్కడి చిన్నారులు కృష్ణ, గోపిక వేషాధారణతో అలంకరించుకొని ఉట్టిలను పగులకొట్టారు. గ్రామంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన ఉట్టి కార్యక్రమాలలో చిన్నారులు పాల్గొని కోలాటం నిర్వహించారు. గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను రంగరించగా భక్తులు సాంప్రదాయ వస్త్రధారణతో అలరించారు. జహీరాబాద్, హుగ్గెల్లి హరేకృష్ణ మూమెంట్ సంయుక్తంగా చేపట్టిన ఈ నందోత్సవంలో ప్రజలు భక్తిభావంతో కొలుస్తూ వాడవాడలా ఘనంగా స్వాగతం పలికారు.

## వీరశైవుల పాదయాత్ర ను ప్రారంభించిన డి సి ఎం ఎస్ చైర్మన్ శివకుమార్.

సత్యమేవ జయతే జహీరాబాద్ ఆగస్టు 17లోక కళ్యాణం, విశ్వశాంతి కోసం లింగాయత్ సమాజ్, స్థానిక రాచన్న మందిర్ భజన మండలి సంయుక్తంగా చేపట్టిన బడంపేట్ మహా పాదయాత్రను డి సి ఎం ఎస్ చైర్మన్ మల్కాపూర్ శివకుమార్ ప్రారంభించారు. ఆదివారం ఉదయం రాచన్న మందిరం చేరుకొని శివ నామస్మరణతో పాదయాత్రను చేపట్టారు. జహీరాబాద్ జాతీయ రహదారి మీదుగా సాగిన ఈ పాదయాత్ర బస్ స్టాండ్, కైలాసగిరి శివాలయం, శేఖపూర్, పర్సపల్లిల మీదుగా మధ్యాహ్నం బడంపేట్ లోని రాచన్న మందిరానికి చేరుకొంది. పెద్ద ఎత్తున మహిళలు, పురుషులు సాంప్రదాయ వస్త్రధారణతో ఊరేగింపుగా పాదయాత్ర చేపట్టడంతో దారి పొడవునా వివిధ గ్రామాల ప్రజలు పుష్ప వర్షం కురిపించారు.తాలూకా వీరశైవ లింగాయత్ సమాజ్ రాచన్న స్వామి భక్త బృందం వారిచే జరుపబడిన ఈ మూడో మహాపాదయాత్ర కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఇప్పేపల్లి నర్సింలు,మాజీ జిల్లా అధ్యక్షులు మధుశేఖర్, జిల్లా సలహాదారులు అనిమిశెట్టి జయప్రకాష్,జిల్లా కోశాధికారి సంతోష్,జిల్లా ప్రధాన కార్యదర్శి కొంకరాజేశ్వరి, జిల్లా నాయకులు రామప్ప, జిల్లా యువజన నాయకుడు బుగ్గన గారి మల్లికార్జున, అలాగే సీనియర్ నాయకులు



రంజోలు ఆగూర్ వైద్యనాథ్, నామ రవి కిరణ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు జిల్లా వీరశైవ లింగాయత్ సమాజ్ ఉపాధ్యక్షులు ఆగూర్ శివరాజు, తాలూకా అధ్యక్షులు సిద్ధపురంఅరుణ్ కృతజ్ఞతలు తెలిపారు.

# రైల్వే నెట్‌వర్క్ లేని టాప్ 10 దేశాలు ఏవో తెలుసా?

ఈ దేశాలలో ఎక్కువ భాగం రోడ్డు, వాయు రవాణా, సముద్ర మార్గాలు వంటి ఇతర రవాణా మార్గాలపై ఆధారపడి ఉంటాయి. రైల్వే నెట్‌వర్క్ లేని దేశాల ఉనికికి కారణాలు భౌగోళిక, ఆర్థిక అంశాల నుండి రాజకీయ అంశాల వరకు మారవచ్చు. వరల్డ్ అట్లాస్ డేటా ప్రకారం..

రైల్వేలు ప్రపంచవ్యాప్తంగా అత్యంత అనుకూలమైన, ఆర్థిక రవాణా మార్గాలలో ఒకటిగా పరిగణిస్తారు. అయితే రైల్వే వ్యవస్థ పనిచేయని దేశాలు ఉన్నాయని మీకు తెలుసా? ఈ దేశాలలో ఎక్కువ భాగం రోడ్డు, వాయు రవాణా, సముద్ర మార్గాలు వంటి ఇతర రవాణా మార్గాలపై ఆధారపడి ఉంటాయి. రైల్వే నెట్‌వర్క్ లేని దేశాల ఉనికికి కారణాలు భౌగోళిక, ఆర్థిక అంశాల నుండి రాజకీయ అంశాల వరకు మారవచ్చు. వరల్డ్ అట్లాస్ డేటా ప్రకారం 2025 నాటికి రైల్వే వ్యవస్థ లేని దేశాల జాబితా గురించి తెలుసుకుందాం.

1. అండోరా: అండోరా ఫ్రాన్స్, స్పెయిన్ మధ్య ఉన్న పైరినీస్ పర్వత శ్రేణిలో ఉంది. ఈ దేశం ఒక చిన్న రాజ్యం. ఇక్కడ రైల్వే నెట్‌వర్క్ పనిచేయదు. దాని పర్వత భూభాగం, చిన్న పరిమాణం ఇక్కడ పెద్ద ఎత్తున రైల్వే అభివృద్ధిని అసాధ్యం చేశాయి. ఇక్కడి ప్రజలు ప్రధానంగా రోడ్డు రవాణా, సమీప దేశాలకు బస్సు లింక్‌లపై ఆధారపడతారు.
2. భూటాన్: భూటాన్ హిమాలయాలతో చుట్టిన భూపరివేష్టిత రాజ్యం, ప్రధానంగా పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధిపై దృష్టి పెడుతుంది. దేశం భౌగోళిక స్థానం, పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను పరిమితం చేసే విధానం రైల్వేలను విస్మరించాయి. అయితే భవిష్యత్తులో భూటాన్‌ను రైలు ద్వారా భారతదేశానికి అనుసంధానించడానికి ప్రతిపాదనలు ఉన్నాయి.
3. సైప్రస్: 20వ శతాబ్దం ప్రారంభంలో సైప్రస్‌లో రైల్వే వ్యవస్థ ఉండేది. కానీ అది 1951లో మూసివేశారు. ఇప్పుడు దేశం రోడ్డు, వాయు రవాణాపై ఆధారపడుతుంది. దీని చిన్న పరిమాణం దేశీయ ప్రయాణానికి రోడ్డు రవాణాను సౌకర్యవంతంగా చేస్తుంది.

4. తూర్పు తైమూర్ (తైమూర్–లెస్టే): ఆగ్నేయాసియా దేశమైన తూర్పు తైమూర్ అత్యంత పేద దేశాలలో ఒకటి. అలాగే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి దాని మౌలిక సదుపాయాలు ఇప్పటికీ అభివృద్ధి దశలోనే ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులు, తక్కువ జనాభా ఉండటం. ఈ కారణాల వల్ల రైలు నెట్‌వర్క్ లేదని తెలుస్తోంది.

5. ఐస్లాండ్: తక్కువ జనాభా, సున్నితమైన అగ్నిపర్వత భూభాగం కారణంగా ఐస్లాండ్‌లో రైల్వే నెట్‌వర్క్ లేదు. ఈ ద్వీప దేశానికి రోడ్డు రవాణా, స్థానిక వాయు రవాణా అనుకూలంగా ఉంటాయి.
6. కువైట్: కువైట్‌లో కార్యాచరణ రైలు వ్యవస్థ లేదు. కానీ దీనిని %+జజ% రైల్వే



ప్రాజెక్టుకు అనుసంధానించాలని చాలా కాలంగా ప్రణాళిక ఉంది. ప్రస్తుతం ప్రజలు రోడ్డు రవాణాను ఇష్టపడతారు.
7. లిబియా: లిబియా ఒకప్పుడు దేశీయ రైలు వ్యవస్థ కోసం ప్రతిష్టాత్మక ప్రణాళికలను కలిగి ఉంది. అంతర్యుద్ధం కారణంగా అది నిలిపివేయడానికి ముందే పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కొనసాగుతున్న రాజకీయ అస్థిరత కారణంగా దేశంలో ఇప్పటికీ రైల్వేలు లేవు.
8. మారిషస్: ఆఫ్రికాలోని చిన్న ద్వీప దేశం మారిషస్. 1960లలో రైల్వేలు తొలగించారు. కానీ 2020లో రాజధాని పోర్ట్ లూయిస్‌లో మెట్రో ఎక్స్‌ప్రెస్ అనే లైట్ రైలు ప్రారంభించారు. ఇది నగర రవాణా కోసం ఉపయోగపడుతుంది. అయినప్పటికీ జాతీయ స్థాయి రైల్వే నెట్‌వర్క్ మాత్రం లేదు.

9. శాన్ మారినో: అతి చిన్న దేశాలలో ఒకటైన శాన్ మారినో. రెండవ ప్రపంచ యుద్ధం నాశనం అయ్యే వరకు ఇటలీకి రైలు మార్గాన్ని కలిగి ఉంది. దానిని ఎప్పుడూ పునర్నిర్మించలేదు. నేడు రోడ్డు రవాణా పూర్తి సేవలను అందిస్తుంది.

10. సోమాలియా: ఒకప్పుడు వలస పాలనలో సోమాలియాలో రైల్వేలు పనిచేశాయి. కానీ గడిచిన దశాబ్దాలుగా యుద్ధాలు, రాజకీయ అస్థిరత కారణంగా రైల్వే నెట్‌వర్క్ పూర్తిగా నాశనం అయింది. ఇప్పుడు రోడ్లు, సముద్ర మార్గాలే ప్రధాన వనరులు.

# తపస్సు చేయడం వల్ల కలిగే ఫలితమేంటి?

పూర్వకాలంలో ఋషులు ఎక్కువకాలం ధ్యానంలోనే గడిపేవారు. అంటే తపస్సు చేస్తుండేవారు. ప్రపంచంతో ఎటువంటి సంబంధం లేకుండా ప్రశాంత వాతావరణంలో కూర్చొని, దేవుడి నామాన్ని స్మరిస్తూ నిరంతర ధ్యానంలోనే వుండేవారు. ఇంతకీ ఈ తపస్సు వల్ల కలిగే లాభం ఏంటి? అని ప్రతిఒక్కరికి సందేహం రాక తప్పదు. ఏదో ఓ మంత్రాన్ని ఉపాసిస్తూ, నిరంతర ధ్యానంలో వుండడమే తపస్సు అనుకోవడం చాలా పొరపాటు. తపస్సు అంటే 'తపన'. ఒక కార్యసాధన కోసం అనుక్షణం తపించడమే 'తపస్సు. అలా తపించడం వల్ల కచ్చితంగా ప్రయోజనం వుంటుంది. ఎందుకంటే.. మనస్సంకల్పానికి ఉన్న శక్తి, బలము ఈ సృష్టిలోనికి లేదు. ఇందుకు ఉదాహరణగా.. ఓ ఆయుధాన్ని చాలాకాలం వాడకుండా ఓ మూల పడేస్తే, అది తుప్పుపట్టి పనికిరాకుండా పోతుంది.

కానీ దాన్ని నిరంతరం వాడుతూంటే పదునుదేలి.. దాని పనితనాన్ని చూపిస్తుంది. అలాగే మనస్సు కూడా. అయితే., ఇక్కడ అందరికి మరో సందేహం రావచ్చు. 'మనస్సు నిరంతరం ఏదో ఒక విషయం గురించి ఆలోచిస్తూనే ఉంటుంది కదా! మరి తపస్సు ఎలా అవుతుంది' అని ప్రశ్న మదిలో కచ్చితంగా పుట్టుకొస్తుంది. అప్పుడు ఓ విషయాన్ని గ్రహించాల్సి వుంటుంది. ఆలోచించడం వేరు, ఆరాటపడడం వేరు. ఏదో ఒక విషయం గురించి ఆలోచించడాన్ని.., ఆరాటపడడం అనరు.

చంచలమైన మనస్సును నియంత్రించి, ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని దానికి నిర్దేశించి., ఆ దిశగా మనసును మళ్ళించడానికి పడే ఆరాటాన్నే.. 'తపస్సు' అంటారు. అది మంచి అయితే మంచి ఫలితాన్ని.., చెడు అయితే చెడు ఫలితాన్ని తప్పకుండా ఇస్తుంది. అందుచేతనే తపస్సు చేసే సాధకుడు మంచినే ఆశించి., విశ్వశాంతిని కాంక్షిస్తూ తపస్సు చేయాలి. అదే నిజమైన తపస్సు. ఇందుకు ప్రకృతి పరమైన ఆధారం కూడా వుంది. అదే.. సృష్టిలో అందమైన కీటకం 'సీతాకోకచిలుక'.



**తపస్సుకు ప్రకృతి పరమైన ఆధారం :**

సాధారణంగా ఒక ప్రాణి నుంచి అదే విధమైన ప్రాణి పుడుతుంది. కానీ.. సీతాకోకచిలుక పెట్టే గ్రుడ్ల నుంచి సీతాకోకచిలుకలు రాకపోగా గొంగళిపురుగులు వస్తాయి. అవి చూడడానికి చాలా అసహ్యంగా ఉంటాయి. ఆ దశలో అది రాళ్ళలో, రప్పల్లో, తిరుగుతూ... ఆకులు తింటూ కాలం గడుపుతుది. కొంత కాలం గడిచాక తన జీవితం మీద రోత కలిగి... ఆహార, విహారాలు త్యజించి, ఎవ్వరికీ కనిపించని ప్రదేశనికి వెళ్లిపోయి., తన చుట్టూ ఓ గూడు నిర్మించుకుని, తపస్సమాధి స్థితిలోకి వెళ్లిపోతుంది. అలా కొంతకాలం గడిచాక, దాని తపస్సు ఫలించాక అది తన గూడు చీల్చుకుని బయటకు వస్తుంది. అప్పుడది గొంగళిపురుగులా కాకుండా అందమైన సీతాకోకచిలుకలా వస్తుంది. ఆకులు, అలములు తినకుండా. పూవుల్లో ఉండే మకరందాన్నే తాగుతుంది. ప్రకృతి ధర్మానికి కట్టుబడి గ్రుడ్లు పెట్టిన మరుక్షణం ఈ సంసార జగత్తులో చిక్కుకోక మరణిస్తుంది. అదీ తపస్సు ఇచ్చే ప్రతిఫలం. అలాగే తపస్సిద్ధి పొందిన మానవుడు ఈ సంసార లంపటంలో చిక్కుకోకుండా భగవన్నామామృత పానంతో తరిస్తాడు

# గుడిలో ప్రదక్షిణలు ఎందుకు చేస్తారు?




గుడికి వెళ్లిన ప్రతివారూ ప్రదక్షిణలు చేస్తారు. ప్రదక్షిణలు రెండు రకాలుగా చేస్తాం - ఒకటి ఆత్మ ప్రదక్షిణ అయితే, మరొకటి గర్భగుడి లేదా విగ్రహం చుట్టూ తిరుగుతూ ప్రదక్షిణ చేస్తాం. అయితే చాలామందికి ఇది ఒక జవాబు దొరకని అంతుచిక్కని ప్రశ్నగా మారవచ్చు. గుడిలో వున్న దేవుడికి నమస్కారం పెడుతూ మనస్సులో మనం ఏదైనా కోరిక కోరుకుంటాం. ఆయనకు నైవేద్యం కింద కొబ్బరికాయలు లేదా పువ్వులను సమర్పిస్తాం. అయితే దేవుడితో నేరుగా సంబంధం లేని మనకు ఈ ప్రదక్షిణలు చేయావలసిన ఏముందని కొంతమందికి సందేహం కలగవచ్చు. దీనికి జవాబుగా పండితులు ఈ విధంగా విశ్లేషిస్తారు. "మనకు కనిపించే సృష్టికి ఆతిథ్యమిస్తున్న భూమి తన చుట్టూ తాను ప్రదక్షిణలు చేస్తూ వుంటుంది. భూమి ఈ విధంగా ప్రదక్షిణలు చేయడం వల్ల తనకు శక్తి వస్తుందా లేక తన శక్తిని నిలబెట్టుకోవడం కోసం ప్రదక్షిణలు చేస్తోందా..? అనే విషయం పక్కన బెడితే, భూమి ప్రదక్షిణ చేయకుండా వుంటే మరుక్షణమే ఏమైనా జరగవచ్చు. సృష్టి మొత్తం నాశనం కావచ్చు. అదేవిధంగా సూర్యుని చుట్టూ భూమి ప్రదక్షిణం చేస్తోంది. ఫలితంగా జీవరాశి మనుగడకు సూర్యునినుంచి శక్తిని పొందుతోంది. ఈ విధంగా భూమి ఆత్మప్రదక్షిణలు చేస్తూ, సూర్యుని చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. అలాగే భక్తులు కూడా ఆత్మప్రదక్షిణలు చేయటం, విగ్రహం చుట్టూ తిరగడం పైన చెప్పిన విషయాలే సూచికగా వుంటాయి. ఇలా భ్రమణం చేయడం వల్ల దేవును నుంచి అతీతమైన జ్ఞానశక్తిని పొందడమే గాక, మనస్సుకు - శరీరానికి కూడా మేలు చేస్తుంది. దీనిని గుర్తించబట్టే కొన్ని తరాల నుండి కేవలం హిందువులు మాత్రమే ఇలా ప్రదక్షిణలు చేసే ఆచారాన్ని పాటిస్తూ వచ్చారు.

**ఎన్నిసార్లు చేయాలి?**

ప్రదక్షిణలు ఎన్నిసార్లు చేయాలనే విషయంపై ఇంతవరకు ఎవ్వరూ ఖచ్చితమైన నిర్ణయం తీసుకోలేదు, చేయలేదు కూడా. కొందరు మూడుసార్లు చేయాలని చెబితే, మరికొందరేమో అయిదు లేదా పదకొండు సార్లు చేయాలని సూచిస్తారు. ఇక్కడ ఒక విషయాన్ని గమనిస్తే.. ఎన్ని ప్రదక్షిణలైనా కానీ అవి బేసిసంఖ్యలో మాత్రమే వుంటాయి. అంటే 3, 5, 11, ఇలా అన్నమాట! ఇలా ఎందుకు నిర్ణయించారనేది ఇంతవరకు జవాబు దొరకని ప్రశ్న! ఏ దేవుడి గుడికెళ్లే, ఆ గుడికి సంబంధించిన స్తోత్రం పఠిస్తూ ప్రదక్షిణలు చేయాలి. మనస్సు కేంద్రీకరించి ప్రదక్షిణ చేయడం చాలా ముఖ్యం! అలాగే స్తోత్రం మొత్తం తెలియాల్సిన అవసరం కూడా లేదు.

# త్రికరణశుద్ధిగా ఆలయానికి రావాలట.. లేకుంటే తేనెటీగలు తరిమేస్తాయట.. ఎక్కడుందా వింత ఆలయం..?



పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రాంతంలో ఆ ఆలయం విశేషాలకు పెట్టింది పేరు. శనివారం మాత్రమే ఆ ఆలయం తెరుస్తారు. ఈ ఆలయానికి ఎలా పడితే అలా రాకూడదట. శుచి, శుద్ధి లేకుండా వచ్చారో, అక్కడి తేనేటీగలు వెంటపడి మరీ తరుముతాయట.త్రికరణశుద్ధిగా ఆలయానికి రావాలట.. లేకుంటే తేనెటీగలు తరిమేస్తాయట.. ఎక్కడుందా వింత ఆలయం..?

%పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రాంతంలో ఆ ఆలయం విశేషాలకు పెట్టింది పేరు. శనివారం మాత్రమే ఆ ఆలయం తెరుస్తారు. ఈ ఆలయానికి ఎలా పడితే అలా రాకూడదట. శుచి, శుద్ధి లేకుండా వచ్చారో, అక్కడి తేనేటీగలు వెంటపడి మరీ తరుముతాయట. నల్లమల అటవీ ప్రాంతంలో ప్రకృతి అందాల నడుమ ఈ ఆలయం కొలువుతీరి ఉంటుంది. సుదూర ప్రాంతాల నుంచి ఈ ఆలయానికి భారీగా తరలివస్తుంటారు. ఈ ఆలయానికి ఆ ప్రాంతంలో ఎంతో ప్రత్యేకత ఉంది. ఈ ఆలయానికి వచ్చే భక్తులు శుద్ధిగా రాకపోతే ఆలయ ప్రాంగణంలో ఉండే తేనెటీగలు కుట్టి తరిమేస్తాయని భక్తులు ఇక్కడ ప్రగాఢంగా నమ్ముతారు. అంతేకాదు ఈ విషయం ఎన్నో మార్లు అక్కడ జరిగిందట. అందుకే భక్తులు ఈ ఆలయానికి వచ్చేటప్పుడు ఎంతో నిష్టగా, త్రికరణ శుద్ధిగా వచ్చి ఆ ఆలయాన్ని దర్శించుకుంటారు. ఇంతకు ఆ ఆలయం ఏంటో%ౌ%. ఆ ఆలయంలో కొలువుతీరిన దేవుడు ఎవరో తెలుసుకోవాలంటే%ౌ% ఈ కథనం చదివేయండి..!

ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామ సమీపంలో ఉన్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయం ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. నల్లమల అటవీ ప్రాంతంలో ఉండే ఈ ఆలయానికి భక్తులు ప్రతి శనివారం భారీగా తరలి వస్తారు. ప్రకాశం జిల్లా నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి కూడా ఈ ఆలయానికి వస్తుంటారు. ఆలయ సమీపంలో ఉన్న నీటి గుండం ఈ ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

ఇక్కడ కొలువైన దేవుడిని సాక్షాత్తు శ్రీమహావిష్ణువు అవతారమని భక్తులు భావిస్తారు. శ్రీమహావిష్ణు రూపం ఇక్కడ శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి రూపంలో వెలసినట్లుగా ప్రజలు ప్రగాఢంగా నమ్ముతారు. స్వామివారిని దర్శించుకునేందుకు ప్రతి శనివారం భక్తులు భారీగా వస్తుంటారు. కానీ ఈ ఆలయానికి వచ్చే భక్తులు శుద్ధిగా లేకపోతే ఆలయ ప్రాంగణ పరిసర ప్రాంతాలలో ఉన్న తేనెటీగలు వారిని కుట్టి ఆలయ ఆవరణలో నుంచి తరిమేస్తాయని ఇక్కడికి వచ్చే భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. అంతేకాదు ఈ విషయం ఎన్నో సార్లు నిరూపితమైందని ఇక్కడికి వచ్చే భక్తులు చెబుతారు.

తేనెటీగలు ముక్కుమ్మడిగా దాడి చేసేటప్పుడు గోవింద గోవింద అంటూ నామస్మరణ చేస్తే ఆ తేనెటీగలు కుట్టవని భక్తులు నమ్ముతారు. అలాగే తేనెటీగలు కుట్టే సమయంలో ఆలయ సమీపంలో ఉన్న నీటి గుండంలో దిగడం వల్ల కూడా తేనెటీగలు కుట్టవని భక్తులు చెబుతారు. ప్రతి వేసవికాలంలో ఇక్కడ శ్రీ నెమలి గుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. స్వామివారికి స్థానిక ప్రజాప్రతినిధులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ముఖ్యంగా ఈ ఆలయంలో ప్రతి శనివారం ప్రత్యేక పూజలు జరుగుతాయి.ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ప్రతి శనివారం ఈ ఆలయం తెరచి ఉంటుంది. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో ఈ ఆలయం ఉండడంతో మిగతా రోజుల్లో భక్తులకు అధికారులు అనుమతి ఇవ్వరు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో వర్షాలు కురిసిన సమయంలో కూడా భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆలయ దర్శనానికి భక్తులకు అనుమతి ఉండదు. ఈ ఆలయానికి గిద్దలూరు నుంచి అంబవరం, వెలుపల్లి గ్రామాల మీదుగా జేపీ చెరువు గ్రామానికి చేరుకోవచ్చు. అంతేకాకుండా రాచర్ల మండలంలోని అన్నం పల్లె గ్రామం మీదుగా కూడా జేపీ చెరువు గ్రామానికి వెళ్ళవచ్చు. ప్రతి శనివారం భక్తులు ఆలయాన్ని దర్శించుకునేందుకు ఏపీఎస్ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సులు కూడా నడుపుతుంది.




**మేషం**

విందులు, వినోదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంది. మానసిక ఆందోళనతో ఉంటారు. కుటుంబంలో మార్పును కోరుకుంటారు. ప్రతి చిన్న విషయంలో ఆటంకాలు ఎదురవుతాయి. ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ అవసరం.

**వృషభం**

తోటివారితో విరోధం ఏర్పడకుండా జాగ్రత్త వహించడం మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలు ఉన్నాయి. వృధా ప్రయాణాలు ఎక్కువ చేస్తారు. కుటుంబ విషయాల్లో అనాసక్తితో ఉంటారు. స్త్రీలు విశ్రాంతి తీసుకోవడం అవసరం.

**మిథునం**

రుణప్రయత్నాలు ఫలిస్తాయి. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉండకపోవడంతో మానసిక ఆందోళన చెందుతారు. స్త్రీలకు స్వల్ప అనారోగ్య బాధలు ఉంటాయి. బంధు, మిత్రులతో జాగ్రత్తగా ఉండటం మంచిది.

**కర్కాటకం**

కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంటుంది. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకోకుండా జాగ్రత్తగా ఉండటం మంచిది. వృత్తి, ఉద్యోగరంగాల్లో సహనంవహించక తప్పదు.

**సింహం**

నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. సంఘంలో అప్రతిష్ఠ రాకుండా జాగ్రత్తపడటం మంచిది. ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఎదురవడంతో ఇబ్బంది పడతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు. రుణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. సోదర వైరం కలిగే అవకాశం ఉంటుంది.

**కన్య**

స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశం ఉంటుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా ఉండటం మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే అనారోగ్య బాధలు ఉండవు.

**తుల**

ప్రయత్నం మేరకు స్వల్ప లాభం ఉంటుంది. వృథా ప్రయాణాలు ఎక్కువగా చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలు ఉంటాయి. రుణప్రయత్నాలు చేయవలసి వస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. బంధు, మిత్రుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది.

**వృశ్చికం**

వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. పోట్లాటలకు దూరంగా ఉండటం మంచిది. అనారోగ్య బాధలను అధిగమించడానికి ఔషధసేవ తప్పదు. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో తొందరపాటు పనికిరాదు.

**ధనుస్సు**

కుటుంబమంతా సంతోషంగా ఉంటారు. గతంలో వాయిదావేసిన పనులన్నీ పూర్తిచేసుకుంటారు. సంపూర్ణ ఆరోగ్యం ఏర్పడుతుంది. స్థిరనివాసం ఉంటుంది. వ్యవసాయ మూలకంగా లాభాలను పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ ఫలిస్తాయి. సూక్ష్మ విషయాలను గ్రహిస్తారు.

**మకరం**

కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా ఉన్నాయి. వేళ ప్రకారం భుజించడానికి ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. పిల్లలపట్ల ఏమాత్రం అశ్రద్ధ పనికిరాదు.

**కుంభం**


కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనంవహించడం అన్నివిధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధం ఏర్పడకుండా జాగ్రత్తపడటం మంచిది. అనవసర ధనవ్యయంతో రుణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది. అనారోగ్య బాధలకు ఔషధసేవ అవసరం.

**మీనం**

కుటుంబంలో చిన్నచిన్న గొడవలు వచ్చే అవకాశం ఉంది. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి రుణప్రయత్నాలు చేస్తారు. బంధు, మిత్రుల సహాయ సహకారాలు ఆలస్యంగా లభిస్తాయి.

# సాయి సందేశం 'సబ్‌కా మాలిక్ ఏక్'

**సబ్‌కా మాలిక్ ఏక్ అన్న సందేశంతో యావత్ మానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన సాయి భగవాన్ మందిరం మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా షిర్డిలో ఉంది. ఫకీర్ అవతారంలో అనేక మహిమలు ప్రదర్శించిన సాయినాథుడు ఇప్పటికీ సమాధి నుంచే భక్తులకు అభయమిస్తాడని అసంఖ్యాక సాయి భక్తుల నమ్మకం. సాయి మందిరాన్ని దర్శించుకునేందుకు రోజు వేలాది భక్తులు షిర్డికి వస్తుంటారు.**




**శ్రద్ధ, సబూరి ..** శ్రద్ధ అంటే విశ్వాసం, భక్తి, సబూరి అంటే ఓర్పు, సాధన సందేశాలతో మానవాళికి అమూల్యమైన శాంతి సందేశాన్ని ఇచ్చారు. సాయినాథుడు ఎక్కడ జన్మించారు అన్న అంశంపై వేర్వేరు వాదనలు ఉన్నాయి. అహ్మద్‌నగర్ జిల్లాలోనే 19 శతాబ్దంలో జన్మించినట్టు కొందరు పర్భానీ జిల్లాలో జన్మించినట్టు మరికొందరు పేర్కొంటారు. అయితే ఈ వాదనలను పక్కనబెడితే హిందూ, ముస్లింల మధ్య సఖ్యతకు కృషి చేసిన మహనీయుల్లో ఆయన అగ్రగణ్యుడు.

షిర్డిలోని పాత మసీదు మందిరాన్నే తన నివాసంగా చేసుకొని మత సామరస్యత కోసం శ్రమించారు. ఇప్పుడు ఆ మందిరాన్ని ద్వారకామాయిగా పిలుస్తున్నారు. సమాధి మందిరం పక్కన ఉన్న గురుస్థానంలో ఆయన కూర్చొని ఉండేవారు. తొలిసారిగా 1854లో బాలసాయిని వీక్షించిన గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. ఎప్పుడూ ధ్యానంలో ఉండే సాయిని అనేక ప్రశ్నలు అడిగేవారు. అనంతరం ఆయన కొంతకాలం కనిపించలేదు.

**ఆవో సాయి..** షిర్డి గ్రామంలోని ఖండోబా మందిరంలో మహాల్సాపతి పూజరిగా ఉండేవారు. ఒకసారి సాయి ఆ గ్రామంలోకి తిరిగి ప్రవేశించారు. ఆయనను చూసిన మహల్సాపతి ఆవో సాయి అని ఆహ్వానించారు. దీంతో ఆయన నామం సాయిగా స్థిరపడింది. భగవుంతునికి ఎలాంటి పేర్లు ఉండవు. భక్తులు ఏ పేరుతో పిలిస్తే పలుకుతారు అదే రీతిలో సాయిబాబాగా ప్రఖ్యాతిచెందారు. సాయి మహిమలను వీక్షించిన అనేక మంది ఆయన శిష్యులుగా మారారు. మహాల్సాపతి, శ్యామ, హరి సీతారాం, దామోదర్... తదితరులు ఆయన శిష్యగణంలో ఉండేవారు. స్వామివారి మహిమలు దేశమంతటా వ్యాపించడంతో అనేకమంది భక్తులు షిర్డికి రావడం ప్రారంభించారు. 1918లో ఆయన సమాధి చెందారు. అయితే సమాధి నుంచే భక్తులను అభయమిస్తుంటాను అన్న ఆయన దివ్య వ్యాఖ్యల ఫలితంగా షిర్డిక్షేత్రం భక్తజన క్షేత్రంగా మారిపోయింది.

**సమాధిమందిర నిర్మాణం:** బాబా భక్తులలో నాగ్‌పూర్‌కు చెందిన గోపాల్‌రావు బూటి ఒకరు. ఆయన కలలో స్వామి కనిపించి తనకు సమాధి మందిరాన్ని నిర్మించమని కోరారు. దీంతో బూటి ఆయనకు మందిరాన్ని నిర్మించారు. అదే మనం నేడు చూస్తున్న సమాధి మందిరం. షిర్డి ప్రవేశమే అన్ని పాపాలకు పరిహారం అన్న బాబా సూక్తికి అనుగుణంగా రోజు వేల మంది భక్తులు సాయి సన్నిధానానికి వస్తుంటారు. మందిర ప్రవేశంతోనే స్వామి దివ్యమంగళ స్వరూపాన్ని వీక్షిస్తూ దివ్యానుభూతి చెందుతారు. ద్వారకామాయితో పాటు చావడి, గురుస్థానం, నందదీప్, లెండి గార్డెన్స్... తదితర ప్రాంతాలను మనం చూడవచ్చు. ఈ ప్రదేశాల్లో సాయి నడియాడిన అంశం మనకు గుర్తుకు వస్తే మనస్సులో ఆధ్యాత్మిక భావన అలముకుంటుంది. సాయి సంస్థాన్ వారు బాబా వస్తువులతో ప్రత్యేకంగా ఒక ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. వీటిని కూడా వీక్షించవచ్చు.

**వసతి సౌకర్యం ...**

సంస్థాన్ వారు అనేక వసతి సముదాయాలను నిర్వహిస్తున్నారు. వీటిని ఆన్‌లైన్ ద్వారా ముందుగానే రిజర్వ్ చేసుకోవచ్చు,

ప్రైవేటు వసతి గృహాలు ఎక్కువగా ఉన్నాయి. భక్తులు వారి ఆర్థిక స్థోమతకు తగినట్టుగా గదులను తీసుకోవచ్చు.

**ఎలా చేరుకోవచ్చు ..**

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి షిర్డికి రైలు, బస్సు సౌకర్యముంది.

హైదరాబాద్ నుంచి అజంతా ఎక్స్‌ప్రెస్, సాయినగర్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. అజంతా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్లేవారు నాగర్‌సోల్ స్టేషన్‌లో దిగాలి. అక్కడ నుంచి షిర్డికి అనేక వాహనాలు ఉంటాయి. సాయినగర్ ఎక్స్‌ప్రెస్‌లో వెళితే నేరుగా షిర్డి చేరుకోవచ్చు.

షిర్డి సమీపంలో విమానాశ్రయాన్ని నిర్మించారు. ఇప్పటికే పలు విమాన కంపెనీలు సర్వీసులను అందిస్తున్నాయి.

ఔరంగాబాద్ విమానాశ్రయంలో దిగి వాహనాల ద్వారా షిర్డి చేరుకోవచ్చు.


# శ్రీ అరవిందుల తత్త్వ దర్శనం!



సాధన త్రికరణ శుద్ధిగా వుంటే యోగమార్గంలో ఫలితం నూరు శాతం లభిస్తుంది. 1926లో ఇవాల్టి (24 నవంబర్) రోజున రాత్రి 8 గంటల వేళ శ్రీకృష్ణుడు నేరుగా నడిచి వచ్చి శ్రీ అరవిందుని హృదయంలోకి ప్రవేశించాడు. ఆయన తుదిశ్వాస విడిచేవరకు పరమాత్మ అక్కడే నివాసమున్నాడు. ప్రతి సంవత్సరం '24 నవంబరు'ను శ్రీ అరవిందాశ్రమం వారు 'సిద్ధిదినం'గా పాటిస్తారు. నిజానికి ఈ రోజును 'శ్రీకృష్ణారవింద సంయోగ దినం'గా భావించాలి. శ్రీ అరవిందులకు 1908 ప్రాంతంలో విష్ణు భాస్కర లేలే అనే యోగి పుంగవునితో పరిచయమైంది. లేలే మహాశయుడు తనకు హఠయోగం నేర్పాడు. ధ్యానమార్గాన్ని చూపాడు. 'ధ్యానం వేళ ఆలోచనలేవీ పెట్టుకోవద్దు. నీ మెదడును నువు బయటి పదార్థం వలె చూస్తూ ఉండు. మెదడులోకి ఆలోచనలు ఒకటొకటిగా వస్తుంటవి. అవి నీ అంతర్నేత్రానికి కనపడుతూ వుంటాయి. వచ్చిన ఆలోచనలను వచ్చినట్టుగా బయటకు పారద్రోలు. తదుపరి నీ మేధ నిశ్చలమవుతుంది' అన్నది ఆ గురువు ఉద్బోధ. శ్రీ అరవిందులు అక్షరాలా దీనిని అమలు జరిపారు. ధ్యానం మొదలుపెట్టిన మూడోరోజే తథాగతుడు ప్రవచించిన నిర్వాణస్థాయికి శ్రీ అరవిందులు చేరుకొన్నారు. అలీపూర్ కుట్రకేసులో విచారణ ఖైదీగా ఆయన కారాగారవాసం అనుభవించారు. అక్కడ వారికేమీ పనిలేదు. విష్ణు భాస్కర లేలే ఉపదేశించిన మార్గంలో పూర్తిస్థాయిలో సాధన చేశారు. గీతాధ్యయనమూ చేశారు. కారాగారంలో ఆయనకు 'శ్రీకృష్ణ దర్శనం' లభించింది. ఆయనకు తోటి ఖైదీలు, పోలీసులు, జైలరు, తనకు అనుకూలంగా-ప్రతికూలంగా కేసును వాదిస్తున్న ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణునివలెనే కనపడసాగారు. తన పక్షాన తాను ఒక్క వాక్యమైనా మాట్లాడలేదు. న్యాయమూర్తి శ్రీ అరవిందుని నిరపరాధిగా విడుదల చేశారు. ఈ అనుభవంతో ఆయన జీవితలక్ష్యమే మారిపోయింది. అరవిందుని కార్యరంగం స్వాతంత్ర్య పోరాటం నుండి ఆధ్యాత్మిక రంగానికి మారింది. 'మన్ను తిన్నాడని' బాలకృష్ణునిపై అభియోగం. 'తినలే'దన్నాడు కన్నయ్య. 'నోరు తెరువు చూస్తా' అన్నది యశోద. ఆ చిన్నినోట్లో పద్నాలుగు భువనాలు ఆమెకు దర్శనమిచ్చాయి. శ్రీ అరవిందులు తన ధ్యానసాధనలో వీటినే దర్శించారు. అక్కడి వాతావరణ పరిస్థితులు, జీవుల స్థితిగతులను అన్నిటినీ ఆయన ఆంగ్లభాషలో రచించిన 'సావిత్రి' మహాకావ్యంలో మనం చదువవచ్చు. 'మహాభారతం'లోని 'సావిత్రి-సత్యవంతుల' కథ అంతా ఆయనకు దృశ్యకావ్యంలా దర్శనమిచ్చింది. సృష్టి, స్థితి, లయలకు చెందిన సరంజామా మొత్తం వారికి ఆ కథలో గోచరించింది.౦ఈ భూమిపై నివసించే జీవజాలమంతటికీ ఉత్కృష్ట ప్రాణి మానవుడేనని మనందరి విశ్వాసం. శ్రీ అరవిందుల దృష్టిలో మనం అధమశ్రేణి మానవులం. ఉత్కృష్ట మానవుడింకా ఉద్భవింపవలసే వున్నది. మన దేహంలోని జీవాత్మ.. పరమాత్మ స్వరూపమే అని మనలో కొందరం భావిస్తున్నాం. ఉత్కృష్ట మానవుడు ఈ భావనను నిరంతరమూ అనుభవిస్తుంటాడు. ఈ అనుభవానికి సంబంధించిన అనుభూతికి మినహాయింపులు ఉండవు. భూలోకంలోని మానవులందరూ స్వర్లోక జీవులకువలె తాము పరమాత్మ అంశ అన్న నిరంతర స్పృహతో జీవిస్తుంటారన్నమాట. 'అతిమానస అవతరణం' ద్వారా ఈ ప్రక్రియ సాధ్యమవుతుందని శ్రీ అరవిందులు చెప్పి వున్నారు. దానికోసం వారు తమ తపస్సు మొత్తాన్ని ధారపోశారు. మనం చేసే ప్రతి పనినీ భగవంతుడు మన ఎదురుగా నిల్చొని చూస్తున్నాడన్న భావనతో చేస్తే చాలు, 'అతి మానస అవతరణం' సాకారమై భువి దివిగా మారిపోతుంది.

# వేదమంత్రాల శక్తికి మూలం?

మంత్రాలకు చింతకాయలు రాలుతాయా? అని ప్రశ్నించే వారు వేదమంత్రాల మహాబలానికి మూలం తెలుసుకోవాలి. వేదాల జ్ఞానసంపదనుబట్టే దాని గొప్పతనం అర్థమవుతుంది. సృష్టితోపాటు ఉద్భవించినట్టుగా భావిస్తున్న వేదవిజ్ఞాన సారాన్ని ఆనాటి మహర్షులే కనుక గ్రహించి మానవజాతికి అందించక పోయుంటే ఇవాళ భూమిపై ఈ కాస్త ధర్మమైనా నిలిచేది కాదని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. అప్పుడు మానవుల జీవితాలు తెరచాపల్లేని నావల్లా అగమ్యగోచరం, నిరర్థకమేకాక నిస్సారమయ్యేవనీ వారంటారు. వేదవాఙ్మయం ఎప్పుడు, ఎలా పుట్టిందనడానికి ఇప్పటికే కొన్ని భావనలు ప్రచారంలోకి వచ్చాయి. ఎవరికి వారు ఏదో ఒక ఆధారాన్నిబట్టి నిర్ధారిస్తున్నారు. శాస్త్రీయ మూలాధారమే అత్యంత ప్రామాణికమవుతుంది. న్యూఢిల్లీకి చెందిన రిటైర్డ్ సీనియర్ ప్రొఫెసర్ ఏవీ మొహరిర్ వెలిబుచ్చిన ఇటీవలి ప్రతిపాదన ఈ కోణంలో ఆలోచింప చేసేదిగా ఉంది. ప్రపంచంలోనే అతిప్రాచీనమైన ఆధ్యాత్మిక తత్వంగా అద్వైత సిద్ధాంతాన్ని పేర్కొంటూనే, వేదమంత్రాలు సృష్టి ఆరంభంలో విశ్వశక్తి ప్రేరణతోనే అత్యంత ప్రాకృతికంగా ఆవిర్భవించినట్లు ఆయన తెలిపారు. వేదాలు అపౌరుషేయాలని (ఎవరూ రాయనివి) భారతీయ తత్వవేత్తలు ఏనాడో తేల్చారు. మన పౌరాణికాల ప్రకారం ప్రళయాలు-ప్రణవాలు (సృష్టి ఆరంభం) ఒక మహాకాలచక్రంలో భాగం. గత ప్రళయం తర్వాత కృతయుగంతో మొదలై త్రేతా, ద్వాపర, కలి యుగాల పిమ్మట మళ్లీ ప్రళయం సంభవిస్తుంది. ఈ కృతయుగ కాలం మొదట్లోనే శ్రీమహావిష్ణువు మత్స్యావతారం దాల్చి, వేదాలను ఎత్తుకెళ్లిన సోమకాసురుడు అనే రాక్షసుని వధించి వాటిని రక్షించాడు. కాబట్టి, అవి తొలియుగం నాటికే వున్నట్టుగా భావించాలి. హైందవ విశ్వాసం మేరకు కృత(సత్య) యుగంతో సృష్టి ప్రారంభమై ఇప్పటికీ అనేక లక్షల సంవత్సరాలు అయింది. వేదాల సృష్టికర్త బ్రహ్మదేవుడే అన్న పౌరాణిక కథా వాడుకలో ఉంది. వేదనాగరికత క్రీ.పూ.1200 సంవత్సరం నాటిదని కొందరు, కాదు క్రీ.పూ.4000 సంవత్సరాల కిందటిదని మరి కొందరు భావిస్తున్నారు. వేదకాలం విషయంలో భిన్నాభిప్రాయాలున్నప్పటికీ అత్యధిక హైందవులు ఇవి అనాదిగా ఉన్నవేనని విశ్వసిస్తున్నారు. ప్రత్యేకించి ఎవరూ రాసినవి కాకపోయినా, లభ్యమవుతున్న సాహిత్య, చారిత్రకాది ఆధారాల మేరకు సంస్కృత భాషలోనే వేదవాఙ్మయమంతా గ్రంథస్తం అయిందన్నది స్పష్టం. అసలు, ఈ దేవభాష (సంస్కృతం)లోకి వేదాలు ఎలా రూపాంతరం చెందాయి? ఎవరూ రాయకపోతే వీటికి అక్షరరూపు ఎలా సిద్ధించింది? అన్న ప్రశ్నలకు రిటైర్డ్ ప్రొఫెసర్ ఏవీ మొహరిర్ విపులమైన అభిప్రాయాన్నే వ్యక్తంచేశారు. కిందటేడాది (2018) అక్టోబర్ 1-7 మధ్య వెలువడిన యూనివర్సిటీ ఆయన పరిశోధనాత్మక వ్యాసం (సైన్స్, స్పిరిచువాలిటీ అండ్ గాడ్: యాన్ అటెంప్టెడ్ సింథసెస్) ఈ విషయాన్ని సమగ్రంగా చర్చించింది. న్యూఢిల్లీలోని ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చరల్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్)కు చెందిన డివిజన్ ఆఫ్ అగ్రికల్చరల్ ఫిజిక్స్‌కు అధిపతిగా, డీన్‌గా పనిచేసి ఆయన రిటైరయ్యారు. వేదాలు అనాదిగా ఉన్నవన్న సనాతన వాదుల అభిప్రాయాన్ని ఏకీభవించే రీతిలోనే ఆయన అభిప్రాయం ఉండడం గమనార్హం.



# రాశిఫలాలు



**మేషం**

సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారు. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కుటుంబ సౌఖ్యం లభిస్తుంది. రుణబాధలు తొలగిపోతాయి. ధైరసాహసాలతో ముందుకు వెళ్తారు. ప్రయత్నకార్యాలన్నీ వెంటనే ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభం ఏర్పడుతుంది. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. స్థానచలన సూచనలు ఉన్నాయి. సన్నిహితులతో విరోధం ఏర్పడకుండా మెలగడం మంచిది.

**వృషభం**

కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. వేళప్రకారం భుజించడానికి ప్రాధాన్యమిస్తారు. చంచలం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. అనారోగ్య బాధలు స్వల్పంగా ఉన్నాయి. సన్నిహితులతో విరోధం ఏర్పడకుండా మెలగడం మంచిది. స్వల్ప అనారోగ్యబాధలు ఉంటాయి. వృధాప్రయాణాలు చేస్తారు. ప్రతివిషయంలో వ్యయ, ప్రయాసలు తప్పవు.

**మిథునం**

పట్టుదలతో కొన్నికార్యాలు పూర్తిచేసుకోగలుగుతారు. వృత్తిరీత్యా గౌరవ, మర్యాదలు పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. మనోల్లాసాన్ని పొందుతారు. శుభవార్తలు వింటారు. శుభకార్యప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ఒక ముఖ్యమైన కార్యక్రమం పూర్తవుతుంది. స్వల్ప అనారోగ్య బాధలు ఉంటాయి.

**కర్కాటకం**

ప్రతి విషయంలో అభివృద్ధి ఉంటుంది. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. ఆకస్మిక ధనలాభం ఉంటుంది. కుటుంబంలో ఆనందోత్సాహాలు లభిస్తాయి. బంధు, మిత్రులతో కలుస్తారు. సమాజంలో గౌరవం లభిస్తుంది. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు.

**సింహం**

తలచిన కార్యాలకు ఆటంకాలు ఎదురవుతాయి. స్థిరాస్తులకు సంబంధించిన సమస్యల్లో జాగ్రత్తగా ఉండటం మంచిది. మోసపోయే అవకాశాలు ఉంటాయి. ఆర్థికపరిస్థితి ఆందోళనకరంగా మారుతుంది. నూతనకార్యాలు ప్రారంభించకూడదు. ప్రయాణాలు ఎక్కువగా చేస్తారు. కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవుతుంది. చంచలం వల్ల కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయి.

**కన్య**

తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అకాల భోజనం వల్ల ఆరోగ్యం చెడిపోతుంది. చిన్న విషయాల్లో మానసిక ఆందోళన చెందుతారు. వృత్తిరీత్యా జాగ్రత్తగా ఉండటం మంచిది. సహనం అన్నివిధాలా శ్రేయస్కరం. ఆవేశంవల్ల కొన్ని పనులు చెడిపోతాయి. ఊహించనికార్యాల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. ఆత్మీయులను కలవడంలో విఫలమవుతారు.

**తుల**

ప్రయత్నకార్యాలకు ఆటంకాలు ఎదురవుతాయి. బంధు మిత్రులతో విరోధం ఏర్పడే అవకాశాలుంటాయి. స్త్రీల మూలకంగా శతృబాధలను అనుభవిస్తారు. ఏదో ఒక విషయం మనస్తాపానికి గురిచేస్తుంది. పగ సాధించే ప్రయత్నాన్ని వదిలివేయడం మంచిది.

**వృశ్చికం**

గృహంలో జరిగే మార్పులవల్ల ఆందోళన చెందుతారు. బంధు, మిత్రులతో జాగ్రత్తగా ఉండటం మంచిది. చేసే పనులలో ఇబ్బందులు ఉంటాయి. కొత్త పనులను ప్రారంభించడం మంచిదికాదు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. ఆకస్మిక భయాందోళనలు దూరమవుతాయి. రుణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. కుటుంబంలో మనశ్శాంతి లోపిస్తుంది.

**ధనుస్సు**

ఇంతవరకు అనుభవించిన కష్టాలన్నీ క్రమేణ తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా ఉంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు. ఆకస్మిక ధనలాభం ఉంటుంది. గొప్ప వ్యక్తిని కలుస్తారు. వృత్తి, ఉద్యోగరంగాల్లో కోరుకున్న అభివృద్ధి ఉంటుంది. ముఖ్యమైన కార్యాలు పూర్తవుతాయి.

**మకరం**

కుటుంబంలో చిన్నచిన్న గొడవలు వచ్చే అవకాశం ఉంది. పరిస్థితిని మీ అదుపులో ఉంచుకోండి. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి రుణప్రయత్నాలు చేస్తారు. బంధు, మిత్రుల సహాయ సహకారాలు ఆలస్యంగా లభిస్తాయి. నూతనకార్యాలు ఆలస్యంగా ప్రారంభిస్తారు. అల్పభోజనం వల్ల అనారోగ్యాన్ని పొందుతారు.

**కుంభం**

బంధు, మిత్రులతో విరోధం ఏర్పడకుండా జాగ్రత్త పడటం మంచిది. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. వృత్తి, ఉద్యోగరంగంలో అభివృద్ధి ఉంటుంది. మానసిక ఆందోళనతో కాలం గడుస్తుంది. ప్రయత్నలోపం లేకున్నా పనులు పూర్తిచేసుకోలేకపోతారు. నూతన వ్యక్తుల జోలికి వెళ్లకూడదు. మనోల్లాసాన్ని పొందుతారు.

**మీనం**


అనవసరమైన భయాందోళనలు తొలగిపోతాయి. ప్రయాణాలు జాగ్రత్తగా చేయడం మంచిది. వృత్తి ఉద్యోగరంగాల్లో స్థానచలన సూచనలు ఉన్నాయి. ఆర్థిక పరిస్థితిలో మార్పులు ఉంటాయి. రుణప్రయత్నాలు చేస్తారు. ఆత్మీయుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. అంతటా అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఇతరులకు ఉపకారం చేయడానికి వెనుకాడరు.

## మనిషి తప్పిపోయాడు



మనిషి తప్పిపోయాడు
వర్షం వెతుకుతూ వుంది
చిరునామావుంది శరీరం లేదు!
వర్షం ఉడీసెత్తిందంటూ
వరుణుణ్ణి నిందిస్తూ
ప్రజాక్షేమం మరిచిన
మనిషి తప్పిపోయాడు!
ఇన్నాళ్ళూ కురిసిన
వర్షధారనుజి
అరచేతుల్కెనా
అడ్డేసి అడ్డుకోని మనిసి
సముద్రానికి దత్తం చేశాడు!
వానకురువబోతుంది
ఒడిసి పట్టుకోమంటూ
తప్పిపోయిన మనిషికై
వర్షం దేవులాడుతుంది!
మనిషి మాయమయ్యాడు
ఓటు వెతుకుతూ వుంది
మార్పు రావాలంటూ
పరవంజానెక్కి మేధావి విమర్శలు!
మార్పుకు మూలవిరాట్కెన
పోలింగు బూతుకు
అతడు ముఖంచాటు!
చేతికందే దూరంలో
పోలింగు కేంద్రం పిలుస్తుంది
బద్ధకం మేధావిని వదలదు
శీతలగది కదలనివ్వదు!
కోకిల కనపడటం లేదు
ఆరు ఋతువులు సమానమై
గున్నమామిడి గుబుర్లో వొదిగి
సంగీతం ఆలపిస్తూ
స్వర్గం సృష్టించిన కోకిల
హఠాత్తుగా అంతర్ధానమైంది
గాలింపుకు పోబిడీలేదు
మనసున పన్నీరద్దిన
సంగీత కచేరీలేదు!
మనిషి వేటగాడ్కె
ఎక్కుపెట్టిన బాణం
మట్టుపెట్టిందని ప్రచారం!
మనిషిజి
మనీషిగాజి
మారటానికిజి
మానవత్వమేజి
దీర్ఘతపస్సు!
అడిగోపుల వెంకటరత్నమ్,

## బతుకంటే



కళ్ళలో శిశిరాలు రాలుతున్నప్పుడు
ఒక జీవిత నిర్వేదం ఒక జీవిత క్రమం
పాఠాలు చెబుతుంటాయి.
కన్నీళ్ళను బిగపట్టి వసంతాల చిగుళ్ళ కోసం
మనసుతో మాటాడి
కాస్తంత ఊరట పొందటం ఒక అవసరం.
నిశ్శబ్ద ఏకాంతాన్ని నాలో నింపుకొని
కళ్ళ నిండా చెట్ల గాలులు పూసుకొని
ధ్యాన సాగరంలో మునిగిపోతాను.
చుట్టూ ప్రపంచం నుంచీ
వేడి గాలులూ తగులుతుంటాయి.
ఏదీ పూర్తిగా చొరబడనివ్వక
లోలోపల రక్షణ కవచాల్ని
నిర్మించుకుంటాను
బతుకంటే, బతకడమంటే
నిరంతర మూల్యాంకనం లోంచి సరిచూసుకొని
నిత్య నూతనంగా జీవించడమే.


# పాఠకుల ఆర్తిని తీర్చే 'రాతి గుండెలో నీళ్లు'

%కథ అంటే ఏమిటి అనేదానికి సార్వత్రిక నిర్వచనాలున్నా, అది ఎలా పుడుతుందనే దానికి స్పష్టమైన కారణాలు చెప్పలేం. రచయిత తను విన్నవి, కన్నవి, చదివినవి, తన అనుభవంలోకొచ్చిన అనేక సంఘటనల్లో మనసుకు నచ్చిన వాటిని ఎంచుకుని వాటికి సంభాషణలు పేర్చి సృజనాత్మకతతో రూపుకడతాడు. అతను ఎదుగుతున్న కొద్దీ అతని చూపు విశాలమవుతుంది. దృక్పథం మారుతుంది. శ్కెలి, శిల్పం కొత్త సొబగులు అద్దుకుంటాయి. రాయగా.. రాయగా.. ప్రతి రచయితకీ తన సొంత గొంతు ఏర్పడుతుంది.

30 ఏళ్లవయసు.. 50 కథల అనుభవం ఉన్న దొండపాటి కృష్ణ మూసలో కొట్టుకుపోకుండా తనద్కెన ప్రత్యేకత చూపటానికి గుంజాటన పడుతున్నారు. సమకాలీన పత్రికలన్నింటిలోనూ ఆయన కథలు వస్తూంటాయి. కొన్ని కథలకు దక్కిన బహుమతులు ఈ యువరచయిత ప్రతిభకు తార్కాణాలు. ఇటీవల ఆయన వెలువరించిన 'రాతి గుండెలో నీళ్లు' కథా సంకలనం గురించి ఇప్పుడు మనం మాట్లాడుకుందాం. ఇందులో 16 కథలున్నాయి. ఇతివృత్తం పరంగా వాటిల్లో వైవిధ్యం కనిపిస్తుంది. రచయిత 'చూపు' మనకు అర్థమవుతుంది.

'కారు ఆగింది. అది సూర్యం హోదాను మోసుకొచ్చింది' ఇదీ 'వెలుగు సూర్యుడు' కథకు ప్రారంభ వాక్యం. ఓ అధికారి కారులో దిగగానే అందరు విస్తుపోయి చూడటం సాధారణమే. కానీ ఈ అధికారి అందరిలాంటివాడు కాడు. ఒకప్పుడు చెత్తకుప్పలో విసిరివేయబడ్డ పసిబిడ్డ. అతన్ని యాదయ్య అనే బిచ్చగాడు చేరదీస్తాడు. కొన్నాళ్ల తర్వాత ఆ పిల్లాడు అడితీలో పనికి చేరతాడు. చదువుకోవాలన్న అతని ఆకాంక్షకు నీరుపోసి పెంచి పోషిస్తాడు ఆ అడితీ యజమాని. దాంతో అతను బాగా చదువుకుని సోషల్ వెల్ఫేర్ ఆఫీసరుగా ఎదుగుతాడు. అంతే కాదు, తనను ఇంత వాడిని చేసినందుకు అతను అదే ఊరిలో అనాధ వసతి గృహం నిర్మాణానికి సిద్ధమవుతూ కృతజ్ఞత చూపటానికి సిద్ధమవుతాడు. ఫ్లాష్‌బ్యాక్ పద్ధతిలో సాగిన ఈ కథలో మెరుపులాంటి వాక్యాలు కనిపిస్తాయి. "జ్ఞానానికి, దీపానికి ప్రత్యేక గుర్తింపు అవసరం లేదు. అవి పాతాళంలో ఉన్నా దశదిశలకూ తమ కాంతులను ప్రసరింపచేస్తూ ఉంటాయి. అందుకే 'విద్య' అనే దీపం వెలిగించుకోవాలి/గమ్యమెరుగని అతని నావకు దారి చూపిన దార్శనికుడు. గతి తప్పిన అతని జీవితాన్ని శృతి చేసిన మహానుభావుడు/గొంగళి పురుగులా అక్కడే పడి కొట్టుమిట్టాడుతున్న అతని జీవితం సీతాకోకచిలుకలా ఎలా రంగుల మయంగా మారిందో గుర్తుకొచ్చింది. ప్రధాన పాత్రకు 'సూర్యం' అన్న పేరు ఉంచటంలోనే రచయిత ఉద్దేశ్యం బోధపడుతుంది.

ఇటీవల మగపిల్లలు పెళ్లి చేసుకోవటానికి వెనకాముందు ఆడుతున్నారు. ఉన్న సంపాదనతో ఇల్లు నెట్టుకురావటం కష్టమనే భయం వారిని వెనక్కిలాగుతోంది. 'ఊహల రెక్కలతో ఎగరనీయ్' కథలో ఇదే అంశంపై చర్చకు పెట్టారు. జీవితంలో సర్దుబాటు ఎంత అవసరమో చెప్పారు. నిరంతరం సోషల్ మీడియాలో మునిగిపోతున్న ఇల్లాళ్లకు భిన్నంగా, ఇంట్లో ఉన్నంతసేపు



కుటుంబసభ్యులకు మాత్రమే వెచ్చించే 'ఇందిర' అన్న పాత్ర సృష్టించారు. "ఆఫీసు నుంచి ఇంటికొచ్చాక బంధువులతో కూడా ఫోన్ మాట్లాడదు. ఎంజాయ్ చేయటం అంటే మనుషులతో ప్రేమతో మెలగాలి. వస్తువులతో కాదు. వీలునుబట్టి వాళ్లను కలవచ్చు. మీరు, పాప నాకున్నారు. మీ సమయాల్ని నాకు కేటాయిస్తే చాలు' అంటుంది. ఈ కథలో పెళ్లి విశిష్టత గురించి రచయిత చర్చించారు. "మనుషులకు స్థూల, సూక్ష్మ, కారణ అనే మూడు శరీరాలుంటాయి. పెళ్లి సమయంలో వేసే ఒక్కో ముడి ఒక్కో శరీరానికి వేసేది. ఒక్క బాహ్యశరీరంతోనే కాదు. మొత్తం మూడు శరీరాలతో మమేకం కావటం అనే అర్థంలో మూడుముళ్లు వేస్తారు. ఈ మూడుముళ్లకు 'అనురాగపు ముడి'ని జత చేసి ల్కెఫ్ జర్నీ చేయాలి. అది మనం చూపించే ప్రేమను బట్టి ఉంటుంది. క్వాలిఫికేషన్ బట్టి కాకుండా క్యారక్టర్ ను బట్టి వివాహాలు విజయవంతమవుతాయి"అని చెప్పుకొచ్చారు.

మరో కథ 'ఇది కదా సంతోషం' లోనూ వివాహ ఔన్నత్యం గురించి చర్చ కనిపిస్తుంది. మనవడి వివాహవేడుకలను కళ్లారా చూసుకుని సంతసించిన తాతయ్య ఇందులో కనిపిస్తాడు. అణకువతో, నేర్పుతో సంసారాన్ని తీర్చిదిద్దిన తన భార్యను అలక్ష్యం చేశానన్న చింత ఆయనను వెంటాడుతూంటుంది. "నీరు ఎంత అమూల్యమైనదో, బావి ఎండిపోయే వరకూ మనకు తెలియదు. భార్య తోడుగా ఉన్నంతకాలం ఆమెను గ్రహించలేకపోయాను" అన్న ఆవేదనకు లోనవుతాడు. "భార్యలేని మగవాడి జీవితం అసంపూర్ణం. ఆమెతో గడిపిన క్షణాలే నీ జీవితం లో అమూల్యం" అని మనవడికి భార్య గొప్పతనాన్ని వివరించటంతో కథ ముగుస్తుంది.'యాచకురాలు' కథలో బిచ్చగాళ్ల పట్ల సహానుభూతి కనిపిస్తుంది. "నీకు సాధ్యమైతే బిచ్చమెయ్యి. అంతే కానీ నోటికొచ్చినట్టు మాట్లాడి వాళ్లను చులకన చేయొద్దు" అన్న హితవు, "ఎదుటివారిని ఆదుకున్నప్పుడు, క్షమించినప్పుడు మన మోహంలో ద్కెవత్వం కనిపిస్తుంది" అనే సందేశం ఇందులో మనం చూడొచ్చు.సమాజం చిన్న చూపు చూసే యాచకులను ప్రయోజకులుగా, బాధ్యతగల కాంట్రాక్టు ఉద్యోగులుగా మలచిన మున్సిపల్ ఉద్యోగి ఉదంతం "మళ్లీ చిగురించారు" కథలో కనిపిస్తుంది.మనిషికి పరిసరాలతోనూ, ప్రకృతితోనూ ఉండే అనుబంధం గాఢమైనది, బలీయమైనది. "స్వర్గసీమ", " రాముడు -భీముడు" కథలు ఈ విషయాన్ని బలంగా చాటుతాయి. తన ఇల్లు, పెరడులో పెంచుకున్న మొక్కలతో అవ్యక్తమైన అనుబంధాన్ని పెంచుకున్న అర్చన భర్త ఇల్లు అమ్మి సొంత ఊరికి వెళ్లిపోదామని చెప్పినప్పుడు తల్లడిల్లుతుంది. "స్వర్గమంటే అదెక్కడో ఉండదు. నిర్మలమైన మనస్సుతో, మనకున్న సౌకర్యాలతో సంతృప్తిగా బతికే జీవితమే స్వర్గం. ఇల్లే స్వర్గసీమ" అన్న స్పృహతో చివరికి భర్త తన నిర్ణయాన్ని మార్చుకుంటాడు. ఇక 'రాముడు-భీముడు కథలో, పదిమంది పిల్లలున్నా నిరాదరణకు గురైన రాముడు, భీముడు (వేపచెట్టు)నీడలో సేదతీరుతూంటాడు. అతను కన్నుమూసినప్పుడు ఆ కట్టలే అతనికి ఆధారమవుతాయి.

ఒక సామాజిక సమస్యపైన సామాజిక మాధ్యమాల్లో మద్దతు కూడగట్టటానికి సిద్ధమైన యువకుని ఉదంతం 'మైత్రీవనం'లోనూ, ప్రేమ ఉచ్చులో పడిపోకుండా, బాగా చదువుకుని బాధ్యతగా మెలగాలన్న సూచన 'చ్కెతన్యకిరణం'లోనూ కనిపిస్తుంది. ఆగంతకుల దాడి నుంచి నేర్పుగా బయటపడిన యువతి కథ 'గుంట నక్కలు".


ఈ సంకలనంలో రెండు కథలను ప్రస్తావించకపోతే, ఈ సమీక్ష అసంపూర్ణమవుతుంది. 'రాతిగుండెలో నీళ్లు, 'ఉరేసుకున్న మౌనం' అన్న ఈ రెండు కథలు రచయితకు బహుమతులు తెచ్చిపెట్టాయి. డ్వాక్రా సభ్యులు అకస్మాత్తుగా చనిపోతే, వారికి ఆర్థిక సాయం అందించే బాధ్యతలో ఉన్న రంజని అనే ఉద్యోగినికి చిత్రమైన అనుభవం. అది ఆమెలో మార్పుకు ఎలా కారణమయ్యిందో తెలియచెప్పే కథ "రాతి గుండెలో నీళ్లు". ఇందులో హిజ్రాల జీవితంలో సాధకబాధకాలను, కుటుంబ సభ్యుల నిరాదరణను హృదయవిదారకంగా చెప్పుకొచ్చారు రచయిత.

ఇక ఉరేసుకున్న మౌనం కథలో భర్త చేసే అవమానాలను భరించలేక జ్యోతి ఆత్మహత్యకు సిద్ధపడుతుంది. ఆఖరునిముషంలో అంతరాత్మ ప్రబోధంతో వెనక్కి మళ్లుతుంది. భర్త పశ్చాత్తాపానికి లోనవుతాడు. ఇలా ప్రతి కథలోనూ దొండపాటి తనద్కెన విశిష్టతను చూపారు. కథల పట్ల ఆసక్తిగల వారు తప్పనిసరిగా చదవవలసిన సంకలనమిది.

# కమ్మనైన అమ్మభాష

తెలుగు భాష వ్యాప్తికి, మనుగడకు సంబంధించి ఏళ్ల తరబడి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. దీనిపై ఇప్పటివరకూ ఐదు ప్రపంచ తెలుగు మహాసభలు కూడా జరిగాయి. ప్రాంతాలను బట్టి యాస, మాండలిక సొగసూ ఎలా ఉన్నా రెండు రాష్ట్రాల్లోనూ ప్రజల భాష తెలుగే. ఇదే, ఇలాగే వర్ధిల్లాలన్న ఆకాంక్ష అందరిలో అభివ్యక్తం కావటంతో మాత్రమే తెలుగు వర్ధిల్లదు. అది వెలుగులీనే వ్యవస్థకు అంకురార్పణ చేయాల్సిందీ, అమలు చేయాల్సిందీ కచ్చితంగా పాలకులే! ఈ నెల 21న 'ప్రపంచ మాతృభాషా దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం..

మన అమ్మభాష తెలుగు. మన భాషకు వెయ్యేళ్లకు పైబడిన చరిత్ర ఉంది. విస్తారమైన సాహిత్యం ఉంది. అనేక సాహిత్య ప్రక్రియలు శాఖోపశాఖలై వర్ధిల్లాయి. జనజీవన స్రవంతిలోకి సజీవ పాయలుగా ప్రవహించాయి. పద్యాలూ పాటలూ, కథలూ కావ్యాలూ, నాటకాలూ నాటికలూ, ప్రబంధాలూ మహా గ్రంథాలూ.. ఆయా కాలాలను, జనజీవనాన్ని చిత్రించాయి. అన్నిటా తీయతీయని తెలుగు పలుకు వేకువల వెల్లువలా ప్రవహించింది. ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాషల్లో తెలుగూ ఒకటి. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూబీ దేశంలోనూ, దేశం బయటా దాదాపు 16 కోట్ల మంది తెలుగు మాట్లాడతారని ఒక అంచనా. దేశంలో హిందీ తరువాత అత్యధికులు మాట్లాడే భాష తెలుగే అంటారు. తెలుగుకు ప్రాచీన భాష హోదా కూడా ఉంది. ఇవన్నీ మనం ఘనంగా చెప్పుకోవటానికి దోహదపడే సంగతులు. కానీ, తెలుగు వాడుక, వేడుక రోజురోజుకూ తరిగిపోతుందన్నది ఒక వాస్తవం. వెంటనే పెను ప్రమాదం లేకపోయినా- కొన్నేళ్లకు ప్రాభవం కోల్పోయే భాషల్లో తెలుగు కూడా ఉందనేది యునిసెఫ్ హెచ్చరిక. ఎందుకంటే- ఇప్పుడు చాలామంది అక్షరాస్యులకు తెలుగు మాట్లాడ్డం వచ్చుగానీ, చదవడం, రాయడం రాదు. తెలుగును తెలుగులో కాక ఇంగ్లీషు లిపిలో రాస్తున్న తరం రోజురోజుకూ పెరుగుతోంది. మాట్లాడ్డానికే పరిమితమయ్యే భాష.. క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని భాషా అధ్యయనకర్తల ఆందోళన.



ఏ భాష అయినా ఎందుకు అవసరమవుతుంది? అంటే- 'మన అవసరాలు తీర్చుకోవటానికి..' అనేది జవాబు. ఒక సమూహపు ప్రజల అవసరాలు, జీవనం ఆ సమూహానికే పరిమితం అయినప్పుడు- ఆ సమూహపు అమ్మభాషకు ఢోకా ఉండదు. ఇతర సమూహాలతో, ప్రాంతాలతో కలిసినప్పుడూ భాషకు ప్రమాదం వాటిల్లదు. మాటలను ఇచ్చిపుచ్చుకోవటం ద్వారా రెండు భాషలూ పరిపుష్టమవుతాయి. ఇది భాష పుట్టినప్పటి నుంచీ అనుభవంలో ఉన్నదే! కానీ, మన భాషకు మించి మరొక భాషకు ఆధిపత్య స్థానం ఇవ్వటం ప్రమాదకరం. అది క్రమేణా అమ్మభాష చెల్లుబాటును హరించేస్తుంది. ఇప్పుడు జరుగుతున్నది ఇదే!

### ఆకాంక్షలు వేరు.. ఆచరణ వేరు..

తెలుగును వెలుగులీనే విధంగా చేయాలని చాలామంది ఆకాంక్షిస్తారు. తెలుగు భాష గత వైభవాన్ని గానం చేస్తారు. ఏఏ అంశాల్లో తెలుగు గొప్పో చరిత్రనీ, సాహిత్యాన్నీ ఉటంకిస్తారు. కానీ, ఆచరణ కూడా అదే స్థాయిలో ఉందా? అంటే - లేదు. ఈ శతాబ్దిలో 2012, 2017ల్లో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. తెలుగు ప్రాభవం పెంచటానికి పలు తీర్మానాలూ జరిగాయి. కానీ, అమల్లోకి వచ్చింది ఒక్కటీ లేదు. ఆ సందర్భంలో తెలుగుకు ప్రాచీనహోదా గురించిన చర్చలు, ఆ హోదా రావటం వల్ల తెలుగు ఎంతగా వికసిస్తుందో, ఎన్నెన్ని విస్తృత కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతుందో భాషావేత్తలు, సాహిత్య అభిమానులూ ఆశావహంగా చర్చించారు. కానీ, ఇన్నేళ్లలో ఏం ఒరిగిందీ అంటే- జరిగింది లేశ మాత్రమే! పైగా మాతృభాష వికసించి, పరిమళించాల్సిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో సైతం ఆంగ్లమాధ్యమం ప్రవేశించింది. తెలుగులో కోర్టు తీర్పులు, పాలనలో తెలుగు వాడుక వంటివి అక్కడక్కడ అప్పుడప్పుడు తప్ప, సమూలమైన మార్పు సాధ్యం కాలేదు. తెలుగు కేవలం సాహిత్య భాషగా ఉంటే- అది పుస్తకాలకే పరిమితం అవుతుంది. పాఠశాల మాధ్యమంలో, పాలనా వ్యవహారాల్లో నిండుగా మాతృభాషకు స్థానం ఇస్తేనే అది ఒక అవసరంగా, ఒక వ్యవహార సాధనంగా మారుతుంది. మాటల్లో ఉన్న తెలుగు ఘనత పనులకు ఉపయోగపడనప్పుడు పెద్దగా ఫలితం ఉండదు. అవసరానికి అక్కర రానిది క్రమంగా పక్కకు వెళ్లిపోవడం ప్రకృతి సహజం.

### బోధన ఏ భాషలో?

'ప్రజల భాషలో రాష్ట్ర పరిపాలన జరగటం ప్రజాస్వామ్యానికి అవసరం' అనే ఆదర్శంతో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. అలా ఏర్పడ్డ మొదటి రాష్ట్రం తెలుగువారిదే! అంటే- మాతృభాష, సంస్కృతుల ఆవశ్యకత, ఆకాంక్షలను చాటిన తొలి గొంతు మనదే! భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాక దేశభాషలకు సముచిత స్థానం ఇవ్వటానికి ప్రయత్నాలు జరిగాయి. ప్రధాన భాషలను అధికార భాషలుగా గుర్తించటం, విద్యా విధానంలో పట్టభద్ర స్థాయి దాకా రాష్ట్ర భాషా మాధ్యమం ప్రవేశపెట్టటం జరిగింది. తెలుగులో 1957లో సాహిత్య అకాడమీ, 1968లో తెలుగు అకాడమీ వచ్చాయి. 1969-1974కి తెలుగు మాధ్యమం పియుసి నుంచి బిఏ, బికాం, బిఎస్సీ స్థాయిదాకా వ్యాపించింది. కానీ, ఆ తరువాత తెలుగుకు క్రమంగా ప్రాధాన్యం తగ్గిపోయింది. ప్రభుత్వ విద్యాసంస్థల ప్రాధాన్యం తగ్గి, ప్రయివేటు ప్రాబల్యం పెరగటంతో ఈ జాడ్యం మొదలైంది. ఇంగ్లీషు మీడియంలో చదువుకున్నవాళ్ళకు ఉద్యోగావకాశాలు పెరగటం, తెలుగు మాధ్యమం నిరుపయోగం అనే భావన విద్యార్థుల్లో, తల్లిదండ్రుల్లో గట్టిగా స్థిరపడడం దీనికి ప్రధానకారణం. అది ఇప్పటికీ తారాస్థాయికి చేరుకుంది. ప్రాథమిక విద్య నుంచే ఇంగ్లీషులో చదువు నేర్పటం అవసరమనే భావన బలంగా పెరిగింది.

### భాష వేరు.. మాధ్యమం వేరు!

మనం చిన్నప్పటి నుంచీ ఏ భాషా వాతావరణంలో పెరిగామో, ఏ భాష ఇంటి భాషగా ఉందో అదే మాధ్యమభాష అవుతుంది. మన ఆలోచనలన్నీ ఆ భాషలోనే స్ఫురిస్తాయి. ప్రాథమిక దశలో పిల్లలు ఏ నేర్చుకున్నా ఆ భాషలోనే నేర్చుకుంటారు. కాబట్టి- అమ్మభాషను మాధ్యమంగా ఉంచాలనేది ఒక శాస్త్రీయ అవగాహన. ఈ అంశంలో ఏ దేశంలోనూ వేరే చర్చ లేదు. మన దేశంలో, ప్రత్యేకించి మన రాష్ట్రంలో ఆంగ్లభాషా మాధ్యమం ప్రాథమిక విద్యలోనూ విస్తారంగా ప్రవేశించింది. నేర్పడం, నేర్చుకోవడంలో ఇది ఎలాంటి ఫలితాలను ఇస్తుందో ఇటీవల ప్రథమ్ సంస్థ నిర్వహించిన సర్వే తేటతెల్లం చేసింది. ప్రాథమిక విద్య స్థాయిని దాటాక - అవసరాలరీత్యా ఒక విద్యార్థి ఎన్ని భాషలైనా నేర్చుకోవొచ్చు. వారు ఎన్నుకునే వృత్తిని బట్టి, నివసించే ప్రాంతాన్ని బట్టి భాషలను అనుసరించొచ్చు. కానీ, భాష కోసం ప్రాథమిక బోధనా మాధ్యమాన్ని మార్చాల్సిన అవసరం లేదు. ఆంగ్ల భాషా ప్రావీణ్యం కొన్ని వృత్తుల్లో, దేశాల్లో రాణించటానికి ఉపయోగపడొచ్చు. కానీ, అది ఉద్యోగాలను సృష్టించదు. ఆంగ్లం ఒక భాషే తప్ప- ప్రత్యేక వృత్తి నైపుణ్యం కాదు. కొద్దికాలంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రఖ్యాత కార్పొరేట్ సంస్థలు వేలాది ఉద్యోగాలను తొలగిస్తున్నాయి. దానికి కారణం ఆర్థిక రంగంలో ఏర్పడ్డ సంక్షోభం తప్ప, భాష కాదు. ఇంగ్లీషు నేర్చుకుంటేనే ఉపాధి అవకాశాలు, లేకుంటే లేదన్నది పూర్తి వాస్తవం కాదు. శాస్త్ర సాంకేతిక విద్య, ఉన్నతవిద్యల బోధన ఎలాగూ ఆంగ్ల మాధ్యమంలోనే నడుస్తోంది. హైస్కూలు దశలోనూ ఆంగ్లం, హిందీ సబ్జెక్టులుగా ఉన్నాయి. సైన్సు, గణితం, సోషలు వంటి సబ్జెక్టులనూ ఇంగ్లీషులో నేర్పడం విద్యార్థుల అవగాహనకు గండి కొడుతుందని భాషా పరిశీలకులు అంటున్నారు.

### చెల్లుబాటు ఉంటే - తెలుగు వెలుగు

ఇంగ్లీషులో మాట్లాడితేనే, ఇంగ్లీషు తెలిస్తేనే పనులు జరుగుతాయి అన్న భావన బలంగా స్థిరపడేలా మన పాలనా యంత్రాంగం ఉంది. ఇది బ్రిటీషు పాలన మిగిల్చిన అవశేషం. ఏ భాష మనుగడ సాగించాలన్నా అది పరిపాలనా భాషగా ఉండాలి. మాతృభాష ప్రజల అన్ని అవసరాలనూ తీర్చగలగాలి. అప్పుడే దానికి మనుగడ. అన్ని కార్యాలయాల్లో ప్రజలు సమాచారం ఇచ్చిపుచ్చుకోవడం, సంభాషణలు తెలుగులోనే జరపడం వల్ల భాష పట్ల గౌరవం పెరుగుతుంది. తెలుగు మొత్తం సమాజపు భాషగా వికసిస్తుంది. తెలుగు కలకాలం వినపడాలన్నా, కనపడాలన్నా- అది అధికారిక హోదా పొందాలి. అన్నింటా చెల్లుబాటు కావాలి. చెల్లుబాటు జరిగినప్పుడు, జరుగుబాటు కుదిరినప్పుడు- భాషే కాదుబీ ఏదన్నా వర్ధిల్లుతుంది. వెయ్యేళ్లు బతుకుతుంది.

### తెలుగు భాషా చరిత్ర

భాష ఒక నిత్య ప్రవాహిని. పాయలు పాయలుగా మారి, అనేక క్షేత్రాల్లోకి చేరి, అక్కడి స్థానిక భాషాప్రవాహాల్లో సంగమించి, కొంత ఇచ్చి, కొంత తీసుకొని, కొంగొత్తగా అవతరించి.. ఆ క్రమంలో కొంత అంతరించి, కొంత కొత్తగా ఆవిర్భవించి.. నిర్విరామంగా సాగుతూ ఉంటుంది. ఇలా వందల ఏళ్ల నుంచి పరిణామం చెందుతూ ప్రవహిస్తున్న భాష జన్మస్థానం ఎక్కడీ అంటే ఆనవాళ్లను కచ్చితంగా కనుక్కోవడం కష్టమే! ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రెండింటా తెలుగు మాతృభాషగా ఉన్న వారి సంఖ్య దాదాపు తొమ్మిది కోట్లు. ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో తెలుగు మాట్లాడేవారు మరో ఏడు కోట్ల మంది ఉంటారని ఒక అంచనా. ఈ విధంగా ప్రపంచంలోని ప్రజలు అత్యధికంగా మాట్లాడే భాషల్లో తెలుగుది 13వ స్థానం. రెండున్నర వేల సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు ప్రపంచ ప్రాచీన భాషల్లో ఒకటి. వెనీసుకు చెందిన వర్తకుడు నికొలో డా కాంటి మనదేశంలో పర్యటిస్తూ- తెలుగును చూసి, విని తెలుగును 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్'గా అభివర్ణించాడు. ఎందుకంటే ఇటాలియన్ కూడా మన తెలుగు వలే అజంతా భాష.

### తెలుగు ఎక్కడ పుట్టింది?

తెలుగును ద్రావిడ భాషా వర్గానికి చెందినదిగా భాషా శాస్త్రకారులు వర్గీకరించారు. తమిళం, కన్నడం, మలయాళం, తోడ, తుళ, బ్రహ్మి తదితర భాషలు ద్రావిడం. ఇవి హిందీ, ఇతర దేశీయ భాషల వలె ఇండో ఆర్యన్ భాషలు కావు. ఈ భాషలు వర్ధిల్లే సమాజాల సంస్కృతి కూడా భిన్నమైనది. తెలుగు వారి భాషా సంస్కృతులు చాలా లోతైన పునాదుల మీద నిర్మితమై ఉన్నాయి. కావ్యాలు, గేయాలు, పద్యాలు, పాటలు, జానపదాలు, నృత్యాలు, వినోదాలు, విహారాలు, ఆచార వ్యవహారాలు అన్నిటా ప్రత్యేకత, వైవిధ్యమూ గల చరిత్ర తెలుగు వారిది. ఆర్యభాషలు ప్రవేశించకముందు ద్రావిడ భాషలు మనదేశమంతా విస్తరించి ఉండేవని.. కొంతమంది భాషా చరిత్రకారుల అభిప్రాయం. తెలుగు మూల మధ్య ద్రావిడ భాష నుంచి పుట్టింది. ఈ కుటుంబంలో తెలుగుతో పాటు కుయి, కోయ, కొలామి కూడా ఉన్నాయి.

క్రీ.శ మొదటి శతాబ్దంలో శాతవాహనులు సృష్టించిన 'గాథాసప్తశతి' ప్రాకృత పద్య సంకలనంలో తెలుగు పదాలు కనిపించాయి. తెలుగుభాష మాట్లాడేవారు శాతవాహన కాలానికి ముందే కృష్ణా, గోదావరి నదుల మధ్య భూభాగంలో నివసించేవారని ఒక అంచనా. తెలుగులోని స్పష్టమైన మొట్టమొదటి ప్రాచీన శిలాశాసనం 7వ శతాబ్దికి చెందినది. శాసనాల్లో మనకు లభించిన తొలి తెలుగు పదం 'నాగబు'. క్రీ.పూ.700 ప్రాంతంలో వచ్చిన ఐతరేయ బ్రాహ్మణం (రుగ్వేదంలో భాగం)లో మొదటిసారిగా 'ఆంధ్ర' అనే పదం జాతిపరంగా వాడారని భాషావేత్తలు చెబుతారు. మనకు తెలిసినంతలో ఇదే ప్రాచీన ప్రస్తావన. ఆ తరువాత బౌద్ధ శాసనాల్లోనూ, అశోకుని శాసనాల్లోనూ ఆంధ్రుల ప్రస్తావన ఉంది. క్రీ.శ.1000కి ముందు శాసనాల్లోగాని, వ్మాయంలో గాని తెలుగు అనే శబ్దం మనకు కానరాదు. 11వ శతాబ్దం ఆరంభం నుంచి 'తెలుంగు భూపాలురు', 'తెల్గరమారి', 'తెలింగకులకాల', 'తెలుంగ నాడొళగణ మాధవికెయ' వంటి పదాలు శాసనాల్లో వాడారు. 11వ శతాబ్దంలో నన్నయ్య కాలంనాటికి తెలుగు రూపాంతరంగా 'తెనుగు' అనే పదం వచ్చింది. 13వ శతాబ్దంలో మహమ్మదీయ చరిత్రకారులు ఈ ప్రాంతాన్ని 'త్రిలింగ' అని వ్యవహరించారు. 15వ శతాబ్దం పూర్వభాగంలో విన్నకోట పెద్దన్న తన కావ్యాలంకార చూడామణిలోనూ ఈ ప్రస్తావన చేశాడు. శ్రీశైలం, కాళేశ్వరం, ద్రాక్షారామం - అనే మూడు శివలింగక్షేత్రాల మధ్యభాగం త్రిలింగదేశమని, 'త్రిలింగ' పదం 'తెలుగు'గా పరిణామం పొందిందని ఒక సమర్థన. ఇది సంస్కృతీకరింపబడిన పదమే తప్ప మరోటి కాదనిబీ వాస్తవానికి తెలుగు అనేదే ప్రాచీన రూపమని చరిత్రకారుల అభిప్రాయం. 12వ శతాబ్దిలో పాల్కురికి సోమనాథుడు 'నవలక్ష తెలుంగు' అని వాడాడు. తొమ్మిది లక్షల గ్రామ విస్తీర్ణం గలిగిన దేశమని వర్ణించాడు.

నన్నయ్యకు పూర్వం నుంచి గ్రాంథిక భాష, వ్యావహారిక భాష స్వతంత్రంగా పరిణామం చెందుతూ వచ్చాయి. 20వ శతాబ్దం తొలినాళ్లలో వీటి మధ్య ఉన్న వ్యత్యాసాలు తీవ్ర వాదోపవాదాలకు దారితీసాయి. గ్రాంథికం ప్రమాణ భాష అని, స్థిరమైన భాష అని, దాన్ని మార్చకూడదని గ్రాంథిక భాషావాదులు భీష్మించారు. ప్రజల భాషనే గ్రంథ రచనలో ఉపయోగించాలని వ్యావహారిక భాషావాదులు వాదించారు. ఆఖరికి ప్రజల భాషే పైచేయి సాధించింది. గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు, కందుకూరి వీరేశలింగం వంటివారు ఆ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. దీనికన్నా ముందే పోతన, సోమన, వేమన వంటివారు సరళమైన తెలుగులో సారస్వతం సృష్టించారు.

# బ్రెస్ట్ క్యాన్సరా భయం వద్దు

**ఈరోజుల్లో బ్రెస్ట్ క్యాన్సర్? అనే మాట బాగా వినిపిస్తోంది. దాదాపు ప్రతి యాభై మందిలో ఒకరికి బ్రెస్ట్ క్యాన్సర్? ఉంటోందని సర్వేలు చెప్తున్నాయి. అది ఒక్కసారి వచ్చిందంటే.. శారీరకంగానే కాదు, మానసికంగానూ దెబ్బతీస్తుంది. వెంటనే కనుక్కుని ట్రీట్?మెంట్ చేయించుకోవాలి అంటున్నారు డాక్టర్లు. కానీ, దాని లక్షణాలు కనిపెట్టడంలోనే పెద్ద చిక్కుంది. కొంతమందిలో అసలు లక్షణాలే కనిపించవు అంటున్నారు. మరి దీనికి సొల్యూషన్ ఏంటి? దీని లక్షణాలను ఎలా గుర్తించాలి?ఏమేం ట్రీట్?మెంట్?లు ఉంటాయి? వంటి ప్రశ్నలకు డాక్టర్. పాలంకి సత్య దత్తాత్రేయ ఈ విధంగా జవాబిచ్చారు. అవేంటో ఆయన మాటల్లోనే... బ్రెస్ట్ క్యాన్సర్ అనేది క్యాన్సర్లలో ఒక రకం. రొమ్ములో ఉండే కణాలు కంట్రోల్ లేకుండా విపరీతంగా పెరిగిపోయే స్థితిని బ్రెస్ట్ క్యాన్సర్**



ఈ క్యాన్సర్? కణాలు పెరగడం అనేది ఒకవైపు రొమ్ములో లేదా రెండింటిలో మొదలుకావచ్చు. ఇది ఎక్కువగా ఆడవాళ్లలో వస్తుంది. కొన్నిసార్లు మగవాళ్లకు కూడా రావొచ్చు.

**నాలుగు స్టేజ్‌లు..**

క్యాన్సర్ ఏ స్టేజీలో ఉందో తెలిస్తే ఏ ట్రీట్?మెంట్? ఇవ్వాలనేది క్లారిటీ వస్తుంది. కాబట్టి ఎవరికైనా బ్రెస్ట్? క్యాన్సర్? ఉందని తెలిస్తే, అది శరీరంలో ఏ స్టేజీలో ఉందో టెస్ట్ చేస్తారు. మామూలుగా ఇందులో నాలుగు స్టేజ్?లు ఉంటాయి. రూల్ ప్రకారం, క్యాన్సర్ కణాల సంఖ్య తగ్గించడం, వ్యాప్తిని అడ్డుకోవడం చేస్తారు. మరీ ఎక్కువగా ఉంటే నాలుగో స్టేజ్? అని అర్థం. అప్పుడు అది మిగతా అవయవాలకు కూడా వ్యాపిస్తుంది.

**వయసు పెరిగేకొద్దీ..**

బ్రెస్ట్ క్యాన్సర్? అనేది ఒకసారి వచ్చిందంటే, వయసుతోపాటు సమస్య కూడా పెరుగుతుంది. అయితే, 45 లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్న ఆడవాళ్లలోనే 80 శాతం ఈ సమస్య కనిపిస్తుంది. వాళ్లలో 69? శాతం రిస్క్? కూడా ఎక్కువే. అలాగే, 65 లేదా ఆపైబడిన వారిలో 40 శాతం ఎఫెక్ట్ అయ్యే ఛాన్స్ ఉంది. వీళ్లలో అయితే, 43 మందిలో ఒకరికి ఈ సమస్య ఉంటోంది. 60-70 వయసున్న వాళ్లలో 29 మందిలో ఒకరికి, 70 పైబడిన వాళ్లలో అయితే 26 మందిలో ఒకరికి బ్రెస్ట్? క్యాన్సర్ రిస్క్? ఉంటుంది.

**ఈ లక్షణాలు ఉంటే..**

బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చినవాళ్లలో లక్షణాలు అందరికీ ఒకేలా ఉండవు. అలాగే కొంతమందికి అసలు లక్షణాలే కనిపించవు. లక్షణాలు ఉన్నవాళ్లలో ముఖ్యంగా కనిపించేవి ఏంటంటే.. రొమ్ములో లేదా చంక కింద (లంప్) గడ్డ ఏర్పడుతుంది.

రొమ్ము గట్టిగా ఉండడం, రొమ్ము భాగంలో ఎక్కడైనా వాపు కనిపిస్తే అది బ్రెస్ట్ క్యాన్సర్? లక్షణం. ఇరిటేషన్, రొమ్ము భాగంలో సొట్ట పడడం, రొమ్ము లేదా చనుమొన దగ్గర ఎర్రగా మారడం, లేదా పొరలాగా కనిపించడం వంటివి.

చనుమొన (నిపుల్) భాగంలో నొప్పి, పాలు కాకుండా ఏదైనా ద్రవం లేదా రక్తం కారడం. బ్రెస్ట్ సైజ్, ఆకారంలో తేడాలు కనిపిస్తే అనుమానించాల్సిందే.బ్రెస్ట్? భాగంలో ఎక్కడైనా నొప్పిగా అనిపిస్తే క్యాన్సర్? లక్షణం అని గుర్తించాలి. కొన్ని పరిస్థితులను బట్టి ఈ లక్షణాలు క్యాన్సర్? లేని వాళ్లలోనూ కనిపించే అవకాశం ఉంది. అయితే, ఈ లక్షణాలు కనిపించినంత మాత్రానబ్రెస్ట్ క్యాన్సర్ ఉండాలని లేదు. కాబట్టి డాక్టర్? దగ్గరకి వెళ్లి సమస్య ఏంటో తెలుసుకుంటే బెటర్.

**టెస్ట్‌లు – ట్రీట్‌మెంట్‌లు**

బ్రెస్ట్ క్యాన్సర్ కొన్నిసార్లు మాత్రమే లక్షణాలు చూపించాక క్యాన్సర్ వస్తుంది. ఎక్కువశాతం లక్షణాలు ఉండవు. అందువల్ల రెగ్యులర్ బ్రెస్ట్‌క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకోవడం ముఖ్యం. అయితే టెస్టుల్లో కొన్ని రకాలున్నాయి. వాటిలో మమ్మోగ్రామ్, బ్రెస్ట్ అల్ట్రాసౌండ్, బ్రెస్ట్ ఎం.ఆర్?.ఐ చేస్తారు. వాటితోపాటు క్యాన్సర్ కణాల మీద ఉన్న వేర్వేరు రిసెప్టార్లను కనిపెట్టేందుకు బయాప్సి టెస్ట్ కూడా చేస్తారు. ట్రీట్?మెంట్ల విషయానికొస్తే.. సర్జరీ, రేడియేషన్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ ట్రీట్‌మెంట్‌లు చేస్తారు. వీటిని రేడియాలజిస్ట్, పాతాలజిస్ట్‌లు కలిసి పని చేస్తారు. ఇందులో కూడా రకరకాల ట్రీట్‌మెంట్‌లు ఉన్నాయి. దీన్ని మల్టీ డిసిప్లినరీ టీమ్ అంటారు. క్యాన్సర్ గడ్డలు చిన్నగా ఉన్నప్పటికీ త్వరగా పెరుగుతాయి. కొన్ని పెద్దగా ఉన్నా, నిదానంగా పెరుగుతాయి. వీటికి ట్రీట్‌మె ంట్ చేయాలంటే కొన్ని అంశాలు పరిశీలించాలి. అవేంటం టే...ట్యూమర్ (క్యాన్సర్‌గడ్డ) సబ్ టైప్‌లో ఉండడం, దానిపై హార్మోన్ రిసెప్టార్ల స్థితి, హెఇఆర్2, నోడల్ స్టేటస్‌లను బట్టి ఉంటుంది. తర్వాత ట్యూమర్ స్టేజ్?ని బట్టి ట్రీట్‌మెంట్ ఇస్తారు. అవసరమైతే ఆంకోటైప్ డిఎక్స్ లేదా మామ్మా ప్రింట్ అనే స్పెషల్ టెస్ట్ చేస్తారు. పేషెంట్ వయసు, హెల్త్, మెనోపాజల్ స్థితి వంటివి చూసి ట్రీట్‌మెంట్ ఇస్తారు. జన్యుపరంగా వచ్చినవైతే వాటి పరిస్థితి చూసి ట్రీట్?మెంట్? చేస్తారు.

**సర్జరీలే ఎక్కువ**

ఎక్కువశాతం ఆడవాళ్లు బ్రెస్ట్ క్యాన్సర్?కి సర్జరీ చేయించుకుంటారు. వాటిలో కూడా రకాలున్నాయి. అయితే, పేషెంట్ పరిస్థితులు, కొన్ని వేరే కారణాల రీత్యా ట్రీట్?మెంట్ ఇస్తారు. వాటిలో బ్రెస్ట్ కన్జర్వింగ్ సర్జరీ లేదా మాస్టెక్టమీ ట్రీట్?మెంట్?లో క్యాన్సర్‌ని వీలైనంతవరకు తొలగిస్తారు. మరో పద్ధతిలో చేతి కింద ఉన్న లింఫ్ నోడ్స్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు యాక్జిలరీ లింఫ్ నోడ్ డిసెక్షన్ చేస్తారు. బ్రెస్ట్ రీకన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్‌లో క్యాన్సర్ తొలగించి, రొమ్ము ఆకారాన్ని తిరిగి మామూలు స్థితికి తెస్తారు. చివరిగా పల్లేటివ్ ఇంటెంట్‌లో అడ్వాన్స్‌డ్ సింప్టమ్స్, అంటే లక్షణాల నుంచి కొంత ఉపశమనాన్ని ఇస్తారు.

**రిస్క్ ఎప్పుడంటే..**

బ్రెస్ట్ బయాప్సీ చేసినప్పుడు లోబ్యులార్ కార్సినోమా ఇన్ సిటు (ఎల్?సిఐఎస్) లేదా బ్రెస్ట్?లో కణాలు లేదా కణజాలం ఎక్కువగా ఉండడం (హైపర్ ప్లేసియా) వల్ల రిస్క్ పెరుగుతుంది. ఫ్యామిలీ హిస్టరీలో తల్లి, సోదరి, కూతురు ఉంటే ఎక్కువ అయ్యే అవకాశం ఉంది. యంగ్ ఏజ్?లో వస్తే, రిస్క్ కూడా ఎక్కువే. అయినప్పటికీ, ఫ్యామిలీ హిస్టరీ లేకున్నా ఎఫెక్ట్ అవుతున్నారు చాలామంది. రేడియేషన్?కి ఎక్స్?పోజ్ అవ్వడం వల్ల వచ్చే ఛాన్స్ ఉంది. చిన్నప్పుడు లేదా యంగ్ ఏజ్?లో రేడియేషన్ ట్రీట్?మెంట్ తీసుకుని ఉంటే బ్రెస్ట్? క్యాన్సర్ రిస్క్ ఎక్కువ అవుతుంది.

ఒబేసిటీ ఉన్నా, పెద్ద వయసులో లేదా 30 ఏండ్లు దాటాక మొదటి కాన్పు జరిగిన వాళ్లకు, పదకొండేండ్ల వయసులో పీరియడ్స్ రావడం మొదలయినా, మెనోపాజ్ మొదట్లో రిస్క్ ఎక్కువ. ఎక్కువసార్లు ప్రెగ్నెంట్ అయినవాళ్లతో పోలిస్తే అసలు ప్రెగ్నెంట్ కాకుండా ఉన్నవాళ్లకు రిస్క్. పోస్ట్ మెనోపాజల్ హార్మోన్ థెరపీ చేయించుకుంటున్న వాళ్లు, వాటికి హార్మోన్? టాబ్లెట్స్ వాడేవాళ్లలో ఎక్కువ. మెడికేషన్స్ ఆపేస్తే రిస్క్ తగ్గుతుంది. సర్వైవల్ రేట్ చూస్తే, మొదటి రెండు స్టేజ్?ల్లో 90 పైనే ఉంది. మూడో స్టేజ్?లో 70 శాతం, చివరి స్టేజ్?లో 20 శాతం మాత్రమే ఉంది.

కాబట్టి, ఒక్కమాటలో చెప్పాలంటే... ఒక పొలంలో అన్నీ మంచి మొక్కలే ఉండవు. పంటను పాడు చేసే పిచ్చి మొక్కలు కూడా పెరుగుతుంటాయి. వాటిని గుర్తించి వెంటనే పెరికివేయకపోతే, పంటకే నష్టం. బ్రెస్ట్ క్యాన్సర్? కూడా అలాంటిదే. ఒక్కసారి క్యాన్సర్ కణాలు పెరిగితే వాటిని తీసేసే ప్రయత్నం చేయాలి. లేదంటే అది మిగతా భాగాలకు వ్యాపించి, ప్రాణాలకే ముప్పు తెస్తుంది.

**డాక్టర్‌తో పనిలేకుండా..**

డాక్టర్? దగ్గరికి వెళ్లకుండా బ్రెస్ట్ క్యాన్సర్ ఉందో లేదో బ్రెస్ట్ సెల్ఫ్ ఎగ్జామినేషన్ (బిఎస్?ఇ) ద్వారా తెలుసుకోవచ్చు. ఇది ఒక కామన్ స్క్రీనింగ్ మెథడ్. దీన్ని ఎవరైనా స్వయంగా టెస్ట్ చేసుకోవచ్చు. ఏం చేయాలంటే... రెండు రొమ్ము భాగాల్లో చేత్తో టచ్ చేసినప్పుడు గడ్డ (లంప్స్), వాపు, ఆకారంలో మార్పు ఉంటే అనుమానించాలి. అంతేకాకుండా, ఈ మెథడ్?లో ఏడు రకాల స్టెప్స్ ఉంటాయి. అవేంటంటే... పొజిషన్స్, పెరీమీటర్, పాల్పిటేషన్, ప్రెజర్, ప్యాటర్న్, ప్రాక్టీస్, ప్లానింగ్. ట్రీట్?మెంట్? చేయాలంటే రెగ్యులర్?గా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ అనేది అవసరం. మొదటి రెండు స్టేజ్?ల్లో తెలిస్తే ట్రీట్?మెంట్ చేయడం ఈజీ అవుతుంది. రెగ్యులర్ స్క్రీనింగ్ ద్వారా ఈ ముప్పును తగ్గించొచ్చు.

**రిస్క్ తగ్గించాలంటే..**

వయసు పైబడడం లేదా జన్యుపరంగా వచ్చినా కూడా రిస్క్ తగ్గించొచ్చు. బ్రెస్ట్ క్యాన్సర్ రిస్క్ తగ్గాలంటే చాలా మార్గాలు ఉన్నాయి. అవేంటంటే... శరీర బరువు వయసుకు తగ్గట్టు ఉంచుకోవాలి. ఫిజికల్? యాక్టివిటీలు ఎక్కువగా చేయాలి. ఆల్కహాల్ తాగడం మానేయాలి లేదా మోతాదు అయినా తగ్గించాలి. పసిపిల్లలకు తల్లి పాలు ఇవ్వడం వల్ల కూడా రిస్క్ తగ్గుతుంది. ఒకవేళ ఫ్యామిలీ హిస్టరీలో ఉండి ఆ వ్యక్తికి ఎఫెక్ట్? అయి ఉంటే, జీన్స్ ఉన్నాయేమో చూడాలి.

ఏదేమయినా ఈ సమస్య నుంచి బయటపడాలంటే హెల్దీగా ఉండాలి. అప్పుడే రిస్క్? తగ్గుతుంది. ఎంత త్వరగా కనుక్కుని, ట్రీట్?మెంట్ తీసుకుంటే అంత బాగా నయం అవుతుంది. ట్రీట్?మెంట్?లో సర్జరీ, రేడియేషన్, మెడికేషన్స్? మొదట్లోనే ట్రీట్?మెంట్ స్టార్ట్ చేయొచ్చు. 'ది అమెరికన్ క్యాన్సర్ సొసైటీ' (ఎసిఎస్) రిపోర్ట్స్ ప్రకారం, మొదట్లోనే ట్రీట్మెంట్ చేయించుకున్నవాళ్లు ఐదేండ్లు, అంతకంటే ఎక్కువకాలం బతికినట్టు చెప్తున్నాయి. అయితే, చివరి స్టేజ్‌లో అయితే ఎక్కువకాలం ట్రీట్‌మెంట్ తీసుకోవాల్సి వస్తుంది.

# మధుమేహం యొక్క క్రూరమైన ప్రభావాలు ఇవి, సమయానికి వీటిని నియంత్రించకపోతే ప్రాణాంతకమే..





నియంత్రణ లేని లేదా సరిగా నిర్వహించబడని, మధుమేహం మీ ఆరోగ్యం యొక్క వివిధ అంశాలపై అనేక హానికరమైన ప్రభావాలను కలిగి ఉంటుంది. డయాబెటిస్‌లో వివిధ రకాలు ఉన్నాయి, వీటిలో టైప్ 1 డయాబెటిస్, టైప్ 2 డయాబెటిస్ మరియు జెస్టేషనల్ డయాబెటిస్ ఉన్నాయి. మధుమేహాన్ని నివారించడానికి, ఆరోగ్యకరమైన ఆహారం మరియు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడం చాలా ముఖ్యం. డయాబెటిస్ మీకు హాని కలిగించే (బ్రూటల్ ఎఫెక్ట్స్ ఆఫ్ డయాబెటిస్) 10 విషయాలు ఇక్కడ ఉన్నాయి. గుండె సమస్యలు మధుమేహం గుండెపోటు, స్ట్రోక్ మరియు పెరిఫెరల్ ఆర్టరీ వ్యాధి వంటి హృదయ సంబంధ వ్యాధులను అభివృద్ధి చేసే ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక రక్త చక్కెర స్థాయిలు రక్త నాళాలను దెబ్బతీస్తాయి మరియు ఫలకం ఏర్పడటానికి దోహదం చేస్తాయి, ధమనుల సంకుచితం మరియు రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. నరాల నష్టం (నరాలవ్యాధి) రక్తంలో అధిక చక్కెర స్థాయిలకు దీర్ఘకాలిక బహిర్గతం నరాల దెబ్బతినడానికి దారితీస్తుంది, సాధారణంగా చేతులు మరియు కాళ్ళలో తిమ్మిరి, జలదరింపు మరియు నొప్పి వంటి లక్షణాలను కలిగిస్తుంది. ఈ పరిస్థితిని డయాబెటిక్ న్యూరోపతి అంటారు. మీ లైంగిక శక్తి పెంచుకోవడానికి.. ఆనందాన్ని రెట్టింపు చేసుకోవడానికి బీట్ రూట్, గుమ్మడి గింజలతో పాటు మరో 3 ఫుడ్స్ మూత్రపిండాల నష్టం (నెఫ్రోపతి) మూత్రపిండాల వ్యాధికి మధుమేహం ప్రధాన కారణం. కాలక్రమేణా, అధిక రక్తంలో చక్కెర స్థాయిలు మూత్రపిండాలలోని రక్త నాళాలను దెబ్బతీస్తాయి, శరీరం నుండి వ్యర్థాలను మరియు అదనపు ద్రవాన్ని ఫిల్టర్ చేసే సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. ఇది దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధికి పురోగమిస్తుంది మరియు చివరికి డయాలసిస్ లేదా మూత్రపిండ మార్పిడి అవసరమవుతుంది. వేడి నీళ్లు చల్లటి నీళ్లు.. బరువు తగ్గడానికి ఏది బెటర్ అంటే? కంటి సమస్యలు (రెటినోపతి) డయాబెటిస్ రెటీనాలోని రక్తనాళాలపై ప్రభావం చూపుతుంది, ఇది డయాబెటిక్ రెటినోపతి అనే పరిస్థితికి దారితీస్తుంది. ఇది దృష్టి సమస్యలను కలిగిస్తుంది మరియు చికిత్స చేయకుండా వదిలేస్తే, తీవ్రమైన దృష్టి నష్టం లేదా అంధత్వానికి కూడా దారితీస్తుంది. పాదాల సమస్యలు మధుమేహం వలన పాదాలలో రక్త ప్రసరణ సరిగా జరగదు మరియు నరాల దెబ్బతింటుంది, దీని వలన వ్యక్తులు పాదాల పుండ్లు, ఇన్ఫెక్షన్లు మరియు నెమ్మదిగా గాయం నయం అయ్యే అవకాశం ఉంది. తీవ్రమైన సందర్భాల్లో, ఇది పాదం లేదా కాలు యొక్క విచ్ఛేదనానికి దారితీస్తుంది. చర్మ పరిస్థితి పొడి



చర్మం, ఫంగల్ మరియు బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు, దురద మరియు నెమ్మదిగా గాయం నయం చేయడం వంటి వివిధ చర్మ సమస్యలకు మధుమేహం దారితీస్తుంది. అధిక రక్త చక్కెర స్థాయిలు బ్యాక్టీరియా మరియు శిలీంధ్రాల పెరుగుదలకు అనుకూలమైన వాతావరణాన్ని అందిస్తాయి. సంక్రమణ ప్రమాదం పెరిగింది మధుమేహం రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది, వ్యక్తులు ఇన్ఫెక్షన్ల బారిన పడే అవకాశం ఉంది. మధుమేహం ఉన్నవారిలో సాధారణ అంటువ్యాధులు మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లు, చర్మ వ్యాధులు మరియు పునరావృతమయ్యే ఈస్ట్ ఇన్ఫెక్షన్లు. నోటి సమస్యలు మధుమేహం చిగుళ్ల వ్యాధి (పీరియాడోంటిటిస్) మరియు దంత క్షయం ప్రమాదాన్ని పెంచుతుంది. రక్తంలో అధిక చక్కెర స్థాయిలు నోటిలో బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదం చేస్తాయి మరియు నోటి ఇన్ఫెక్షన్లతో పోరాడే శరీర సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. మానసిక ఆరోగ్య సమస్యలు డయాబెటిస్ డిప్రెషన్ మరియు యాంగ్జయిటీ వంటి మానసిక ఆరోగ్య రుగ్మతల ప్రమాదాన్ని పెంచుతుంది. మధుమేహం వంటి దీర్ఘకాలిక పరిస్థితిని నిర్వహించడం మానసికంగా సవాలుగా ఉంటుంది మరియు ఒక వ్యక్తి యొక్క మొత్తం శ్రేయస్సును ప్రభావితం చేస్తుంది. (నిరాకరణ: ఇక్కడ ఇవ్వబడిన సమాచారం ఇంటి నివారణలు మరియు సాధారణ సమాచారంపై ఆధారపడి ఉంటుంది. దానిని స్వీకరించే ముందు తప్పనిసరిగా వైద్య సలహా తీసుకోవాలి. తెలుగు బోల్డ్ స్కై దీనిని ధృవీకరించలేదు.)

# ఆయుష్షుతో పాటు ఆరోగ్యం.. డబ్బు ఖర్చులేని సింపుల్ హెల్త్ సీక్రెట్స్!!

**చాలామంది తాము ఆరోగ్యంగా ఉండటం లేదని బాధపడుతుంటారు. ఏం చేసినా ఆరోగ్యం రావడంలేదని మదన పడుతుంటారు. మరికొందరు వయసు పెరుగుతున్న కొద్దీ ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతూ ఉంటారు. బాధలు, ఆలోచనలు, ఆందోళనలు పక్కన పెట్టి ప్రతీ ఒక్కరూ చెయ్యాల్సిన చిన్న చిన్న పనులు ఉన్నాయి. అవి డబ్బుతో కూడుకున్న పనులు కూడా కాదు. ఇక వాటిని అనుసరిస్తే కచ్చితంగా ఆరోగ్యం మీ సొంతం అయ్యి తీరుతుంది. ఇక ఆయుష్షు తో పాటు ఆరోగ్యం కోసం ఆలోచించే వారి కోసం సింపుల్ చిట్కాలను ఇక్కడ మీకందిస్తున్నాం. ఈ మూడే యువతలో అనారోగ్యాలకు కారణం ఒక వ్యక్తి ఆరోగ్యం కానీ ఆయుష్షు కానీ వారి జీవన విధానం పై ఆధారపడి ఉంటుంది. మనం తీసుకునే ఆహారం, మన లైఫ్ స్టైల్ , శారీరక శ్రమ, మానసిక ఒత్తిడిని బ్యాలెన్స్ చేసుకోవడం వంటి అంశాలపై మన ఆరోగ్యంతో పాటు మన ఆయుష్షు కూడా ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత సమాజంలో పరుగుల ప్రపంచంలో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టకుండా పరుగులు పెడుతున్న యువత, సమయానికి నిద్ర పోరు. సమయం ప్రకారం భోజనం చెయ్యరు. శరీరానికి చేటు చేసే జంక్ ఫుడ్స్ తినటానికి అలవాటు పడుతున్నారు.**






శారీరక శ్రమ అసలే లేదు. తీరా అనారోగ్యాల బారిన పడిన తర్వాత ఆరోగ్యం కోసం వెంపర్లాడుతున్నారు. ఈ మూడు పనులు క్రమపద్ధతిలో చేస్తే ఆరోగ్యం, ఆయుష్షు ఇక ఆ పరిస్థితి రాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా పాటించవలసిన చిన్న చిన్న నియమాలు ఉన్నాయి. ఆ నియమాలలో మొదటిది వ్యాయామం చేయటం. రెండవది సరైన ఆహారం. మూడవది కంటి నిండా నిద్ర. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా శరీరాన్ని దృఢంగా ఉంచుకోవడమే కాకుండా, మానసికంగానూ దృఢత్వం లభిస్తుంది. మనిషి ఆరోగ్యంగా ఉండటానికి వ్యాయామం ఎంతగానో దోహదం చేస్తుంది. ఒత్తిడిని తగ్గించడానికి వ్యాయామం ఎంతగానో ఉపయోగపడుతుంది. కాబట్టి ఆరోగ్యంగా ఉండాలనుకునే వారు తమ జీవితంలో వ్యాయామం చేయడాన్ని ఒక భాగం చేసుకోవాలి. ఈజీగా బరువును తగ్గించే నాలుగు వంటింటి పదార్థాలు ఇవే!! నిద్ర, ఆహారం విషయంలో గుర్తు పెట్టుకోవాల్సిన అంశాలివే సరైన సమయానికి నిద్రపోవడం, అనవసరమైన ఆందోళనలు మనసుకు తీసుకోకుండా ఉండడం, ప్రశాంతంగా జీవించడానికి ప్రాధాన్యతనివ్వడం, ఉదయాన్నే సూర్యోదయాన వాకింగ్ చేయడం వంటి లక్షణాలు మనిషి ఆయుర్దాయాన్ని, ఆరోగ్యాన్ని పెంచుతాయి. రోజూ కనీసం 8 గంటలైనా నిద్రపోవాలి. నిద్ర మనిషికి లేచిన తరువాత పని చేసే శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తుంది. ఇక ఆహారం విషయంలో జాగ్రత్త వహించాలి. తాము ఏం ఆహారం తీసుకుంటున్నాం? ఏ సమయానికి భోజనం చేస్తున్నాం? తాము తినే ఆహారంలో పోషకాలు ఎన్ని ? వంటి వివరాలను గుర్తించి తదనుగుణంగా ఆహారం తీసుకోవాలి. బయట జంక్ ఫుడ్స్ కు గుడ్ బై చెప్పాలి.రూ. 8 కోట్ల విలువైన ఫ్లాట్ కొనుగోలు చేసిన సమంత.. ఎక్కడంటే..! జీవనశైలి మార్పులతో మంచి ఆరోగ్యం... ఆపై మంచి ఆయుష్షు వ్యాయామం, ఆహారం, నిద్ర మూడు విషయాల్లో జాగ్రత్తలు తీసుకుని జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు అని వైద్య నిపుణులు పదే పదే చెబుతున్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసుకుంటే రోగాల బారి నుండి బయటపడతారు. అంతేకాదు అనారోగ్యాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉన్నవారి ఆయుష్షు కూడా పెరుగుతుంది. అందుకే ఆయుష్షు, ఆరోగ్యం రెండూ కావాలంటే ఈ జీవన విధానం అలవాటు చేసుకోండి.

# గురుదక్షిణ - మాతృదక్షిణ



పట్టువదలని విక్రమార్కుడు చెట్టు వద్దకు తిరిగి వెళ్లి, చెట్టుపైనుంచి శవాన్ని దించి భుజాన వేసుకుని, ఎప్పటిలాగే మౌనంగా శ్మశానం కేసి నడవ సాగాడు. అప్పుడు శవంలోని బేతాళుడు, "రాజా, అర్ధరాత్రి వేళ, భీతగొలిపే ఈ స్మశానంలో, తల పెట్టిన కార్యం సాధించేందుకు, దృఢ సంకల్పంతో నువ్వు చేస్తున్న ధైర్య సాహసాలు మెచ్చదగినవే. అయితే వాటితో పాటు మనిషికి లోకజ్ఞత, సమయస్ఫూర్తి, లక్ష్య శుద్ధి ఎంతో అవసరం. అవి లేనివాడు కార్యం సిద్ధించే తరుణంలో దాన్ని చేజేతులా జారవిడవడం జరుగుతుంది. ఇందుకు ఉదాహరణంగా సునందుడనే వాడి కథ చెబుతాను, శ్రమ తెలియకుండా విను" అంటూ ఇలా చెప్ప సాగాడు



పూర్వం విరూపదేశానికి బృహస్పతి లాంటి బుద్ధిశాలి అయిన మంత్రి వుండేవాడు. మహారాజు శూరసేనుడు ప్రతి విషయానికి మంత్రి మీదనే ఆధార పడేవాడు. ఆయన పాలనలో దేశం సుభిక్షంగా వుంది. దురదృష్టవశాత్తు మహామంత్రి అకాల మరణానికి గురయ్యాడు. శూరసేనుడు కొత్త మంత్రిని ఎన్నుకుని, ఆయన సలహాలతో రాజ్య పాలన చేయ సాగాడు.కొత్త మంత్రికి రాజును మెప్పించడం బాగా తెలుసు కానీ, సలహాలివ్వడం బొత్తిగా చేత కాదు. అయినా తనకు తోచిన సలహాలిస్తూంటే రాజ్యపాలన అస్తవ్యస్తంగా సాగింది. కొందరు రాజుకీ విషయం చెబితే ఆయన అంగీకరించి, "మంత్రి సలహా తోనే రాజ్యం సుభీక్షంగా వుంది. మంత్రి అన్నవాడు తప్పుడు సలహాలివ్వలేదు. రాజ్యంలో ఇబ్బందులు వస్తే అవి తాత్కాలికం," అన్నాడు.చివరకు రాజగురువు కూడా శూరసేనుడిని, మంత్రి సలహాల గురించి హెచ్చరించాడు. రాజు నవ్వి, "గురువర్యా! తమకు దేవకార్యాల గురించి తెలిసినట్లు రాజకార్యాల గురించి తెలియదు. పాత మంత్రి సలహాలను కూడా ఆరంభంలో కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారు. కొత్త మంత్రి సలహాల గొప్పతనం, కొద్ది కాలంలోనే అందరూ అర్థం చేసుకుంటారు" అన్నాడు.అందుకు రాజగురువు ఏమి అనలేక పాత మంత్రి ఇంటికి వెళ్ళాడు. పాత మంత్రి భార్య ఆయనకు నమస్కరించి ఉచితాసనం చూపించింది. రాజ గురువు ఆమెను ఆశీర్వదించి, "అమ్మాయీ! మహారాజు శూరసేనుడు, నీ భర్త వల్ల బాగా ప్రభావితుడైనాడు. కానీ నీ భర్త మంత్రి స్థానాన్ని ఇప్పుడొక మూరు?డు ఆక్రమించాడు. వాడు తన తప్పుడు సలహాలతో దేశానికి హాని కలిగిస్తున్నాడు. మెచ్చుకోలు కబుర్లతో రాజుని మెప్పించి, తన స్థానం పటిష్ఠం చేసుకున్నాడు. కేవలం మంత్రి సలహాలపైనే ఆధార పడడం, ఏ రాజుకూ మంచిదికాదని శూరసేనుడు గ్రహించలేకపోతున్నాడు. ప్రస్తుతానికి మనం చేయగలిగిందేమీ లేదు. కాని నువ్వు దేశానికొక ఉపకారం చేయాలి. నీ కుమారుడు సునందుడికిప్పుడు పదేళ్ళ వయసు గదా! చండకారణ్యం లోని వితండుడి గురుకులాశ్రమానికి వాణ్ని పంపు. వితండుడు నీ కుమారుడిని విచక్షణ జ్ఞానం గల మహా మంత్రిగా తీర్చి దిద్దుతాడు. నీ కుమారుడు విద్య ముగించుకుని తిరిగి వచ్చేవరకూ, మన దేశానికి మోక్షం లేదు," అన్నాడు.పాత మంత్రి భార్య అందుకు సరేనని అలాగే చేసింది. పదేళ్ళ వయసులో సునందుడు, తల్లిని విడిచి చండకారణ్యం చేరుకున్నాడు.అక్కడ వితండుడు, వాణ్ణి చూసి విషయమడిగి తెలుసుకుని, "గురుకులానికి జ్ఞాన సముపార్జన కోసం రావాలి. మంత్రి పదవిని ఆశించి రాకూడదు. అయినా నీకింకా పదవి గురించి ఆలోచించే వయసు రాలేదు." అన్నాడు.సునందుడు వితండుడికి నమస్కరించి, "గురువర్యా! నా తండ్రి మంచి సలహాలతో మహారాజుకు సాయ పడిన మాట నిజం. ఆ విధంగా దేశానికి ఉపకారం జరిగింది. కానీ నా తండ్రి కారణంగా రాజుకు మంత్రి సలహాలన్నీ మంచి సలహాలేనన్న దురభిప్రాయం కలిగింది. అది తొలగించాల్సిన భాధ్యత నాది. సమర్థుడైన మంత్రి, రాజులో విచక్షణా జ్ఞానాన్ని పెంచుతాడు తప్ప, అన్నింటికీ తనపై ఆధారపడేలా చేయడు. నా తండ్రి చేసిన తప్పును సవరించడం కోసమే నేను తమ వద్దకు వచ్చాను." అన్నాడు.వితండుడు, సునందుణి దీవించి, "నీలో గొప్ప తెజస్సుంది. నీ మాటలు వయసుకు మించిన తెలివిని సూచిస్తున్నాయి. నిన్ను సకల శాస్త్ర పారంగాతుడిని చేసి, నా తర్వాత ఈ గురుకులాన్ని నీకి అప్పగించాలనిపిస్తోంది. అయితే, నీ అభిప్రాయం కూడా న్యాయమైనదే! కానీ ఒక్క విషయం గుర్తుంచుకో! కేవలం ఉద్యోగం, పదవిని ఆశించి చదివేవాడు, జీవితంలో ఎందుకూ కొరగాకుండా పోతాడు." అన్నాడు.సునందుడు వినయంగా తలవంచి ఊరుకుని, ఆ రోజే విద్యాభ్యాసం ప్రారంభించాడు. వితండుడు వాడికి అన్నీ నేర్పుతూనే రాజరికం, మత్రంగాల గురించి కూడా వివరిస్తుండేవాడు. ఆ విధంగా మూడు సంవత్సరాలు గడిచేసరికి, వాడు తనకంటేముందు చేరినవారిని కూడా అధిగమించి గురుకులంలో ప్రథముడుగా నిలిచాడు.ఒక రోజు వితండుడు శిష్యులు అందర్నీ సమావేశ పరించి, "మీ లో రమాకాంతుడు ఎందుకూ కోరగానివాడని గుర్తించాను. ఇన్నేళ్ళ నా శిక్షణ వాడి విషయంలో వృధా అయిందని నాకెంతో బాధగా వుంది. మీలో ఎవరైనా వాడి బాధ్యతను స్వీకరించి, వాడి మెదడులో రవ్వంత జ్ఞానాన్ని ప్రవేశించ పెట్టినా, నాకు సంతోషం. అలా చేసినవాడికి నా తదనంతరం గురుకులం అప్ప జెబుతాను." అన్నాడు.ఇది వింటూనే రమాకాంతుడు కోపంగా లేచి, "నా సాటి వారిచేత పాఠాలు చెప్పించుకునేందుకు నేనిక్కడికి రాలేదు. నలుగురి ముందూ నా గురువే నన్నిలా అవమానించాక, నాకిక్కడ పనేముంది?" అని వెళ్ళిపోయాడు.అప్పుడు వితండుడు నిట్టూర్చి, "రమాకాంతుడికి మంత్రి కావాలన్న కొరిక బలంగా వుంది. అందువల్ల ఏ విద్య అబ్బలేదు." అన్నాడు.మరొక రెండు సంవత్సరాలకు సునందుడి విద్యాభ్యాసం పూర్తయ్యింది. వాడు వితండుడిని గురుదక్షిణగా ఏమి కావాలని అడిగాడు."నువ్వు నా గురుకులాన్ని నడుపుతానంటే అదే నాకు గురుదక్షిణ!" అన్నాడు వితండుడు."గురువర్యా! గురువుకంటే ప్రథమ స్థానం తల్లిదని సర్వ శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. మాతృదక్షిణను కాదని గురుదక్షిణ ఇమ్మని తమరాదేసిస్తే, అలాగే చేస్తాను!" అన్నాడు సునందుడు."పదిహేనేళ్ళ వయసుకే ఇంతవాడివయ్యావు. నీ జ్ఞానం ఒక రాజ భావనానికీ, నీ తెలివి ఒక రాజుకు పరిమితం కావడం ఇష్టం లేక అలా అన్నాను. నీ మనసుకు తోచిన పని ఏది చేస్తే, అదే నా గురు దక్షిణ. వెళ్లిరా నాయనా!" అన్నాడు.ునందుడు విరూపదేశారిగ వెళ్ళాడు. సూరసేనుడు ఇప్పుడు రాజ్యమేలడం లేదని, ఆయన అనారోగ్యంతో మంచం పట్టడం వల్ల మూడు సంవత్సరాల నించి ఆయన కుమారుడు వీరసేనుడు రాజ్యమేలుతున్నాడని తెలుసుకున్నాడు.వీరసేనుడు గొప్ప అహంకారి. అన్నీ తనకే తెలుసనుకుంటాడు. తనకు సలహాలివ్వడానికి కాక, తను చెప్పింది అవుననడానికి మంత్రి కావాలి అతడికి! తన తండ్రి సూరసేనుడిని మెప్పించిన మంత్రి అనర్హుడని అంతా అనడం వల్ల, కొత్త మంత్రి కోసం ప్రకటన చేశాడు.సునందుడు ఇల్లు చేరగానే తల్లి ఈ విషయాలన్నీ చెప్పి, "నువ్వు సరైన సమయానికి వచ్చావు. రేపే వీరసేనుడు కొత్త మంత్రిని ఎన్నుకోబోతున్నాడు. నువ్వాయనకు మంత్రివై, తండ్రిని మించిన తనయుడనిపించుకోవాలి." అన్నది.దురదృష్టం కొద్ది ఆ రాత్రే సునందుడికి ఒళ్ళు తెలియని జ్వరం వచ్చింది. అప్పుడు రాజగురువు వచ్చి వాణ్ణి కలుసుకుని, "నాయనా! కొత్త మంత్రి ఎన్నిక అయిపోయింది. నీవు వచ్చినట్లు నాకు ఆలస్యంగా తెలిసింది. ఇప్పటికైనా సమయం మించిపోలేదు. నాతొ వస్తే రాజుకు నిన్ను పరిచయం చేస్తాను. నేను చెబితే ఇద్దరు మంత్రులను తీసుకునేందుకు రాజు వెనకాడడు. ప్రస్తుత పరిస్థితిలో దేశానికి నీ అవసరం ఎంతైనా వుంది." అన్నాడు.సునందుడు అందుకు అంగీకరించినా, ముందుగా కొత్త మంత్రిని కలుసుకుని మాట్లాడాలన్నాడు. రాజగురువు వాణ్ణి కొత్త మంత్రి వద్దకు తీసుకు వెళ్ళాడు. వితండుడు ఎందుకూ పనికి రానివాడని తీర్మానించిన రమాకాంతుడక్కడ వాడికి కొత్త మంత్రి వేషంలో దర్శనమిచ్చాడు.ఇద్దరూ పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకున్నాక, రాజగురువు రామాకంతుడికి తన మనసులోని మాట చెప్పాడు. అందుకు రమాకాంతుడు ఎంతో సంతోషించి, "మనమిద్దరం కలిసి మంత్రులుగా ఒకే రాజు వద్ద పనిజేయడం, నా అదృష్టంగా భావిస్తాను." అన్నాడు. సునందుడు మాత్రం రామాకాంతుడి భుజం తట్టి, "నేను నిన్ను అభినందించాలని వచ్చాను. గురువుగారు గురుకులం బాధ్యతా తీసుకుంటే, అదే నా గురుదక్షిణ అన్నారు. ఆయన మాట కాదనలేను. నేనిప్పుడు చండకారణ్యానికి వెళుతున్నాను." అని ఇంటికిపోయి, తల్లిని వెంటబెట్టుకుని చండకారణ్యం లోని గురుకులానికి బయలుదేరాడు.భేతాళుడు ఈ కథ చెప్పి, "రాజా, గురుదక్షిణకంటే, మాతృదక్షిణ ముఖ్యమని రాజ్యానికి తిరిగి వచ్చి మంత్రి కాదలచిన సునందుడు, మనసెందుకు మార్చుకున్నాడు? వీరసేనుడు కొత్త మంత్రిని కాదలచిన సునందుడు, మనసెందుకు మార్చుకున్నాడు? వీరసేనుడు కొత్త మంత్రిని ఎన్నుకునే రోజునే తనకు జ్వరం వచ్చి ఇల్లు కదలలేకపోవడం దైవ సంకల్పం అనుకున్నాడా? అలా కాక, రామాకాంతుడి వంటి పనికిమాలిన వాడితో కలిసి పని చేయడం అవమానంగా భావించాడా? అన్నిటినీ మించి, అలాంటి అసమర్థుడు మంత్రిగా ఉన్నప్పుడే రాజుకు తనబోటివాడి అవసరం అతిముఖ్యమని ఎందుకు గ్రహించలేక పోయాడు? వితండుడి వంటి ఉద్దండ పండితుడి వద్ద శిక్షణ పొందినా సునందుడిలో లోకజ్ఞానం, సమయ స్ఫూర్తి, లక్ష్యశుద్ధీ లోపించడానికి కారణం ఏమిటి? ఈ సందేహాలకు సమాధానం తెలిసికూడా చెప్పకపోయావో, నీ తల పగిలిపోతుంది." అన్నాడు.దానికి విక్రమార్కుడు, "తన విద్యా, తెలివితేటలూ ఒక రాజుకు పరిమితం చేయకుండా, ఎందరికో ఉపయోగపడేలా చేయమని గురువు చెప్పినా వినకుండా, సునందుడు ఇంటికి తిరిగి వచ్చాడు.

అందుకు కారణం వాడికి తల్లీ, రాజగురువుల పట్ల గల భక్తీ గౌరవాలు. అయితే, కొత్త రాజు వీరసేనుడు మంత్రిని ఎన్నుకున్న తీరు వాడిని ఆశ్చర్య పరచాడమేగాక, ఆలోచించేలా చేసింది.

వీరసేనుడు అహంకారే కావచ్చు, కాని తెలివైనవాడు. ఆయన తెలివితక్కువ వాడైతే, మంత్రి తెలివైనవాడైనా తెలివి వృధా. సునందుడు తెలివైనవాడు కాబట్టి తన సలహాలతో రాజుకు సాయపడగలడు. అయితే రాజు తన తెలివి అంటా వెచ్చించి రామాకాంతుడిని మంత్రిగా ఎన్నుకున్నాడు. ఒక తెలివైనవాడు రామాకాంతుడి లాంటి వాణ్ణి మంత్రిగా ఎన్నుకున్నాడాంటే అర్థమేమిటి? ఆయన దృష్టిలో మంత్రి పదవికి ఏమాత్రమూ విలువు లేదన్న మాట. అది కేవలం అలంకారప్రాయం మాత్రమే. అలాంటి మంత్రి పదవికోసం, సునందుడు తన విద్యావిజ్ఞానాలను వృధా చేసుకుంటే, అది మాతృ దక్షిణ అనిపించుకోదు. అందుకే వాటిని గురుదక్షిణ గా ఇచ్చి, గురుకులాన్ని సమర్ధవంతంగా నడిపి, తన జీవితాన్ని సార్థకం చేసుకుందామని అనుకున్నాడు.


# ఉల్లిపాయల పండుగ!



రకరకాల ఉత్సవాల గురించి విని ఉంటారు. ఎన్నో పండుగలు జరుపుకొని ఉంటారు. కానీ స్విట్జర్లాండ్‌లో జరిగే ఒక ఉత్సవం మాత్రం చాలా భిన్నమైంది. ఎందుకంటే ఈ ఉత్సవంలో ఉల్లిపాయలను అలంకరించి ప్రదర్శిస్తారు.

ఏటా స్విట్జర్లాండ్‌లో ఆనియన్ ఫెస్టివల్ నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఉల్లిపాయలను పోలిన దుస్తులు ధరిస్తారు. ఆట పాటలతో సందడిగా గడుపుతారు. ఉత్సవంలో ఎటుచూసినా రకరకాల రూపాల్లో అలంకరించిన ఉల్లిపాయలే కనిపిస్తాయి. వ్యాపారులు, రైతులు ఉల్లిపాయలను అలంకరించి ప్రదర్శనకు పెడతారు. ఈ ఫెస్టివల్‌ను చూడడానికి దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. రకరకాలుగా అలంకరించిన ఉల్లిపాయలను కొనుగోలు చేయడానికి సందర్శకులు ఆసక్తి చూపిస్తారు. ఇక ఫెస్టివల్‌లో ఉల్లిపాయలతో చేసిన రకరకాల వంటలు నోరూరిస్తాయి.

# చెక్కుచెదరని టవర్!




వందేళ్ల క్రితం నిర్మించిన పద్నాలుగు అంతస్థుల టవర్ ఇప్పటికీ చెక్కు చెదరలేదు. లండన్‌లోని స్వే అనే గ్రామంలో ఉన్న ఈ టవర్ నిర్మాణం వెనకఅనేక విశేషాలున్నాయి.ఆండ్రూ థామస్ అనే వ్యక్తి ఈ టవర్ నిర్మించాడు. 1879లో మొదలెట్టి 1985లో పూర్తిచేశారు. ఈ కట్టడానికి 40 మంది కూలీలు ఆరేళ్లపాటు శ్రమించారు. ఈ టవర్ 216 అడుగుల ఎత్తు, 18 అడుగుల వ్యాసార్థంతో ఉంటుంది. ఈ టవర్ ప్రత్యేకత ఏమిటంటే దీని నిర్మాణంలో స్టీల్ ఉపయోగించలేదు. స్టీల్ వాడకుండా నిర్మించిన అతి ఎత్తైన నిర్మాణంగా ఈ టవర్ గుర్తింపు పొందింది. నిర్మాణం పూర్తయ్యాక చాలా ఏళ్ల వరకు నిరుపయోగంగానే ఉంది. 45 ఏళ్ల క్రితం దీన్ని నివాస గృహంగా మార్చారు. టవర్ పై భాగం విశాలంగా ఉంటుంది. వస్తువులన్నీ అమర్చుకోవడానికి కావలసినంత స్థలం ఉంటుంది.

# కాగితం పువ్వు



కావలసిన వస్తువులు:
రంగు కాగితాలు
స్ట్రా
పెన్సిల్
కత్తెర
జిగురు
టేప్

**తయారుచేయు విధానం:**
తెల్లకాగితంపై పువ్వు రేకులను గీయండి. తరువాత ఆ గీతల వెంబడి కత్తిరించండి. ఫ ఇప్పుడు మొదటి రేకును చివరి రేకును జిగురుతో అతికించండి. ఫ ఈ పువ్వును స్ట్రాకి ఒక చివర టేప్‌తో అతికించండి. పసుపు రంగు కాగితాన్ని స్ట్రాపై అతికించండి. ఆకుపచ్చరంగు కాగితంతో కొన్ని ఆకులను తయారు చేసుకోండి. ఈ ఆకులను స్ట్రాకి రెండు వైపులా అతికిస్తే కాగితం పువ్వు రెడీ!



# పట్టు తప్పితే... గల్లంతే!

మీరు చెట్లు ఎక్కగలరేమో కానీ ఈ మెట్లు ఎక్కలేరు. ఎందుకో తెలుసా? ఈ మెట్లు ఎక్కాలంటే బోలెడంత గుండె ధైర్యం కావాలి. పొరపాటున కాలు జారితే గల్లంతవ్వడం ఖాయం. వీటిని 'హైకూ మెట్లు' అని పిలుస్తారు. ఇంతకీ ఇవి ఎక్కడున్నాయో తెలుసా?అమెరికా హవాయి ద్వీపాల్లో ఒకటైన ఒహాహు ద్వీపంలో ఈ మెట్లు ఉన్నాయి. వీటిని 1942లో అమెరికా నౌకాదళం నిర్మించింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న తమ నౌకలకు రేడియో సంకేతాలు అందించడానికి ఎత్తైన ప్రదేశంలో యాంటెన్నా నిర్మించాలని నౌకాదళం భావించింది.

అందుకోసం ఈ కొండ ప్రాంతాన్ని ఎంచుకుంది. కొండపైకి చేరుకోవడానికి మెట్లు ఏర్పాటు చేసింది. మొత్తం 3922 మెట్లు ఉన్నాయి. కొన్ని చోట్ల మెట్లు కొండపైకి నిట్టనిలువుగా ఉంటాయి. ప్రకృతి ప్రేమికులు, సాహసాలను ఇష్టపడే వారు ఈ మెట్లు ఎక్కి కొండపైకి చేరుకునేందుకు ఉత్సాహం చూపుతుంటారు. కొండపై నుంచి చూస్తే ప్రకృతి సౌందర్యం ఆకట్టుకుంటుంది. ఐఅయితే ఇక్కడ ప్రమాదాలు జరగడంతో సాధారణ ప్రజలు ఈ మెట్లు ఎక్కకుండా నిషేధం విధించారు.